www.andhrajyothy.com పేజీలు: 14 వెల (Price) : Rs. 6.50 విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 17

శనివారం | 3-5-2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం తిథి: షష్ఠి ఉ.7:52 తదుపరి సప్తమి, నక్షత్రం: పునర్వసు మ.12:34 తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.8:40-10:17, దుర్ముహూర్తం: ఉ.5:51-7:33, అమృతఘడియలు: ఉ.10:13-11:47, రాహుకాలం: ఉ.9:00-10:30, సూర్యోదయం: 5:51, సూర్యాస్తమయం: 6:32

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

దేశంలోనే తొలి టెక్ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం
ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో ఒప్పందం
శక్తివంతమైన, అత్యాధునిక సిస్టమ్ స్థాపన
క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్‌తో ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్-2 ఏర్పాటు
జనవరి ఒకటిన వ్యాలీ ప్రారంభం!

2

ఆత్మగౌరవ ప్రతీక అమరావతి

ఇది కేవలం రాజధాని నగరమే కాదు.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్
రూ.49 వేల కోట్ల పనులతో పునరుజ్జీవం
మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి
తిరిగి మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తాం
నా రాజధాని ఇదీ.. అని అనుకునేలా నిర్మాణం
రాజధాని రైతుల ఉద్యమం అపూర్వం: సీఎం

12

అవకాశాల 'రాజధాని'!

ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లక్కర్లేదు
మోదీ సహకారం.. చంద్రబాబు అనుభవంతో ప్రపంచస్థాయి నగరంగా అమరావతి తథ్యం
రైతుల కష్టాలు నాకు గుర్తున్నాయి
జవాబుదారీగా ఉంటాం.. రాజధాని నిర్మిస్తాం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

జయ.. జయ.. అమరావతి

వెలగపూడికి పోటెత్తిన జన తరంగం
ప్రధాని మోదీ అభయంతో ఆనందం

2

రూ.58 వేల కోట్ల పనులకు శ్రీకారం



అమరావతిలో నవ శకం



ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్

సమగ్ర కథనాలు 12, 13లో

అండగా నిలుస్తా.. భుజం కలిపి నడుస్తా!

అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ సహకారం: మోదీ

స్వర్ణాంధ్ర సాధనకు అమరావతి 'శక్తి'!
ఏపీని అధునాతన ప్రదేశ్‌గా మార్చేస్తుంది



అమరావతి పనుల పునఃప్రారంభానికి వర్చువల్‌గా శ్రీకారం చుడుతున్న ప్రధాని మోదీ. పక్కన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, కేంద్ర మంత్రి పెమ్మసాని

ఐటీ, ఏఐ, విద్య, వైద్యానికి ఇదే 'లీడింగ్ సిటీ'
చంద్రబాబు రాకతో గ్రహాలు తొలగిపోయాయి
అమరావతి పూర్తయ్యాక ఏపీ జీడీపీకి రెక్కలు
అంతరిక్షంతోపాటు రక్షణలోనూ ఏపీ పతాక
నాగాయలంక మిస్సైల్ టెస్ట్ రేంజ్‌తో ఘనత
'జూన్ 21'న విశాఖలో యోగా చేస్తా
'అమరావతి పునఃప్రారంభ' సభలో ప్రధాని
పలు ప్రాజెక్టులకు శ్రీకారం, ప్రారంభం



అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమానికి హాజరైన జనం.. ప్రధాని మోదీ అభివాదం

చంద్రబాబుకు సాటి లేరు..

నా అనుభవంతో చెబుతున్నా! ఫ్యూచర్ టెక్నాలజీతోపాటు.. భారీ ప్రాజెక్టులను త్వరగా, అత్యుత్తమంగా పూర్తిచేయడం చంద్రబాబుకే సాధ్యం. రాష్ట్రంలోని ప్రతి యువకుడూ తన కలలు నెరవేర్చుకునే నగరంలా అమరావతి రూపుదిద్దుకుంటుంది. ఐటీ, ఏఐ, గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఇండస్ట్రీ, విద్యా, వైద్యం.. ఇలా కీలక రంగాల్లో లీడింగ్ సిటీ అవుతుంది. ఈ రంగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, రికార్డు స్థాయిలో పనులు పూర్తయ్యేందుకు కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుంది.

నాడు చంద్రబాబును చూసి టెక్నాలజీ నేర్చుకున్నా..

టెక్నాలజీలో చాలా ముందున్నానని చంద్రబాబు నన్ను ప్రశంసించారు. కానీ, ఓ రహస్యం చెబుతా. నేను గుజరాత్ సీఎం అయిన కొత్తలో.. అప్పటికే చంద్రబాబు హైదరాబాద్‌లో కూర్చుని చేస్తున్న పనులన్నీ నిశితంగా పరిశీలించేవాడిని. మా అధికారులతోనూ అధ్యయనం చేయించా. టెక్నాలజీ విషయంలో చంద్రబాబు నుంచి చాలా నేర్చుకున్నా. అప్పుడు నేర్చుకున్నవే ఇప్పుడు అమలు చేస్తున్నా. - ప్రధాని మోదీ



Resonance®
SCHOOLS WITH IIT-JEE & NEET FOUNDATION
Hyderabad



ఈ సమ్మర్‌లో మీ పిల్లలకి మీరు ఇచ్చే బెస్ట్ సమ్మర్ గిఫ్ట్!

RESONANCE RESIDENTIAL SUMMER CAMP 2025

12 రోజుల పాటు మీ పిల్లలలో Creativity, Curiosity, Competitiveness పెంచే విధంగా ప్రత్యేక ప్రోగ్రాములతో రూపొందించిన 8 రకాల daily activities

Residential Program Rs. 5,999 | Day Scholar Program Rs. 2,999

From: 7th to 18th May 2025 | 6th – 10th Classes | AC Classrooms & Hostel Facility

సమ్మర్ క్యాంపులో ప్రతిరోజు ఉండే 8 రకాల Activities & Classes
1 ప్రత్యేక IIT-JEE/NEET Foundation శిక్షణ
2 పోటీ పరీక్షలపై అవగాహన Seminars
3 ICT 360 వారి AI & రోబోటిక్స్ Projects
4 Words Worth వారి English Workshops
5 Dance, Music మరియు Drama శిక్షణ
6 ప్రతిరోజు Sports Classes మరియు Competitions
7 Daily Movie Sessions
8 కమ్యూనిటీ లివింగ్‌పై అవగాహన

About Resonance Schools
భారతదేశంలో మొట్టమొదటిసారిగా, 6వ నుండి 10వ తరగతి విద్యార్థులకు IIT-JEE/NEET Foundationతో పాటు Futuristic Curriculum మరియు Supportive Curriculum అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ Resonance Schools.
Futuristic Curriculumలో: Design & Computational Thinking, Financial Literacy
Supportive Curriculumలో: Mental Ability, Life Skills (Movie-based Pedagogy), Music, Dance & Dramatics

Patancheruvu: 9121219862 | 9154763847
Madhapur: 9154852691 | 8712628522
www.resonanceschools.com | Scan to Enroll

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

- దేశంలోనే అతి పెద్ద సిస్టం ఏర్పాటు
- ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం



ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలతో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి అధునాతన టెక్నాలజీ కేంద్రంగా మారుతోంది. దేశంలోనే అత్యంత పెద్దదైన, అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటర్ ఇక్కడి క్వాంటమ్‌వ్యాలీ టెక్ పార్క్‌లో ఏర్పాటు కానుంది. ఈ మేరకు శుక్రవారం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో ఆయన సమక్షంలో టెక్ దిగ్గజాలు ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఎల్ అండ్ టీకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది. దీంతో వచ్చే ఏడాది జనవరి 1న దేశంలోనే తొలి టెక్ పార్క్‌ను ప్రారంభించనున్నారు. టెక్ దిగ్గజాలతో ఒప్పందం మేరకు ఆ టెక్ పార్క్‌లో అత్యాధునిక 156 క్యూబిట్ హెరాన్ క్వాంటమ్ ప్రాసెసర్ కలిగిన అతిపెద్ద ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ 2 జాతీయ స్థాయిలో తొలిసారిగా ఇక్కడ ఏర్పాటవుతుంది. దీనికి టీసీఎస్ సహకారం అందిస్తుంది. ఐబీఎం క్వాంటమ్ వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా, టీసీఎస్ సీటీవో హారిక్ విన్, టీసీఎల్ ప్రతినిధులు వి.రాజన్న, సీపీ శ్రీధర్ సమక్షంలో క్వాంటమ్ వ్యాలీ స్థాపన, పరిశోధనా కేంద్రం ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. ఎంఓయూపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సంతకం చేశారు.

ఒప్పందం చరిత్రాత్మకం: సీఎం చంద్రబాబు

క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు ఒప్పందం చేసుకోవడం చరిత్రాత్మకం అని సీఎం చంద్రబాబు అన్నారు. జనవరి 1న క్వాంటమ్ వ్యాలీ ప్రారంభంతో ఏపీలో కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు గురించి త్వరలోనే ప్రధాని మోదీకి సవివరంగా తెలియజేస్తానని సీఎం వివరించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో జరిగిన ఒప్పందం ఏపీకి మాత్రమే కాకుండా యావత్తు దేశానికే చరిత్రాత్మక ఘట్టం కానుందన్నారు. సాంకేతిక రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని, భవిష్యత్తు అవసరాలన్నీ క్వాంటమ్ కంప్యూటింగ్‌పైనే ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. క్వాంటమ్ వ్యాలీ ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటమ్ వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలని ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీలను సీఎం కోరారు. హైదరాబాద్ హైటెక్ సిటీని 15 నెలల్లోనే నిర్మించామని, అదేవేగంతో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని నిర్మించాలని ఎల్ అండ్ టీని ఆదేశించారు. ఇప్పటికే క్వాంటమ్ వ్యాలీ కోసం స్థలం కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు.

క్వాంటమ్ జర్నీలో కీలక ఘట్టం

దేశంలో క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి జరుగుతున్న ప్రయాణంలో ఈ ఒప్పందం కీలక ఘట్టం అని టెక్ దిగ్గజ సంస్థల ప్రతినిధులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో జతకట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీసీఎస్ సహకారంతో స్థాపించబోయే క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ వల్ల అల్గోరిథమ్స్, అప్లికేషన్స్ అభివృద్ధి చేసే డెవలపర్స్‌కు, సైంటిస్టులకు, పరిశ్రమ నిపుణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఐబీఎం క్వాంటమ్ వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా అన్నారు. సంప్రదాయ, క్వాంటమ్ సిస్టమ్‌లను కలిసిన ఈ హైబ్రిడ్ కంప్యూటర్ల ద్వారా వివిధ రంగాల్లో విప్లవాత్మక ఫలితాలు సాధించవచ్చని, దీంతో ఆర్థిక అభివృద్ధి సాధ్యమని టీసీఎస్ ప్రతినిధులు చెప్పారు.

అత్యాధునిక క్వాంటమ్ సిస్టమ్ 2

సంప్రదాయ కంప్యూటర్లు పరిష్కరించలేని సంక్లిష్ట సమస్యలను క్వాంటమ్ సిస్టమ్ 2 పరిష్కరిస్తుంది. ఐబీఎం అభివృద్ధి చేసిన ఈ నెక్స్ట్ జనరేషన్ క్వాంటమ్ కంప్యూటర్.. అటు సంప్రదాయ కంప్యూటర్ల డేటాను, ఇటు క్వాంటమ్ సిస్టం డేటాను ఒకేసారి విశ్లేషించగలదు. దీనిలో ఉన్న క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్‌ను ఐబీఎం క్వాంటమ్ హెరాన్ అంటారు. 156 క్యూబిట్ (సంప్రదాయ కంప్యూటర్‌లో బైనరీ బిట్ వలే క్వాంటమ్ కంప్యూటర్‌లో క్యూబిట్) క్వాంటమ్ ప్రాసెసర్‌ను సంక్లిష్టత కలిగిన సమస్యలను పరిష్కరించేందుకు ఐబీఎం రూపొందించింది. దీంతో ఈగిల్ లాంటి ప్రాసెసర్లలోని ఎర్రర్ రేట్ తగ్గడంతో పాటు విశ్లేషణ వేగం పెరిగింది. ఇది ప్రతి సెకండ్‌కు 1.50 లక్షల సర్క్యూట్ లేయర్ ఆపరేషన్స్ దాటి వేగాన్ని అందుకోగలదు. ఐబీఎం ఇప్పటి వరకు తయారు చేసిన వేగవంతమైన క్వాంటమ్ ప్రాసెసర్ ఇదే. దీనినే దేశంలో మొదటిసారి అమరావతిలో ఐబీఎం స్థాపించబోతోంది.

58 వేల కోట్ల పనులకు శ్రీకారం

- 92 ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అమరావతిలో 49 వేల కోట్ల విలువైన 74 ప్రాజెక్టులు

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభ వేదిక నుంచి రూ.58 వేల కోట్ల విలువైన పనులను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రోడ్లు, రైల్వేలు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి.. రూ.54,028 కోట్లతో 83 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన మోదీ.. రూ.4,050 కోట్లతో మరో 9 ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మొత్తం రూ.58 వేల కోట్ల విలువైన 92 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. వాటిలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం-హెచ్‌వోడీ భవనాల నిర్మాణం, అమరావతి మౌలిక సదుపాయాలు, అమరావతి వరద నివారణ పనులు, అమరావతి భూసమీకరణ- మౌలిక సదుపాయాల కల్పన, గృహ సముదాయాల నిర్మాణం వంటి పనులు ఉన్నాయి. అలాగే రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల నిర్మాణం, నాగాయలంకలో మిస్సైల్ పరీక్షా కేంద్రం, రైల్వే ప్రాజెక్టుల పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. వీటిలో కేంద్ర ప్రాజెక్టులు కాకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 74 ప్రాజెక్టుల విలువే రూ.49 వేల కోట్లుగా ఉంది.

1,459 కోట్లతో నాగాయలంకలో క్షిపణి పరీక్ష కేంద్రం

నాగాయలంకలో రూ.1,459 కోట్లతో క్షిపణి పరీక్ష కేంద్రం ఏర్పాటుకు ప్రధాని శంకుస్థాపన చేశారు. అలాగే విశాఖపట్నంలో రూ.100 కోట్లతో యూనిటీ-మాల్ నిర్మాణం, రూ.293 కోట్లతో గుంతకల్ వెస్ట్-మల్లప్పగేట్ మధ్యలో ఆర్‌వోబీ, రూ.809 కోట్లతో గోరంట్ల-హిందూపూర్ వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం, రూ.1,020 కోట్లతో ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం, రూ.692 కోట్లతో నంద్యాల-కర్నూలు/కడప సరిహద్దు సెక్షన్ వరకు రోడ్డు, రూ.279 కోట్లతో ముదిరెడ్డిపల్లి నుంచి కడప నెల్లూరు సరిహద్దు వరకు రోడ్డు, రూ.252 కోట్లతో రణస్థలం పట్టణంలో ఆరు లైన్ల రోడ్డు నిర్మాణాలకు మోదీ శంకుస్థాపనలు చేశారు. రూ.124 కోట్లతో జాతీయ రహదారి 44 వద్ద యర్రమంచి, గుడిపల్లి వద్ద ఆర్‌ఓబీ నిర్మాణంతోపాటు రూ.3,176 కోట్లతో చేపట్టనున్న ఆరు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా సీఎస్‌పురం నుంచి మాలకొండ వరకు రూ.277 కోట్లతో రోడ్డు నిర్మాణం, రూ.370 కోట్లతో మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు, రూ.364 కోట్లతో సీతారామపురం నుంచి దుత్తలూరు వరకు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. రైల్వేశాఖకు సంబంధించి రూ.70 కోట్లతో ఎన్‌డబ్ల్యూబీహెచ్-బెజవాడలోని కొండపల్లి-విజయవాడ రైల్వేలైన్‌ను, రూ.184కోట్లతో చేపట్టిన బుగ్గనపల్లి-బి సిమెంట్‌నగర్-కేఈఎఫ్ పాణ్యం గుంటూరు-గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్టుతోపాటు రూ.254 కోట్ల విలువైన మరో 3 ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ వాటిని జాతికి అంకితం చేశారు.

రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు

తుళ్లూరు (మందడం)/గన్నవరం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ వచ్చే ముందు గన్నవరం విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న టవర్ సమీపంలో మంటలు వ్యాపించాయి. అధికారులు వెంటనే ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారు. అలాగే అమరావతిలో ప్రధాని సభ జరుగుతున్న సమయంలో వేదికకు ఐదు కిలోమీటర్ల దూరంలో మందడం దగ్గర సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన మరో అగ్నిప్రమాదం సంభవించింది. రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం నిల్వ చేసిన ప్లాస్టిక్ పైపుల గుట్టకు నిప్పు అంటుకుంది. దాదాపు గంటన్నర పాటు మంటలు చెలరేగుతూ ఆకాశంలో పొగ కమ్మేసింది. ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ఘటనలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

సభకు జగన్ వచ్చుంటే..: మంత్రి భరత్

అమరావతి, మే2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనులు వెంటనే మొదలవుతాయని మంత్రి టీజీ భరత్ చెప్పారు. 'రాజధాని పనులకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. ప్రధాని మోదీ ప్రారంభించడంతో పనులు రేపటి నుంచే మొదలవుతాయి. ప్రధాని సభకు వైఎస్ జగన్ వచ్చి ఉంటే.. అమరావతి నిర్మాణంలో భాగస్వాములయ్యే వారు. రాజధాని విషయంలో ఆయన గతంలో చేసిన తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉండేది' అని మంత్రి భరత్ మీడియాతో వ్యాఖ్యానించారు.

APPOINTMENTS

WALK-IN INTERVIEW

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న బల్క్‌డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక దారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2021 to 2024 PASSED OUT & 2025 PURSUING CANDIDATES

Job Title	Qualification		Stipend (P.M)
Trainee Helper	S.S.C , Inter / ITI (Fitter, Electrical, Diesel Mechanic)	Age 21-25 years	Rs. 15,000/-
Trainee Supervisor/ Graduate Apprentice	B.Sc (Chemistry) మొదటి 2 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 3వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు.		Rs. 18,000/-
	B.Pharmacy B.Tech (Chemical/Mechanical/ Instrumentation/EIE) మొదటి 3 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 4వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు.		Rs. 20,000/-
	M.Sc (Organic Chemistry/ Analytical Chemistry /Micro Biology)		Rs. 22,000/-
	M.Pharmacy (Pharmaceutical Chemistry/ Analysis/QA/RA)		Rs. 24,000/-

పై అర్హతలు గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్టులలో పనిచేయవలసియుండును.

05-05-2025	RVR & JC COLLEGE OF ENGINEERING, CHOWDAVARAM, Guntur Dist.
06-05-2025	KVR KVR & MKR COLLEGE, Ground Road, KHAJIPALEM, Bapatla Dist.
07-05-2025	SS & N DEGREE COLLEGE, Palnadu Road, NARASARAOPET, Palnadu Dist.
08-05-2025	CHAKRADHAR DEGREE COLLEGE, Near Pathi Factory, MACHERLA, Palnadu Dist.
09-05-2025	SCHOLARS DEGREE COLLEGE, PIDUGURALLA, Palnadu Dist.
10-05-2025	KRISHNAVENI DEGREE COLLEGE, Kothapeta, VINUKONDA, Palnadu Dist.
12-05-2025	SRI SIDDHARTHA COLLEGE OF SCIENCE & COMPUTERS, NSP Colony, NUZVID, Krishna Dist.
13-05-2025	SRI VIVEKANANDA DEGREE COLLEGE, CHALLAPALLI, Krishna Dist.
14-05-2025	SSR DEGREE COLLEGE, Jaganadha Puram, MACHILIPATNAM, Krishna Dist.
15-05-2025	NOVA COLLEGE OF PHARMACEUTICAL EDUCATION & RESEARCH, IBRAHIMPATNAM, NTR Dist.

Interview Time : 9:00 am to 12:00 noon

సదుపాయములు: 1.బ్యాచ్‌లర్స్‌కు (పురుషులు) ఉచిత వసతి 2.ఉచిత యూనిఫాం 3.అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును 4.భోజన ఖర్చులో రాయితీ

Issued by : SSM Manpower Services
Cyberhills Colony, PJR Nagar, Gachibowli, Hyderabad, Telangana.
Contact : 08694-257001

INDIA'S BEST SCHOOL FOR IIT FOUNDATION
RECIPIENT OF A.P. STATE BEST SCHOOL AWARD
Dr.K.K.R's GOWTHAM Educational Institutions : A.P & T.S
Ph.Nos:9160444661, 9160444111 / 222, 9160444646
E-mail: jobingowtham@gmail.com, Website: www.kkrgowtham.com

WALK - IN - INTERVIEW

POST	NO.OF POSTS	SALARY (Rs.) Per Month
PRINCIPALS	10 Posts	75,000 to 1,00,000
IIT FOUNDATION LECTURERS (Advanced Level)	Mat, Phy & Che 10 Posts	1,25,000 to 1,75,000
LECTURERS FOR IIT FOUNDATION IITJEE (MAINS), NEET, EAMCET Level	Mat, Phy, Che, Bot & Zoo each 20 Posts	75,000 to 1,25,000
SECONDARY SCHOOL TEACHERS (State & CBSE) (9th, 10th CLASSES)	All Subjects each 25 Posts	30,000 to 50,000
MIDDLE SCHOOL TEACHERS (State & CBSE) (6th, 7th & 8th)	All Subjects each 25 Posts	20,000 to 40,000
PRIMARY SCHOOL TEACHERS (I to V CLASSES)	All Subjects each 25 Posts	20,000 to 30,000
PRE-PRIMARY TEACHERS (Montessori Trained)	20 Posts	20,000 to 25,000
TRAINEE TEACHERS (M.Sc., & B.Tech Freshers)	All Subjects each 25 Posts	15,000 to 20,000 Lodging+Boarding
CHIEF-WARDENS	Any Degree (Min. 3 Years exp.)	20,000 to 30,000
COMPUTER TEACHERS	B.Tech, MCA, M.Sc., Comp.,	20,000 to 30,000
STUDENT COUNSELLOR	M. A. Psychology / MSW	20,000 to 30,000

Also required Wardens, Class-incharges, Receptionists & PETs.
(Salary commensurate with qualification & experience)

Note: Candidates aspiring jobs at HAPPY VALLEY SCHOOL, AGIRIPALLI can attend interview in our school campus at GUDAVALLI (Vijayawada Rural) - 7799979746

THE VACANCIES ARE FOR Dr.K.K.R BRANCHES AT :
Gudivada, Gudavalli, Kakinada, Rajahmundry, Tanuku, Eluru, Poranki, Vijayawada, Tenali, Guntur, Nellore, Machilipatnam, Sattupally, Vizag [Lawsons-Bay Colony, Kurmannapalem, Chinnamushidiwada, Anandapuram], Hyderabad [Kushaiguda, Kukatpalli], Agiripalli, Vuyyuru.

Interviews will be conducted in our campuses in the following centres.
Gudivada - 9160444661
Guntur - 9160444464
Kakinada - 9160444553
Vijayawada (Gurunanak Colony) - 9160444660
Vuyyuru - 9441520718
Gudavalli - 9160444646
Rajahmundry - 9160444493
Kushaiguda - 9160444552
Vizag (Lawsons-bay Colony) - 9642820777

Interview Dates: 4th, 11th, 18th May 2025; 1st, 8th June 2025
Interview Timings: 9.00 am to 3.00 pm.

పోటెత్తిన జన తరంగం



మోదీ సభలో అమరావతి మహిళలు, రైతుల సంబరం

అమరావతి, గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఐదు కోట్ల మంది ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి శాశ్వత పునాది పడుతున్న వేళ జన తరంగం ఉప్పెనై ఎగసింది. పదేళ్ల కిందట అమరావతికి అంకురార్పణ జరిగిన చోటే ఇక ఎవరూ కదిలించలేని రీతిలో నిర్మాణ పనులు ఉత్సాహ వాతావరణంలో పునఃప్రారంభమయ్యాయి. "అమరావతి కేవలం రాష్ట్రానికి పరిమితం కాదు. వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజన్ అవుతుంది" అని ప్రధాని మోదీ చేసిన ప్రకటనతో ఆంధ్రుల ఆశలు మళ్లీ చిగురించినట్లైంది.

టెన్షన్ పెట్టిన వరుణుడు

అమరావతి సభవేదిక మీదకు 3.54 గంటల సమయంలో ప్రధాని, సీఎం, ఇతరులు వచ్చారు. అంతకుముందు సభా ప్రాంగణానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ చేరుకున్న సమయంలో ప్రజలు పెద్దగా కేకలు వేస్తూ స్వాగతం పలికారు. మధ్యాహ్నం సమయంలో ఎండ వేడితో కొంత ఇబ్బంది పడినా సాయంత్రానికి వాతావరణం మేఘావృతమై చల్లబడింది. అయితే, వర్షం పడకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. సభా ప్రాంగణంలో రెండు వేదికలు ఏర్పాటుచేశారు. ఒకటి ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాల కోసం నిర్మించగా, మరొకటి ప్రధాన వేదిక. ప్రధాన వేదికపై మొత్తం 12 మంది ఆసీనులయ్యారు. ప్రధాని, ముఖ్యమంత్రి, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర కేబినెట్ మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్‌కుమార్ ఉన్నా రు. ప్రధానికి ఇరువైపులా గవర్నర్, సీఎం చంద్రబాబు ఉన్నారు.

స్పష్టంగా రామ్మోహన్ అనువాదం

ప్రధాని మోదీ ప్రసంగాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలుగులోకి స్పష్టంగా అనువాదం చేశారు. ఎక్కడా చిన్న తడబాటు కూడా లేకుండా, క్లిష్టమైన పదాలను కూడా అలవోకగా పలికారు. "ఇది మనం చేయాలి. మనమే చేయాలి" అని ప్రధాని తెలుగులోనే సరళంగా పలికిన పదాలను "మనమే చేయాలి" అనేది నొక్కి చెప్పి, అందులోని భావాన్ని అర్థమయ్యేలా అనువదించారు. కాగా, సాధారణంగా బహిరంగ సభల్లో ఉల్లాసంగా కనిపించే ప్రధాని మోదీ అమరావతి వేదికపై గంభీరంగా కనిపించారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతర పరిణామాల నేపథ్యంలో ఆయన మరీ అంత ఉత్సాహంగా కనిపించలేదు. అయితే ప్రసంగించే సమయంలో మాత్రం ఉల్లాసంగానే కనిపించారు. అమరావతి సభలో జాతీయవాద స్ఫూర్తి కనిపించింది. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావించారు. ఆ తర్వాత మాట్లాడిన చంద్రబాబు కూడా వందేమాతరం అంటూ చాలా గట్టిగా నినదించారు.

ఆకట్టుకున్న అమరావతి ఏవీ

అమరావతిపై ప్రదర్శించిన ఏవీ(వీడియో) అందరినీ ఆకట్టుకుంది. ఆంధ్రులకు రాజధాని ఎన్నిసార్లు దూరమైందనే దగ్గరి నుంచీ ఇప్పుడెలా తిరిగి సాకారమైందనే దాకా పలు ఘట్టాలతో ప్రభుత్వం ఏవీ రూపొందించింది. అమరావతికి రైతులు భూములు ఇవ్వడం, పదేళ్ల కిందట శంకుస్థాపన, పుణ్య నదీజలాలు, పవిత్ర మట్టి సమీకరణ తదితర ఘట్టాలను మొదటగా చూపించారు. ఆ తర్వాత 2019-24 మధ్య రాజధాని ఎలా నిర్వీర్యం అయిందో చూపించారు. రైతుల ఉద్యమం, వారిపై లాఠీ చార్జ్.. మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించడంతో మంచిరోజులు వచ్చినట్లుగా చూపించిన ఏవీ బాగుంది.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

అమరావతి పనుల పునఃప్రారంభ వేదిక వెలగపూడి జనసంద్రాన్ని తలపించింది. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిసినా సమీప జిల్లాల ప్రజలు మధ్యాహ్నం లోపే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలిరావడంతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. రాజధాని చుట్టుపక్కల జిల్లాలైన గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా జనం తరలివస్తారని అంచనా వేశారు. అయితే అంతకు మించిన స్థాయిలో జనం వచ్చారు. సభా వేదికకు చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటు చూసినా జనమే కనిపించారు. ఎండను లెక్కచేయక సభా ప్రాంగణం వద్దే ఉన్నారు. ఇక.. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. విదేశాల నుంచి ఎన్నారైలు కూడా సభకు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎన్నారై టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ దొడ్డపనేని సాగర్, గల్ఫ్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు రాధాకృష్ణ, ఏపీ ఎన్నార్టీ ఎక్స్ చైర్మన్ డాక్టర్ వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో ఎన్నో ప్రమాదాలు.. అవన్నీ వైసీపీ ప్రభుత్వ హత్యలేనా?

- 'అన్నమయ్య'లో కోటి పరిహారం ఇచ్చారా?
- జగన్‌లా పగటి కలలు కనే నేతను చూడలేదు
- గంటా శ్రీనివాసరావు ఆగ్రహం

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): సింహాచలం చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు మరణిస్తే అది ప్రభుత్వం చేసిన హత్య అంటూ వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు ఆరోపించడాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తప్పుబట్టారు. గత ఐదేళ్లలో వైసీపీ పరిపాలనలో జరిగిన ప్రమాదాలన్నీ ఆ ప్రభుత్వం చేసిన హత్యలేనా అంటూ ప్రశ్నించారు. "నాడు రుయా ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 11 మంది, దేవీపట్నం బోటు ప్రమాదంలో 12 మంది, అన్నమయ్య ఆనకట్ట గేట్లు కూలిపోయి 39 మంది, విశాఖ ఎల్‌జీ పాలిమర్స్ నుంచి గ్యాస్ లీకై 17 మంది చనిపోయారు. అప్పుడు మేం ప్రతిపక్షంలో ఉన్నా జగన్‌లా బాధ్యతారాహిత్యంగా విమర్శలు చేయలేదు." అని గంటా తెలిపారు. సింహాచలం ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం ప్రకటిస్తే, తాము ఇలాంటి సందర్భాల్లో రూ.కోటి చొప్పున ఇచ్చామని, ఇప్పుడూ అలా ఇవ్వాలని జగన్ అంటున్నారన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఇవ్వకపోతే తాను అధికారంలోకి వచ్చాక మిగిలిన రూ.75 లక్షలు ఇస్తానని కూడా జగన్ చెబుతున్నారని, ఇలాంటి పగటి కలలు కనే నాయకులను ఎక్కడా చూడలేమని గంటా వ్యాఖ్యానించారు. ఎల్‌జీ పాలిమర్స్‌లో మాత్రమే కోటి రూపాయల చొప్పున పరిహారం ఇప్పించారని, అవి కూడా యాజమాన్యం డబ్బులని గుర్తు చేశారు. అన్నమయ్య ఆనకట్ట ప్రమాద బాధితులకు రూ.10 లక్షలే ఇచ్చారన్నారు. సింహాచలంలో 'ప్రసాద్' పథకం పనులు 2022 డిసెంబరులో మంజూరైతే 24 నెలల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం కనీసం ఐదు శాతం కూడా పనులు చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాకే ఆ పనులను వేగవంతం చేశామన్నారు.

వాట్సాప్ ద్వారా శ్రీవారి భక్తుల ఫీడ్‌బ్యాక్

మెరుగైన సేవల కోసం టీటీడీ క్యూఆర్ కోడ్ విధానం

TIRUMALA TIRUPATI DEVASTHANAMS WHATSAPP FEEDBACK SYSTEM — Scan QR Code - Provide valuable Feedback

తిరుమల, మే 2(ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. భక్తులు తమ అభిప్రాయాలను వాట్సాప్ ద్వారా సులభంగా తెలియజేసేలా నూతన పద్ధతికి శ్రీకారం చుట్టింది. దీని కోసం తిరుమల, తిరుపతిలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేశారు. భక్తులు తమ మొబైల్‌తో కోడ్‌ను స్కాన్ చేస్తే వాట్సాప్‌లో టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. అందులోకి ప్రవేశించిన వెంటనే తమ పేరు, విభాగం (అన్నప్రసాదం, పరిశుభ్రత, కల్యాణకట్ట, లడ్డూప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు వంటివి) ఎంచుకోవాలి. అనంతరం తమ అభిప్రాయాన్ని తెలియజేసేందుకు టెక్స్ట్ లేదా వీడియో ఫార్మాట్‌ను ఎంచుకోవాలి. తర్వాత సేవా ప్రమాణాన్ని ఉత్తమం, సగటు, మరింత మెరుగదల అవసరం, లేదా బాగాలేదు అనే ఐచ్ఛికాల ద్వారా రేటింగ్ చేయాలి. అభిప్రాయాన్ని సమర్పించిన తర్వాత ధ్రువీకరణ సందేశాన్ని భక్తులు పొందవచ్చు. ఈ ఫీడ్‌బ్యాక్‌ను టీటీడీ అధికారులు పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటారు.

నోటి మాటతో 'గోడ' కట్టేశారు

- అధికారులు చెప్పడంతో హడావుడిగా నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్
- నాణ్యత చూడలేదు, నీటితో తడపలేదు
- 'సింహాచలం' దుర్ఘటనపై విచారణ కమిటీ చైర్మన్ సురేశ్‌కుమార్ వెల్లడి
- నేడు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక
- ఇన్‌చార్జి ఈవోపై వేటు.. బ్లాక్‌లిస్టులో కాంట్రాక్టర్?



మీడియాతో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ సురేశ్‌కుమార్. చిత్రంలో సభ్యులు ఆకే రవికృష్ణ, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు తదితరులు

విశాఖపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): సింహగిరిపై రక్షణ గోడను కేవలం నోటి మాటతోనే నిర్మించారని, ఎలాంటి అనుమతులు లేవని విచారణ కమిటీ చైర్మన్ సురేశ్ కుమార్ తెలిపారు. రెండు రోజులపాటు విచారించి పలువురి నుంచి వివరాలు సేకరించామన్నారు. విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి(అప్పన్న) చందనోత్సవం రోజు గోడ కూలి ఏడుగురు భక్తులు మృతిచెందిన ఘటనపై ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మీడియాతో మాట్లాడారు. గురువారం సింహాచలంలో, శుక్రవారం సర్క్యూట్‌హౌస్‌లో దేవస్థానం ఇన్‌చార్జి ఈవో, ఆగమ పండితులు, ఇంజనీరింగ్ సిబ్బంది, ఏపీటీడీసీ ఇంజనీర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఆలయ అధికారులు నోటిమాటగా చెప్పడంతో కాంట్రాక్టర్ హడావుడిగా పనులు చేపట్టారని, గోడ డిజైన్, మెటీరియల్ విషయంలోనూ అధికారులు బాధ్యత తీసుకోలేదని తెలిపారు. కూలిన గోడ నుంచి నమూనాలు తీసుకుని పరీక్షలకు పంపినట్టు చెప్పారు. మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేయాలనుకుంటే అనుమతులు తీసుకోవాలని, కానీ.. అలా చేయలేదన్నారు. శనివారం ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేస్తామని తెలిపారు. మరో నెలరోజుల తర్వాత పూర్తి స్థాయి నివేదిక ఇస్తామని, ఘటన జరిగిన రోజున్న భక్తుల నుంచి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. గత ఏడాది ఆగస్టు నాటికి 'ప్రసాద్' పథకం కింద పనులు పూర్తికావలసి ఉందని, అయితే ఆరు నెలలకు మించి జాప్యం జరిగిందని తెలిపారు. దీనికి అధికారులు స్పష్టమైన కారణాలు చెప్పడం లేదన్నారు. 'ప్రసాద్' పనుల పర్యవేక్షణకు 2 నెలల కిందటే ఓ కమిటీ సింహాచలం వచ్చిందని, వారిని కూడా కలిసి వివరాలు తెలుసుకుంటామని సురేశ్ వివరించారు.

విచారణ సాగిందిలా!

సింహాచలంలో గోడ కూలిన ఘటనపై విచారణ చేపట్టిన మునిసిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ నేతృత్వంలోని కమిటీ శుక్రవారం సర్క్యూట్ హౌస్‌లో పలువురిని ప్రశ్నించింది. దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె. సుబ్బారావు, సిబ్బంది, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, ఇంజనీరింగ్ విభాగం, పర్యాటకాభివృద్ధి సంస్థ ఇంజనీరింగ్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ విభాగాల అధికారుల నుంచి వివరాలు సేకరించింది. ప్రక్రియ మొత్తాన్నీ వీడియో రికార్డింగ్ చేశారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులను విచారించే సమయంలో కొండపై పనులు వైదిక నిబంధనలు, ఆగమ శాస్త్రానికి అనుగుణంగా జరిగాయా? అన్నది తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు, ఇతర సిబ్బందిని వేర్వేరుగా పిలిచి విచారించారు. ఇంజనీరింగ్ విభాగం నుంచి ఈఈ, డీఈఈలు, కిందిస్థాయి సిబ్బంది నుంచి సివిల్ పనుల వివరాలు తెలుసుకున్నారు. గోడ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా?, డిజైన్స్‌కు ఆమోదం ఉందా?, నిర్మాణంలో నాణ్యత పరిశీలించారా? తదితర వివరాలు అడిగి నమోదు చేశారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు.. ఘటన జరిగినప్పుడు తాము వెళ్లిన సమయానికి అక్కడున్న పరిస్థితిని కమిటీకి వివరించారు. ఇదిలావుంటే, శుక్రవారం ఉదయం విచారణకు రావాల్సిన ఏపీటీడీసీ ఈఈ.. కమిటీ ముందుకు రాకుండా అరకులోయ పర్యటనకు బయలుదేరారు. ఆ విషయం తెలిసిన జిల్లా అధికారులు ఆయనను వెనక్కి పిలిచారు. అయితే ఈ విషయాన్ని విచారణ కమిటీ తీవ్రంగా పరిగణించింది. విచారణకు రాకుండా తప్పించుకోవాలని ఎందుకు భావించారని కమిటీ సభ్యులు నిలదీసినట్టు తెలిసింది.

10 మందిపై చర్యలు!



సింహాచలం ఇన్‌చార్జి ఈవో కె. సుబ్బారావు

సింహాచలంలో గోడ కూలిన ఘటనకు సంబంధించి పలువురిపై చర్యలు తీసుకోవాలని విచారణ కమిటీ సిఫారసు చేయనున్నట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. దేవస్థానం ఇన్‌చార్జి ఈవో, ఈఈ, ఇంజనీరింగ్ అధికారులు, ఏపీటీడీసీ ఈఈ, మరికొందరు అధికారులు మొత్తం 8 నుంచి 10 మందిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. గోడ నిర్మించిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టనున్నారు. నిర్మాణం తరువాత కనీసం 15 రోజులు క్యూరింగ్ చేయాలి. అలా చేయలేదని తేలింది. అదేవిధంగా గోడ నిర్మాణానికి పునాదులు వేసేటప్పుడు మధ్యమధ్యలో ఐరన్ వాడాలి. అదీ చేయలేదని కమిటీ గుర్తించింది. వీటన్నింటికీ కాంట్రాక్టరే పూర్తి బాధ్యత వహించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

బోరుగడ్డ కేసు 15కు వాయిదా

అనంతపురం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం త్రీటౌన్ సీఐ మురళీకృష్ణను బెదిరించారన్న అభియోగంపై రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌పై నమోదైన కేసు విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదా పడింది. తొలుత అనంతపురం జిల్లా జైలు నుంచి పోలీసులు వర్చువల్‌గా బోరుగడ్డను మొబైల్ కోర్టు ఎదుట హాజరు పరిచారు. సాక్షులు హాజరు కాకపోవడంతో మొబైల్ కోర్టు ఈ కేసును ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది.

నేడు అక్కడక్కడా వర్షాలు.. ఎండలు

అమరావతి, విశాఖపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): పంజాబ్ నుంచి మధ్యప్రదేశ్, విదర్భ, మరట్వాడ, కర్ణాటక మీదుగా కేరళ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. అదే సమయంలో తేమ గాలులు బంగాళాఖాతం నుంచి కోస్తా మీదుగా మధ్య భారతం దిశగా వీస్తున్నాయి. వీటి ప్రభావంతో శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షం కురిసింది. మిగిలినచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. ఇక, రాష్ట్రవ్యాప్తంగా శనివారం పగటి ఉష్ణోగ్రతలు 41-42.5 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని చోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. కాగా, శుక్రవారం కడప జిల్లా కమలాపురంలో 42, నంద్యాల జిల్లా గుల్లదుర్తిలో 41.7, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 41.3, నెల్లూరు జిల్లా రేపూరులో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఏపీ ఈఏపీసెట్‌కు 3,60,119 దరఖాస్తులు

- 12 నుంచి హాల్ టికెట్లు: సెట్ చైర్మన్

జేఎన్టీయూకే, మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్సీహెచ్ఈ నేతృత్వంలో కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న ఏపీ ఈఏపీసెట్-2025కు ఇప్పటివరకు 3,60,119 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,78,896, అగ్రికల్చర్ ఫార్మసీకి 80,313, రెండింటికీ 910 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. రూ.2వేలు అపరాధ రుసుముతో ఈ నెల 7వ తేదీ వరకు, రూ.4వేలు అపరాధ రుసుముతో ఈ నెల 12వ తేదీ వరకు, రూ.10వేలు అపరాధ రుసుముతో ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సైనిక పాఠశాలల్లో ఏపీకి 67 % సీట్లు

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): కోరుకొండ, కలికిరి సైనిక పాఠశాలల్లో ఇక నుంచి రాష్ట్ర విద్యార్థులకు 67 శాతం సీట్లు అందుబాటులో ఉంటాయని కోరుకొండ సైనిక పాఠశాల ప్రకటించింది. తెలంగాణ విద్యార్థులకు ఇకపై 67 శాతం సీట్ల రిజర్వేషన్ ఉండబోదని, ఈ మేరకు అడ్మిషన్ల నిబంధనలు మారాయని పేర్కొంది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించే 33 శాతం సీట్లలోనే తెలంగాణ విద్యార్థులు కూడా ఉంటారని స్పష్టం చేసింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

టెండరు ప్రకటన నం. G/E.29/Tr./ Tender Notice/06/2025-26

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ట్రాక్షన్/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1. టెండరు నం. GTL-TRD-29-eTN-09-2025-26 పని పేరు: గుంతకల్ డివిజన్ – GTL-RU సెక్షన్‌లో 120 టిఐఎమ్ ప్రైవేట్ సైడింగ్ యొక్క ఓహెచ్‌ఇ మెయింటెనెన్స్ యాక్టివిటీల ఔట్‌సోర్సింగ్. సుమారు విలువ: రూ. 73,00,043/-, బయానా: రూ. 1,46,000/-

2. టెండరు నం. GTL-TRD-29-eTN-10-2025-26 పని పేరు: GTL డివిజన్ (1) ట్రాక్ రెన్యువల్ పనుల కొరకు వివిధ ట్రాక్షన్ బాండ్ల డిస్‌కనెక్షన్ & రీ-కనెక్షన్, i) TBR-154.456 Km, ii) TBR (P&C) 117 సెట్లు మరియు (iii) GY-WADI, KLU-GTL & BAY-GTLలో 39.78 Km. TFR (అన్ని ఫిట్టింగులు) (2) గ్లూడ్ జాయింట్లు - 444 నం.ల యొక్క రెన్యువల్ & SEJs-71 సెట్ల యొక్క ట్రాక్ రెన్యువల్ పనుల పునరుద్దరణ కొరకు వివిధ ట్రాక్షన్ బాండ్ల డిస్‌కనెక్షన్ & రీ-కనెక్షన్. SW-II-BAY-GTL, RU-GTL-WADI, KLU-GTLలో DS-11 సెట్లు, 12-3 సెట్లలో, WCMSC-:1, 8 1/2 1 సెట్లలో FS+TWS-1, FS+TWS+CMSE- 29 సెట్లు (8 1/2-19 సెట్లలో 1, 12-10 సెట్లలో 1), FS+TWS+ WCMSC-7 సెట్లు (81/2-2 సెట్లలో 1, 12-4 సెట్లలో 1 & 16 1 సెట్లలో 1) మొత్తం 51 సెట్ల కొరకు టర్న్‌ఔట్ స్లీపర్స్ మరియు CMS/WCMSC, లీడ్ రైల్స్, కొత్త 60 కె.జి. థ్రిక్ వెబ్ స్విచ్‌లతో రన్నింగ్ లైన్లపై పిఎస్‌సి స్లీపర్లు మరియు క్రాసింగ్‌లు, లీడ్ రైల్స్, ప్రస్తుత 52 కె.జి./60 కె.జి. స్విచ్‌ల యొక్క TTR (రైల్స్) (3) DMM-GY, DMM-PAK & KPD-TPTY లో. (i) 4.566 కి.మీ. పొడవు కొరకు డీప్ స్క్రీనింగ్‌తో పాటు 250 మి.మీ. బలాస్ట్ కుషన్ పెంపుదల మరియు రీఊప్‌మెంట్ కలుపుకుని కొత్త వైడర్ పిఎస్‌సి స్లీపర్లు (టి-8746) 1540 నం.లు కి.మీ. పై 60 కె.జి (ఓ1-1) రైల్స్ (ఎల్‌డబ్ల్యు ఆర్)తో పిఎస్‌సి స్లీపర్లు 1310/1540 నం.లు/కి.మీ డెన్సిటీపై ప్రస్తుత 52 కెజి రైల్ యొక్క CTR (S). (ii) 5.941 కి.మీ పొడవు కొరకు 60 కె.జి (ఓ1-1) రైల్స్ (ఎల్‌డబ్ల్యుఆర్)తో పిఎస్‌సి స్లీపర్స్ ఎమ్+7 డెన్సిటీపై ప్రస్తుత 52 కె.జి రైళ్ల యొక్క TRR(S) (iii) 1.901 కి.మీల యొక్క పొడవు కొరకు బలాస్ట్ డీప్ స్క్రీనింగ్‌తో పాటు 250 మి.మీ. కుషన్ పెంపుదల మరియు రీఊప్‌మెంట్ కలుపుకుని 1540 డెన్సిటీ కొత్త వైడర్ బేస్ స్లీపర్లు (టి-8746)తో TSR(S) (4) TBR (BCM): 69.56 కి.మీ. కలుపుకుని ట్రాక్ రెన్యువల్ పనుల కొరకు వివిధ ట్రాక్షన్ బాండ్ల రీకనెక్షన్ & డిస్‌కనెక్షన్. SW-II: 57 సెట్ల మొత్తం నం. కొరకు డీప్‌స్క్రీనింగ్‌తో పాటు పాయింట్లు మరియు క్రాసింగ్‌ల యొక్క బల్లాస్టింగ్ ద్వారా. SW-III: TFR: 184.035 కి.మీ పొడవు (అన్ని ఫిటింగ్‌లు - 174.105 KM & CGRSP-9.93 KM) SW-IV: TTR: ADEE/TrD/GTL సబ్ డివిజన్ క్రింద RU-GTL (UP & DN), NDL-DHNE-GTL (SL), GY-PDL (SL) లో (CS:02, CS+ CMSC: 03, CMSC: 01, S+TWS: 7, TWS+ CMSC:14 & WCMSC:4) సుమారు విలువ: రూ. 1,04,99,881/-, బయానా: రూ. 2,02,500/-

3. టెండరు నం. GTL-TRD-29-eTN-11-2025-26 పని పేరు: గుంతకల్ డివిజన్ – (i) KPD-TPTY సెక్షన్‌లో CTR(P)-5.962 Km. TRR (P)-50.597 Km. & TSR (P) - 0.52 Km. కలుపుకుని ట్రాక్ రెన్యువల్ పనుల కొరకు వివిధ ట్రాక్షన్ బాండ్ల యొక్క డిస్‌కనెక్షన్ మరియు రీకనెక్షన్. (ii) KPD-TPTY, RU-TTPY & DMM-PAK సెక్షన్‌లలో TBR- 103.865 Km. & TFR-158.762 Km & TTRR-15 సెట్లు కలుపుకుని ట్రాక్ రెన్యువల్ పనుల కొరకు వివిధ ట్రాక్షన్ బాండ్ల యొక్క డిస్‌కనెక్షన్ మరియు రీకనెక్షన్. (iii) ADEE/Tr.D/RU సబ్‌డివిజన్ అధికారి పరిధి క్రింద GDR-RU & RU-GTL సెక్షన్లలో TTR-98 సెట్లు, TTRR -25 సెట్లు & గ్లూడ్ జాయింట్లు, 52 నం.ల ట్రాక్ రెన్యువల్ పనుల కొరకు వివిధ ట్రాక్షన్ బాండ్ల యొక్క డిస్‌కనెక్షన్ మరియు రీకనెక్షన్. సుమారు విలువ: రూ. 98,97,096/-, బయానా: రూ. 1,98,000/-

టెండరు ముగింపు తేది మరియు సమయం: 26.05.2025న 15.00 గం.లకు.
గమనిక : 1) టెండరు డాక్యుమెంట్‌ను టెండరు దారులు ఉచితంగా http://www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. ఏదేని సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్

టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/400 తేది: 16.04.2025, టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/400 తేది: 16.04.2025కు సవరణ నం. 1&2 తేది: 26& 28.04.2025

ప్రస్తుతం ఉన్నది: దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ డివిజన్‌లో ఆసిఫాబాద్ రోడ్-రేచ్ని రోడ్ మరియు హసన్‌పర్తి రోడ్-నెక్కొండ సెక్షన్లలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్ ఏర్పాటు కొరకు సమగ్ర సిగ్నలింగ్ మరియు టెలీకమ్యూనికేషన్ పనులు.

సవరించబడినది: తదుపరి సవరించబడిన వివరాల కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లో సవరణ నం. 1&2 తేది 26& 28.04.2025ను చదువుకొనగలరు/చూడగలరు.

పై పనుల కొరకు పని పూర్తి వివరణ, టెండరు నిబంధనలు, అర్హతాప్రమాణాలు మరియు వివరాలతో కలుపుకుని అన్ని వివరాలు భారత ప్రభుత్వ టెండరు పోర్టల్ వెబ్‌సైట్ www.ireps.gov.inను చూడగలరు.
డిప్యూటీ చీఫ్ సిగ్నల్& టెలికామ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సికింద్రాబాద్

టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/401 తేది: 16.04.2025, టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/401 తేది: 16.04.2025.కు సవరణ నం. 1&2 తేది: 26&28.04.2025

ప్రస్తుతం ఉన్నది: దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ డివిజన్‌లో ఎర్రుపాలెం-ఖమ్మం సెక్షన్లలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్ ఏర్పాటు కొరకు సమగ్ర సిగ్నలింగ్ మరియు టెలీకమ్యూనికేషన్ పనులు.

సవరించబడినది: తదుపరి సవరించబడిన వివరాల కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లో సవరణ నం. 1&2 తేది 26& 28.04.2025ను చదువుకొనగలరు/చూడగలరు.

పై పనుల కొరకు పని పూర్తి వివరణ, టెండరు నిబంధనలు, అర్హతాప్రమాణాలు మరియు వివరాలతో కలుపుకుని అన్ని వివరాలు భారత ప్రభుత్వ టెండరు పోర్టల్ వెబ్‌సైట్ www.ireps.gov.in ను చూడగలరు.
డిప్యూటీ చీఫ్ సిగ్నల్& టెలికామ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సికింద్రాబాద్

టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/402 తేది: 30.04.2025

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికామ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) ద.మ.రైల్వే, సికింద్రాబాద్ వారు 06.06.2025న 15.00 గం.వరకు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

1. టెండరు నం: C/SG/C/36/5/402.పని వివరణ: దక్షిణ మధ్య రైల్వేలో ఎంఎంజెడ్-పిడిపిఎల్, పిడిపిఎల్-హెచ్‌ఎస్‌పి, ఎస్‌కెజెడ్‌ఆర్-ఎంకెడిఐ, వైపిఎన్‌డబ్ల్యుబిహెచ్, ఎంపోహో-ఎస్ఆర్‌ఇ & ఎస్ఆర్‌ఇ-అర్‌యు సెక్షన్లలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్ ఏర్పాటు కొరకు సమగ్ర సిగ్నలింగ్ మరియు టెలీకమ్యూనికేషన్ పనుల కొరకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌ల ఏర్పాటు కొరకు అథారిటీ ఇంజనీర్ నియామకం. సుమారు విలువ: రూ.182066621.97. పూర్తి చేయాల్సిన కాలం: 24 నెలలు.

పై పనుల కొరకు పని పూర్తి వివరణ, టెండరు నిబంధనలు, అర్హతాప్రమాణాలు మరియు వివరాలతో కలుపుకుని అన్ని వివరాలు భారత ప్రభుత్వ టెండరు పోర్టల్ వెబ్‌సైట్ www.ireps.gov.in ను చూడగలరు.
డిప్యూటీ చీఫ్ సిగ్నల్& టెలికామ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సికింద్రాబాద్
A0611

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం — గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.32 to 36/AE/e-procurement 2025-26, తేది: 01.05.2025
గ్రా.నీ.స & పారిశుధ్య విభాగము, ఏలూరు పరిధిలో O&M నిధులు నుండి మంజూరు కాబడిన 4 పనులకు అంచనా విలువ: రూ. 156.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు స్వీకరణ తేది: 05.05.2025 నుండి 12.05.2025, మ.3గం.ల వరకు. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.tender.apeprocurement.gov.inలో పొందవచ్చును. ఫోన్ నెం. 9100121214.
సం/- కార్యపాలక ఇంజనీరు, రూరల్ వాటర్ సప్లై అండ్ సానిటేషన్ డివిజన్, ఏలూరు
DIPR RO No.16271/CL/ADVT/1/1/2021-22, Dt: 02.05.2025

केन्द्रीय कर आयुक्त का कार्यालय
OFFICE OF THE COMMISSIONER OF CENTRAL TAX, GUNTUR COMMISSIONERATE :: गुंटूर आयुक्तालय
जीएसटी भवन, कन्नावारी तोटा:: गुंटूर – 522004
GST BHAVAN, KANNAVARI THOTA, GUNTUR - 522004
Email: aoadminhq-cgstguntur@gov.in
दिनांक Date: 02-05-2025

HIRING OF OFFICE ACCOMODATION ON LEASE/ RENT BASIS

Offers/bids are invited from the legal owners and/or their Power of Attorney holders in the form of the two bid system i.e., Technical Bid and Financial Bid, for hiring of office accommodation (as detailed in the tender documents) as given below.

Sl. No.	Preferable location	Carpet Area required in Sq ft.	Carpet Area required in Sqmtr.
1	GSTAT Bench, Vijayawada	10050	933.68
2	AR (Central) Office, Vijayawada	6488	602.75
	Total:	16538	1536.43

The building should be located in the location(s) as mentioned in tender document strictly i.e. Vijayawada / Amaravathi Capital Region, Andhra Pradesh. All the terms and conditions mentioned in the tender document are to be complied without any deviation. The interested parties/agencies may download the prescribed tender documents and the details along with technical specifications of the required accommodation and other terms and conditions applicable from https://www.cbic.gov.in/entities/tenders or https://eprocure.gov.in/eprocure/app. Duly filled-in bids can be submitted from 07.05.2025 and on or before 23.05.2025. The technical bids will be opened on 26.05.2025.

The offer/bid shall be submitted in two bid system viz. Technical bid and Financialbid and are to be submitted online through eprocurement portal only. Bids submitted by other means will be deemed rejected.

Please note that the bidders/authorized representatives may contact Shri Goli Ravi Kumar, Administrative Officer (Contact No: 9676050260) for any queries or clarifications. The Department reserves the right to reject any or all the bids/offers at any stage without assigning any reasons thereof.

Sd/- COMMISSIONER
GUNTUR CGST COMMISSIONER, GUNTUR

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

నం B/C.PS/NFR/E-AUCTION/2025-26, తేది: 30.04.2025
ఇ-వేలం ప్రకటన నం BZA-02-2025-26

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ వారు విజయవాడ డివిజన్‌లో ఇతర NFR కాంట్రాక్టులు అందజేయుటకు IREPS ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ www.ireps.gov.in ద్వారా ఇ-వేలం కొరకు పద్దెనిమిది సంవత్సరాలు వయస్సు పైబడిన భారతీయులు మరియు కంపెనీలు/సంస్థలను ఆహ్వానిస్తున్నారు. ఇ-వేలం షెడ్యూలు దిగువ వివరించబడినది:

కాంట్రాక్టు రకం	వేలంలో ఆఫర్ చేయబడినట్టి లాట్ల సంఖ్య	వేలం షెడ్యూలు తేది మరియు తెరచు సమయం
పార్కింగ్	విజయవాడ- పార్సిల్ కార్యాలయం వద్ద ప్రీమియం కమ్ జనరల్ ఫోర్ వీలర్; గుడివాడ- జనరల్ టూ వీలర్; వేదాయపాలెం- జనరల్ టూ వీలర్లు మరియు జనరల్ ఫోర్ వీలర్ల కొరకు పార్కింగ్ లాట్	13.05.2025న 11.00 గం.లకు
ఇతర NFR ప్రకటనలు	ప్యాకేజీ-ఎఫ్ క్రింద (విజయవాడ డివిజన్ యొక్క పాత సెక్షన్ అనగా, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, కాకినాడ టౌన్, కాకినాడ పోర్ట్ స్టేషన్, ద్వారపూడి, రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, భీమడోలు ఏలూరు, పవర్‌పేట) వివిధ స్టేషన్ల లోపల ప్రాంగణం వద్ద లోపలి ప్రదేశాల కొరకు కేటాయించబడిన ప్రాంతాల వద్ద ప్రకటనల ప్రదర్శన కోసం కాంట్రాక్టు.	15.05.2025న 11.00 గం.లకు
	ప్యాకేజ్ "హెచ్" క్రింద విజయవాడ రైల్వే స్టేషన్ యొక్క రైల్వే స్టేషన్ భవనం లోపల కేటాయించబడిన ప్రదేశాలు/ప్రాంతాలలో ప్రకటనల (రైల్ డిస్ ప్లే నెట్‌వర్క్) స్టాటస్టిక్ ప్రదర్శన కోసం ప్రకటన హక్కులు.	

పైన తెలిపిన ఇ-వేలం తేదీలపై టైమ్ స్లాట్లు IREPS అప్లికేషన్ ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ (www.ireps.gov.in) లో లభించును. ఆ ప్రకారంగా వేలంలో పాల్గొనవలసిందిగా గమనించగలరు.
స్టేషన్: విజయవాడ
A0617 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

తిరుమల తిరుపతి దేవస్థానములు
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం: తిరుపతి
ADV No. 08/D3/CE/TTD/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన Dt.02.05.2025
టిటిడి ఇంజనీరింగ్ శాఖ యొక్క నలభై మూడు (43) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి. SE-II:- NIT No:53 to 71/SE-II/2025-26 (19 పనులు), SE-III:- NIT No:4 to 6/SE-III/2025-26 (3 పనులు), EE-V:- NIT No:9/EE-V/2025-26 (1 పని), EE-VI:- NIT No: 7 to 9 /EE-VI/2025-26 (3 పనులు), EE-XI:- NIT No:8 to 9/EE-XI/2025-26 (2 పనులు), DE(Elec)-I:- NIT No: 15 to 16/DE(Elec)-I/2025-26 (2 పనులు), DE(Elec)-II:- NIT No:15 to 20/DE(Elec)-II/2025-26 (6 పనులు), DE(Elec)-TML:- NIT No:15 to 21/DE(Elec)-TML/2025-26 (7 పనులు). తదుపరి వివరాల కొరకు www.tirumala.org మరియు పని వివరాల కొరకు https://tender.apeprocurement.gov.in కు లాగిన్ కాగలరు.
TTD-40021/10/2025-PRO SEC (Adv. No.48), Dt: 02.05.2025 సం/-కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము — గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన
నెం.04 నుండి 34/2025-26, తేది:30.04.2025
ప్రకాశం జిల్లాలో వివిధ పథకముల క్రింద మంజూరైన 31 పనులకు అంచనా విలువ: రూ.1936.82 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్స్ ది.05.05.2025 నుండి అందుబాటులో ఉండును. ఇతర వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ www.tender.apeprocurement.gov.in లో లభ్యమగును. ఫోన్: 9100121600.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఆర్.డబ్ల్యు.యస్. & శానిటేషన్ సర్కిల్, ఒంగోలు
DIPR R.O. No.16269/CL/ADVT/1/1/2021-22, Dt: 02.05.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము — గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన
నిట్.నెం.6/ఎ.టి.ఒ/నిట్ నెం.418-472/2025-26/2025-26. తేది: 29.04.2025
గ్రా.నీ.స & పా. డివిజన్, బాపట్ల వారి కార్యాలయ పరిధిలోని గ్రామములో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయికి సంబంధించిన 55 పనులకు అంచనా విలువ రూ.1141.10 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడినది. టెండరు డాక్యుమెంట్లను ఇ-ప్రొక్యూర్మెంట్ సైటు నందు ది.06.05.2025 నుండి www.apeprocurement.gov.inలో చూడగలరు.
సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల
DIPR RO.No:16268/CL/ADVT/1/1/2021-22 తేది: 02.05.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము — పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
ఆర్.సి.నెం.02/ఎ.టి.ఓ/2025-26, నిట్ నెం.10 నుండి 17, తేది :28.04.2025
కార్యపాలక ఇంజనీరు, పంచాయతీరాజ్ డివిజన్, బాపట్ల పరిధిలోని వివిధ నియోజక వర్గములలో 9 అభివృద్ధి పనులకు అంచనా విలువ రూ.215.00 లక్షలకు వివిధ నిధుల ద్వారా మంజూరు చేయబడినవి. టెండర్లు ది.08.05.2025 నుండి https://www.tender.apeprocurement.gov.in ద్వారా చూడగలరు. ఫోన్.9951005578.
సం/- కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ/ పి.ఐ.యు డివిజన్, బాపట్ల
DIPR RO No.16267/CL/ADVT/1/1/2021-22, Dt: 02.05.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం — గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.01 టు 08/టిఓ/2025-26, తేది:30.04.2025
ఆర్.డబ్ల్యు.ఎస్&ఎస్ డివిజన్, భీమవరం పరిధిలోని 8 పనులు చేయుటకు గాను అంచనా విలువ: రూ. 130.19 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. 7 పనులకు టెండర్లు తీసుకొనుటకు ఆఖరి తేది: 13.05.2025 మరియు 1 పనికి ఆఖరి తేది: 20.05.2025, మ. 04.00 గం. వరకు. తదుపరి సమాచారం కొరకు www.apeprocurement.gov.in సందర్శించగలరు. ఫోన్: 9441148974
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, ఆర్.డబ్ల్యు.ఎస్&ఎస్ డివిజన్, భీమవరం
DIPR R.O. No.16273/CL/ADVT/1/1/2021-22, తేది.02.05.2025

INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institute Under Ministry of Education., Govt. of India)
Yerpedu Mandal – 517619, Tirupati.

Corrigendum
Admission to Ph.D. Program, AUGUST- 2025

The last date for submission of online application forms for the PhD program in Biology, Chemistry, Physics, Earth & Climate Sciences, and Humanities & Social Sciences discipline has been extended till 07 May 2025. For the updated educational qualifications, eligibility criteria, selection procedure of Ph.D., please visit: https://www.iisertirupati.ac.in/admission-phd/

Advt. No. 17/2025/IISER-T/Admissions/02-05-2025 Sd/- Director

Sahitya Akademi | Ministry of Culture, Government of India

కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కారం 2025

కేంద్ర సాహిత్య అకాడెమీ, గుర్తింపు పొందిన 24 భారతీయ భాషలలో 2025 వ సంవత్సరానికి గాను అనువాద పురస్కారం కోసం భారతీయ అనువాదకుల నుంచి, వారి సన్నిహితులు, శ్రేయోభిలాషులు, ప్రచురణకర్తలనుంచి పుస్తకాలను ఆహ్వానిస్తోంది. 2019, 2020, 2021, 2022, 2023 (అంటే 1 జనవరి 2019 నుంచి డిసెంబర్ 31, 2023 నడుమ) సంవత్సరాలలో ప్రచురితమైన పుస్తకాలు పురస్కారానికి అర్హమైనవి. పురస్కారానికి ఎంపికైన పుస్తకానికి బహుమతిగా 50,000 రూపాయల నగదు, జ్ఞాపిక అందచేయడం జరుగుతుంది. నమూనా దరఖాస్తుతో పాటు పుస్తకపు ఒక ప్రతిని 2025 మే 31 వ తేదీ లోగా పంపాలి. మరిన్ని వివరాలు, నిబంధనల కోసం అకాడెమీ వెబ్ సైట్ www.sahitya-akademi.gov.in ను సందర్శించండి.

సం/-
కార్యదర్శి
సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాపం-ప్రాయశ్చిత్తం

రెండేళ్ళక్రితం మణిపూర్ మండిపోవడం ఆరంభమైంది ఈ రోజే. జాతులమధ్య ద్వేషంతో, అవిశ్వాసంతో, పరస్పరం ఊచకోతలకు, అఘాయిత్యాలకు గురైన ఈ రాష్ట్రం మే 3ను మాత్రం మరిచిపోదు. హింసావలయంలోకి జారుకొని ఇప్పటికీ ఆ ఊబినుంచి బయటకు రాలేకపోతున్నదీ రాష్ట్రం. ఈ రెండేళ్ళకాలంలో తాము నష్టపోయిందేమిటో, ఇకపై ఆశిస్తున్నదేమిటో వివరించడానికి ఆయా తెగలకు చెందిన సంస్థలు నేడు కార్యక్రమాలు చేపడుతున్నాయి. మరోవైపు, పౌరసంస్థలు ఈ సందర్భాన్ని సానుకూల మార్పు దిశగా అడుగులువేయడానికి వాడుకోవాలని అంటున్నాయి. రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్‌లో ఉద్రిక్తతలు, అవిశ్వాసాలు తగ్గి, వాతావరణంలో మార్పు మొదలుకావాలంటే ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గమని 21మంది ఎమ్మెల్యేలు లేఖ రాసిన నేపథ్యంలో, కేంద్రప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మేధావులు కోరుతున్నారు.

మణిపూర్ మూడునెలలుగా రాష్ట్రపతిపాలన ఉన్నా, పరిస్థితుల్లో మార్పురాలేదని, రాదని, రావాలంటే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అధికారంలో ఉండాలని ఆ ఎమ్మెల్యేలు తమ లేఖలో తేల్చేశారు. రాష్ట్రపతిపాలనను ప్రజలు, మేధావులు వ్యతిరేకిస్తున్నారని, ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏర్పడితే పరిస్థితి మారుతుందని వారి వాదన. హింస ఆగిందనో, తగ్గిందనో వస్తున్నవాదనలను ఈ ఎమ్మెల్యేలు కొట్టిపారేశారు, మళ్ళీ మళ్ళీ హింసరేగే అవకాశాలు ఉన్నాయని స్పష్టంచేస్తున్నారు. బీజేపీనుంచి 14, ఎన్పీపీనుంచి ముగ్గురు, నాగా పీపుల్స్‌ఫ్రంట్‌నుంచి ఇద్దరు, స్వతంత్రులు ఇద్దరు ఈ లేఖమీద సంతకాలు చేసినవారిలో ఉన్నారు. బీజేపీకి అక్కడ ముప్పైఏడుమంది ఎమ్మెల్యేలు ఉన్న విషయం తెలిసిందే. తెరవెనుక రాజకీయాలు తెలియదు కానీ, అరవైమంది ఎమ్మెల్యేలున్న అసెంబ్లీలో మూడోవంతుమంది ఈ ప్రతిపాదన చేయడం కొట్టిపారేయాల్సిన విషయమైతే కాదు.


మూడునెలల క్రితం వరకూ మణిపూర్‌ను ఏలి దానిని అగ్నిగుండంగా మార్చిన ఘనత బీరేన్‌సింగ్‌కు దక్కుతుంది. మీతీలకు ఎస్టీ హోదా ప్రతిపాదన అగ్గికి కారణంగా కనిపిస్తున్నా, అప్పటికే కుకీ–జో తెగలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అప్రదిష్టను మీతీ బీరేన్ మూటగట్టుకున్నారు. తమ నివాసాలు, భూములు, హక్కులను హస్తగతం చేసుకొనే విస్తృతమైన కుట్రకు బీరేన్ పాల్పడుతున్నాడన్న అనుమానాలు అప్పటికే ఉన్నాయి. బీరేన్ తన ఏలుబడిలో రాష్ట్ర ప్రజలందరిపక్షాన నిలవలేదు. మీతీలకు నేతగానే వ్యవహరించాడు, తన చర్యలూ చేష్టలతో కార్చిచ్చు రాజేశాడు. మీతీలను ఆయుధాలు దోచుకోనివ్వాలని, వారు శత్రుశేషం లేకుండా చేసుకుంటారని సీఎం స్వయంగా అధికారుల సమావేశంలో చేసిన వ్యాఖ్యల టేపులు లీకై, మణిపూర్‌లో అప్పటికి 21నెలలుగా జరుగుతున్నదేమిటో నిర్ధారించాయి. బీరేన్‌కు అండగా ఉంటున్న బీజేపీ పెద్దలను కూడా బోనులో నిలబెట్టాయి. సర్వోన్నత న్యాయస్థానం పరిశీలనలో ఉన్న ఆ టేపుల్లో ఉన్నది బీరేన్‌గొంతేనని ట్రూత్‌ల్యాబ్స్ నిర్ధారించిన తరువాత, సుప్రీంకోర్టుతో తమ ముఖ్యమంత్రి నేడోరేపో అభిశంసన ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇంతలోగా విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో ఆయన ఓడిపోవడం ఖాయమని తేలిపోవడంతో బీజేపీ పెద్దలు ఎట్టకేలకు బీరేన్‌ను గద్దెదింపేశారు. తెగలమధ్య తగవులుపెట్టి 650రోజులపాటు రాష్ట్రాన్ని రగల్చిన బీరేన్‌కు ఆదినుంచీ అండగా నిలిచినవారు, ఆయన నిష్క్రమణ తరువాత అధికులకు ఆమోదయోగ్యమైన వ్యక్తిని కూచోబెట్టినా బాగుండేది. స్పీకర్ కేంద్రంగా అసమ్మతి రాజుకుంటూ, అంతర్గత తిరుగుబాట్లతో తీసుకుంటున్న సొంతపార్టీని చక్కదిద్దుకోవడం సాధ్యంకాదని అర్థమైపోవడంతో రాష్ట్రాన్ని రాష్ట్రపతి పాలనలోకి నెట్టేశారు. అగ్గిరాజుకున్న వెంటనే బీరేన్‌ను తప్పించివుంటే, రాష్ట్రం ఈ దుస్థితిలోకి జారుకొనేది కాదు. బీరేన్ కారణంగా నిలువునా చీలిన సమాజం ఇప్పటికీ ఏకం కాలేకపోతోంది. రెండేళ్లపాటు మణిపూర్‌కు కేంద్రప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దడం అంత సులభం కాదు. మిలిటెంట్ గ్రూపులనుంచి ఆయుధాల స్వాధీనం మరింత వేగంగా, నిబద్ధతతో జరగాలి. పరస్పర అవిశ్వాసం, అనుమానాలు, భయాలతో బతుకుతున్న తెగలూ, జాతులూ సయోధ్యతో జీవించేట్టు చేయగలిగే స్థానిక నాయకత్వం అవసరం ఆ రాష్ట్రానికి ఉంది.

చరిత్రాత్మకం.. మోదీ కులగణన నిర్ణయం

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు నిండే నాటికి భారతదేశాన్ని ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ @ 2047' లక్ష్యం. ఈ క్రమంలో మోదీ అనేక సాహసోపేత నిర్ణయాలు, చరిత్రాత్మక చర్యలకు శ్రీకారం చుట్టారు. రానున్న జనాభా లెక్కల్లో కులగణన చేపట్టాలన్న నిర్ణయం కూడా ఈ కోవలోకే వస్తుంది. ఈ నిర్ణయం సామాజిక న్యాయానికి మెరుగైన బాటలు వేస్తుంది. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతుంది. అందుకే దేశంలోని వెనకబడిన వర్గాల తరపున ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

దేశంలో కులగణన చివరిసారిగా 1931లో బ్రిటిష్ వారి హయాంలో నిర్వహించారు. 94 సంవత్సరాల తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకొని చరిత్రాత్మక అధ్యాయాన్ని ఆరంభించింది. కులగణన నిర్ణయం తీసుకున్న 30 ఏప్రిల్, 2025 చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ కులగణన బీసీలకు, మైనారిటీ వర్గాలకే కాకుండా, దేశం మొత్తానికి సామాజిక-, ఆర్థిక సమతుల్యతను తీసుకొచ్చే మార్గం. అందుకే ప్రజలు, ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాలు మోదీని 'అభినవ అంబేడ్కర్', 'అభినవ జ్యోతిబా పూలే' అని పిలుచుకుంటూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

బీసీల పట్ల కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోంది. 60 ఏళ్ల పాలనలో ఏనాడూ కులగణన గురించి ఆలోచించని కాంగ్రెస్, ఇప్పుడు వరుసగా మూడు పర్యాయాలు అధికారం కోల్పోయి, రోజురోజుకు బలహీనమవుతూ, ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో గత్యంతరం లేకే కులగణన ఎత్తుకున్నారే కానీ, బడుగు బలహీన వర్గాలపై ప్రేమతో కాదు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం కులగణన చేపట్టాలన్న నిర్ణయం తమ విజయంగా కొందరు కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం వారి దివాళాకోరుతనానికి అద్దం పడుతోంది. 2021 జనగణనలో కులగణన తప్పక జరుగుతుందని 2018లోనే అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అయితే కోవిడ్ తదితర కారణాలరీత్యా 2021లో జనాభా లెక్కలు జరగలేదు. అప్పుడు రాజ్‌నాథ్ సింగ్ చెప్పిన దాని ప్రకారం త్వరలో జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం తప్పిస్తే, కాంగ్రెస్ కానీ, మరే పార్టీ ఒత్తిడి అనేది శుద్ధ అబద్ధం.



త్వరలో జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలన్న నిర్ణయం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తీసుకున్నది. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహించే జనగణన, కులగణన శాస్త్రీయంగా, ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంటుంది.

కాంగ్రెస్ బీసీ వ్యతిరేకత ఈనాటిది కాదు. జవహర్‌లాల్ నెహ్రూ హయాం నుంచే ఉంది. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు వివిధ వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా హక్కులు కల్పించారు. బీసీలకు ప్రత్యేక రాజ్యాంగ హక్కులు కల్పించని కారణంగా వెంటనే జాతీయ కమిషన్‌ను నియమించాలని, ఆ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సూచించారు. అయితే నెహ్రూ అందుకు ససేమిరా అన్నారు. చివరకు అంబేడ్కర్ ఒత్తిడితో బీసీల సంక్షేమం కోసం, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకు 1953లో కాకా కాలేల్కర్ కమిషన్‌ను నియమించారు. ఈ కమిషన్ 1955లో నివేదిక సమర్పించింది. అయితే, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నివేదికపై పార్లమెంట్‌లో చర్చించకుండానే చెత్తబుట్టపరం చేసింది. ఓబీసీ రిజర్వేషన్లపై నెహ్రూ ఏనాడూ సానుకూలంగా స్పందించలేదు.


ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ హయాంలో కూడా కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించింది. 1990లో వీపీ సింగ్ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తే, నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న రాజీవ్‌గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. రిజర్వేషన్లు కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక ప్రాతిపదికన మాత్రమే ఉండాలని వాదించిన రాజీవ్ గాంధీ, బీసీల హక్కులను కాలరాసి, రిజర్వేషన్లను అణిచివేశారు.

మన్మోహన్ సింగ్ ప్రధానిగా సోనియాగాంధీ నేతృత్వంలో సాగిన యూపీఏ పాలనలోనూ బీసీలకు అన్యాయమే జరిగింది. అప్పుడు బీజేపీ నాయకులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్ 2010లో కులగణన జరిపించాలని యూపీఏపై ఒత్తిడి తీసుకొచ్చారు. రాజ్యాంగంలోని 246వ ఆర్టికల్‌కు అనుగుణంగా జనగణనలో భాగంగా కాకుండా ప్రైవేట్ ఏజెన్సీలతో రూ.5,000 కోట్లు ఖర్చు చేసి సర్వే చేపట్టారు. ఆ సర్వే వివరాలు ఇప్పటివరకు బహిర్గతం చేయలేదు.

ఎన్డీఏ ప్రభుత్వం ఓబీసీ పక్షపాతిగా వ్యవహరిస్తోంది. జాతీయ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడం, వైద్యవిద్యలో అఖిల భారత కోటాలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయడం, ప్రస్తుత మోదీ మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలకు స్థానం కల్పించడం.. ఇలా చెప్పుకొంటూ పోతే ఓబీసీల సాధికారత దిశగా మోదీ ప్రభుత్వంలో అనేక చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఇది బీసీల పట్ల బీజేపీ నిబద్ధతకు నిదర్శనం. ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో తొలిసారి బిహార్‌లో కులగణనను చేపట్టింది. ఆ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టరూపం దాల్చేలా చేసింది. అందులో అన్ని వివరాలు పొందుపర్చారు, పారదర్శకంగా ఉండేలా బహిర్గతం చేశారు. అయితే కొందరు కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం ఆ చట్టంపై స్టే విధించింది.

కులగణనలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీసుకోవాలని రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి తదితరులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అశాస్త్రీయంగా కులగణన చేపట్టింది. అందుకే, ఆ వివరాలు ప్రజాబాహుళ్యంలో పెట్టలేదు. శాస్త్రీయంగా నిర్వహించి ఉంటే గ్రామాల వారీగా కులాల వివరాలు, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులను వెల్లడించేవారు. కానీ అలా జరగలేదు. తెలంగాణలో 51శాతం బీసీలున్నారని గతంలో పేర్కొన్నారు, కానీ కాంగ్రెస్ చేపట్టిన కులగణనలో బీసీల జనాభా 46శాతానికి పడిపోయింది. సంతాన సాఫల్యత రేటు ప్రకారం చూసుకుంటే బీసీల జనాభా శాతం పెరిగి ఉండాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చూపెడుతూ తెలంగాణ బీసీలకు తీరని అన్యాయం చేసింది. పైగా తెలంగాణలో 12శాతం ముస్లింలు ఉంటే, 10శాతం ఓబీసీలుగా చూపించారు. అంటే రేవంత్ ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 శాతం పైగా ముస్లింలు ఓబీసీలే. వీరిని 'ముస్లిం ఓబీసీ'లు అన్న కొత్త పదప్రయోగంతో కాంగ్రెస్ తెలంగాణ ఓబీసీలకు వెన్నుపోటు పొడిచింది. ఇలాంటి తప్పులతడక, అశాస్త్రీయమైన కులగణన ఏ విధంగా 'రోల్ మోడల్' అవుతుందో రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ చెప్పాలి.

కాంగ్రెస్ మాదిరిగా కాకుండా, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహించే జనగణన, కులగణన శాస్త్రీయంగా, ప్రజల ఆమోదయోగ్యంగా ఉంటుంది. దేశ సామాజిక, ఆర్థిక పునాదులు బలోపేతం చేయాలనేది మోదీ ప్రభుత్వం లక్ష్యం. దానికనుగుణంగానే కులాల వారీగా సమాచారం సేకరించి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించి, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటారు.



● డా. కె.లక్ష్మణ్
రాజ్యసభ సభ్యులు
బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు

భారతీయులకు పహల్గాం పరీక్ష

విషాదం నడుమ భరోసాకు ఆలంబన లభించడం నిస్సందేహంగా ఉదాత్త భావోద్వేగాన్ని కలిగిస్తుంది. పహల్గాంలో ఉగ్రవాదులు హతమార్చిన పర్యాటకులలో ఒకరు కేరళవాసి ఎన్. రామచంద్రన్. ఆయన కుమార్తె ఆరతీ శరత్ స్వస్థలానికి తిరిగివచ్చిన అనంతరం ఆ కష్ట సమయంలో తనకు అవసరమైన సహాయాన్ని ఇద్దరు యువకుల నుంచి ఎలా పొందిందీ చాలా ఉద్వేగంతో చెప్పారు. ఆమె మాటలను 'ది హిందూ' ఇలా ఉటంకించింది: 'ముసాఫిర్, మరో స్థానిక డ్రైవర్ సమీర్ చివరివరకు నాతోనే ఉన్నారు. ఆస్పత్రిలో శవాల గది వెలుపల తెల్లవారుజాము 3 గంటలదాకా నిలబడి ఉన్నప్పుడు కూడా వారు నా పక్కనే ఉన్నారు. వారిరువురూ నన్ను ఒక చెల్లెలుగా ఆదరించారు. కశ్మీర్ నాకు ఇద్దరు సోదరులను ఇచ్చింది'. పహల్గాంలో 26 మంది అమాయకులను బలిగొన్న ఉగ్రవాదుల రాక్షసచర్యకు సమస్త కశ్మీర్ ప్రజలు ప్రతిస్పందించిన తీరుకు ముసాఫిర్, సమీర్ ప్రతినిధులని పలు దినపత్రికలలో వెలువడిన వార్తా కథనాలు ధ్రువీకరించాయి. ఘటన ప్రదేశంలో ఉన్న పలువురు పర్యాటకులను కశ్మీరీ గైడ్‌లు స్వయంగా సురక్షిత ప్రదేశాలకు తీసుకువెళ్లారు. తన వృత్తి సహచరుల వలే ముస్లిం మతస్థుడు అయిన ఒక గైడ్‌ను ఉగ్రవాదులు హతమార్చారు. భయాందోళనలలో ఉన్న పర్యాటకులకు ముస్లిం మతాచార్యులు మసీదులలో ఆశ్రయం కల్పించారు. ఆ క్లిష్ట సమయంలో టాక్సీ డ్రైవర్లు డబ్బులు తీసుకోకుండా పర్యాటకులను వారి వారి హోటళ్లకు, విమానాశ్రయానికి తీసుకువెళ్లారు.



పహల్గాంలో హిందువులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఉగ్రవాదులు దేశవ్యాప్తంగా ముస్లింలకు హిందువులు పూర్తిగా వ్యతిరేకులు అవుతారని, మత ఘర్షణలు ప్రజ్వరిల్లుతాయని భావించారు. ఈ లక్ష్య సాధనలో వారు కనీసం కశ్మీర్‌కు సంబంధించినంత వరకు విఫలమయ్యారు. ఆ విషాద ఘటన అనంతరం మన దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో నివసిస్తున్నవారూ కశ్మీరీల వలే ప్రవర్తించారా?

పహల్గాం ఘటన మరుసటి రోజు కశ్మీర్ అంతటా ప్రజలు సంపూర్ణ హర్తాళ్ పాటించారు. ఉగ్ర హింసాకాండ బాధితులకు సంతాపంగా దుకాణాలు, హోటళ్లు, పాఠశాలలు, కళాశాలలు అన్నిటినీ మూసివేశారు. పాలక ప్రతిపక్షాలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఉగ్రవాదులను, సరిహద్దుల ఆవల నుంచి వారికి మద్దతునిస్తున్న వారి అమానుషత్వాన్ని ఖండిస్తూ ర్యాలీలు నిర్వహించాయి.

ఉగ్రవాద దాడి సందర్భంలో కశ్మీరీల మానవీయ ప్రవర్తనా ఉదంతాలు చరిత్రకారుడినైన నాకు దేశ విభజన వెనువెంటనే కశ్మీర్ లోయపై పాకిస్థాన్ ప్రప్రథమంగా దాడి చేసినప్పుడు సమస్త కశ్మీరీలు ఎలా ఆదర్శపూర్వకంగా వ్యవహరించిందీ గుర్తుచేశాయి. 1947 శరత్కాలంలో దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో, తూర్పు, పశ్చిమ పంజాబ్‌లలో మతోన్మాద హింసాకాండ తీవ్ర స్థాయిలో జరుగుతుండగా కశ్మీర్ సంపూర్ణంగా మత సామరస్యానికి నెలవుగా ఉన్నది. ముస్లింలు, హిందువులు, సిక్కులు దృఢ సంఘీభావంతో సమైక్యంగా దురాక్రమణదారును ఎదుర్కొన్నారు.

పహల్గాంలో హిందువులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఉగ్రవాదులు దేశవ్యాప్తంగా ముస్లింలకు హిందువులు పూర్తిగా వ్యతిరేకులు అవుతారని, మత ఘర్షణలు ప్రజ్వరిల్లుతాయని భావించారు. ఈ లక్ష్య సాధనలో వారు కనీసం కశ్మీర్‌కు సంబంధించినంత వరకు విఫలమయ్యారు. సరే ఆ విషాద ఘటన అనంతరం మన దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో నివసిస్తున్నవారూ కశ్మీరీల వలే ప్రవర్తించారా? రాజస్థాన్‌లో ఒక బీజేపీ ఎమ్మెల్యే శుక్రవారం ప్రార్థనల సమయంలో ఓ మసీదులోకి వెళ్లి 'జై శ్రీరామ్ 'అని అరిచాడు. 'పాకిస్థాన్ ముర్దాబాద్' అని రాసి ఉన్న ప్లకార్డును ప్రదర్శించాడు. అస్సాంలో బీజేపీ ముఖ్యమంత్రి రాజకీయ ప్రత్యర్థులను అరెస్ట్ చేయించేందుకు చొరవ చూపాడు. ఆ రాజకీయ ప్రత్యర్థులు 'భారత్ వ్యతిరేకులు' అనీ అస్సాం రాష్ట్ర పాలనా యంత్రాంగం ఆరోపించింది. సామాజిక మాధ్యమాలలో కూడా అటువంటి ఆరోపణలే చేసింది. మధ్యప్రదేశ్‌లో ముస్లిం మతస్థుడైన కాంగ్రెస్ ఎమ్మెల్యేకు, అజ్ఞాత వ్యక్తుల నుంచి చంపివేస్తామనే బెదిరింపులు వచ్చాయి. గుజరాత్‌లో 'చొరబాటుదారులు' అనే ఆరోపణతో వందలాది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజానికి వారిలో అత్యధికులు నికార్సైన భారత పౌరులు.

ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌లలో మితవాద వర్గాల గూండాలు కశ్మీరీ విద్యార్థులు హాస్టళ్లను వీడిపోయేలా బలవంతపెట్టారు. చాలా మంది కశ్మీరీ విద్యార్థులు విద్యాభ్యాసాన్ని విరమించి తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. ముస్సోరిలో కశ్మీరీ శాలువాల విక్రేతలు తమ వ్యాపారానికి స్వస్తి చెప్పి కశ్మీర్‌కు వెళ్లిపోయారు. ఇప్పుడు కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న కశ్మీర్‌లో పహల్గాం ఘటనతో ఎటువంటి సంబంధంలేని ఎంతో మందిని అరెస్ట్ చేశారు. బుల్డోజర్లతో పలువురి కూల్చి వేశారు. ఈ చట్ట విరుద్ధ చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.



■ రామచంద్ర గుహ

గతానుగతం

పహల్గాం ఘటన అనంతరం ప్రధానమంత్రి తన తొలి బహిరంగ ఉపన్యాసాన్ని బిహార్‌లో వెలువరించడం నిరుత్సాహం కలిగిస్తోంది. మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో ప్రధాని ఆ ఉపన్యాసం చేయడం గమనార్హం. ఆ ఉపన్యాసంలోను, ఆ తరువాత 'మన్ కి బాత్' ప్రసంగంలోను ఆసేతు హిమాచలం అన్ని భాషల వారూ పహల్గాం ఘటనను ముక్తకంఠంతో ఖండించారని పేర్కొన్నారు. ఈ దేశంలో బహుళ మతాలు విలసిల్లుతున్నాయని, ఆ మత బాహుళ్యం మన దేశానికి ఒక విశిష్టతను సమకూర్చుతుందనే వాస్తవాన్ని ఆయన అంగీకరించి ఉన్నట్టయితే ఉదాత్త రాజనీతిజ్ఞత అయివుండేది. మతాలకతీతంగా సమస్త ప్రజలూ పహల్గాం ఘటనను ఖండించారనే విషయాన్ని ఆయన ప్రస్తావించలేదు. ముఖ్యంగా ఘటన సందర్భంలోనూ, ఆ తరువాత కశ్మీరీలు మానవీయంగా వ్యవహరించిన వైనం ఆయనకు తెలీకుండా ఎలా ఉంటుంది? ఉగ్రవాద ఘటనపై చర్చించేందుకు జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధానమంత్రి హాజరుకాకపోవడం ప్రజాస్వామిక కార్యసరళి పట్ల ఆయన నిర్లక్ష్య వైఖరిని స్పష్టంగా సూచించింది.

ప్రధానమంత్రి భాషా వైవిధ్యాన్ని గౌరవించారుగానీ మత బహుళత్వాన్ని విస్మరించారు (ఇతర బీజేపీ నాయకులు మరింత సంకుచితత్వంతో వ్యవహరించారు. వారి దృష్టిలో హిందీయే సర్వోన్నత భాష, హిందూమతమే సర్వోన్నత మతం). ఈ దృష్ట్యా పహల్గాం మారణకాండకు వ్యతిరేకంగా సమస్త భారతీయులు మతాలకతీతంగా సమైక్యంగా నిలబడ్డారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించడం ఉత్సాహజనకంగా ఉన్నది.

సరిహద్దు ఆవలివైపువారి అండదండలతో గతంలో సంభవించిన ఉగ్రవాద దాడుల వలే పహల్గాం ఘాతుకం కూడా రెండు పరీక్షలు పెట్టింది. ఒకటి భారత రాజ్యవ్యవస్థకు, రెండోది భారత ప్రజలకు. ప్రజాస్వామ్య రాజ్యాంగ విలువలు, బహుత్వవాద సంప్రదాయాలను సమర్థించే ఆలోచనాపరుడుగా పహల్గాం ఘటనకు సహచర పౌరులు ఎలా ప్రతిస్పందించాలనే విషయమై నాకు స్పష్టమైన భావాలు, అభిప్రాయాలు ఉన్నాయి. అవి చాలా వరకు జవహర్‌లాల్ నెహ్రూ భావాలతో ఏకీభవిస్తాయి. దేశ విభజన అనంతరం రెండు నెలలకు అక్టోబర్ 15, 1947న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో నెహ్రూ ఇలా పేర్కొన్నారు: 'మన దేశంలో ముస్లిం మైనారిటీ ప్రజలు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారు, ఈ దేశం నుంచి వెళ్లి పోదల్చుకున్నప్పటికీ ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి వారిది. వారు ఈ దేశంలోనే నివసించాలి. పాకిస్థాన్ ఎంతగా రెచ్చగొట్టినా, ఆ దేశంలోని ముస్లిమేతరులను ఎంతగా వేధింపులకు గురి చేస్తున్నా మనం మాత్రం మన దేశంలోని ముస్లిం మైనారిటీలను గౌరవాదరాలతో చూడాలి. వారికి పూర్తి భద్రత కల్పించాలి. ఒక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరులకు ఉండే హక్కులు అన్నిటినీ మన ముస్లిం మైనారిటీలకు కల్పించాలి'. నెహ్రూ ఇప్పుడు చాలా నిందలు ఎదుర్కొంటున్న నాయకుడు. ఆయనను అపఖ్యాతిపాలు చేసేందుకు ప్రస్తుత పాలకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన అనుసరించిన ఆర్థిక, దౌత్య విధానాలలో లొసుగులు ఉండవచ్చుగానీ భాషా, మతపరమైన బహుళతత్వాన్ని కాపాడడంలో ఆయన నిబద్ధత, దార్శనికత వర్తమాన భారతదేశానికి మరింతగా అవసరం.

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యల నేపథ్యంలో నెహ్రూ భావాల, విధానాల ఉపయుక్తత మరింతగా విశదమవుతుంది. పహల్గాం ఘటనకు కొన్నిరోజులు ముందు కశ్మీర్ పాకిస్థాన్ కంఠ రక్తనాళం అని ఆ సైనికాధికారి నొక్కి చెప్పాడు. పహల్గాంలో పర్యాటకుల ఊచకోత అనంతరం పాకిస్థాన్ మిలిటరీ అకాడమీలో మాట్లాడుతూ, ద్విజాతి సిద్ధాంతం గురించి ప్రముఖంగా ప్రస్తావించాడు. హిందువులు, ముస్లింలు వేర్వేరు జాతులు అని— మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలలో పూర్తిగా భిన్నమైనవారని, ఒక సమాజంలో ఇరువురూ సహజీవనం నెరపడం అసాధ్యమని పాక్ ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు. వినాయక్ దామోదర్ సావర్కర్ మొదలైన మితవాద నాయకులు ఇటువంటి భావాలతో తమ సొంత ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. హిందువులు, ముస్లింల మధ్య శాంతియుత సహజీవనం అసాధ్యమని ఘోషించారు. దేశ విభజన అనంతరం కోట్లాది ముస్లింలు భారత్‌లోనే ఉండిపోయారు. అయితే ముస్లింలు ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా హిందువులకు లోబడి ఉండి తీరాలని హిందుత్వ వాదులు తెగేసి చెప్పుతున్నారు. ఈ హానికర ఆలోచనా ధోరణులను, రాజకీయ కార్యక్రమాలను నెహ్రూ దృఢ సంకల్పంతో ఎదుర్కొన్నారు. స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలో పాకిస్థాన్‌లో ముస్లిమేతర పౌరులు ఎంతగా అవమానాలు, తిరస్కరణలకు గురవుతున్నప్పటికీ భారత్‌లో ముస్లింలను గౌరవాదరాలతో చూడాలని, దేశ పౌరులకు రాజ్యాంగం నిర్దేశించిన హక్కులు అన్నిటినీ వారికి ముస్లిం మతస్థులకు కల్పించాలని పదే పదే స్పష్టం చేశారు. తుదివరకూ ఆయన ఆ వైఖరికే కట్టుబడి ఉన్నారు. పాకిస్థాన్ ఉసిగొల్పిన ఉగ్రవాదులు పహల్గాంలో భారతీయులు, హిందువులు అయిన పర్యాటకులను ఊచకోత కోసిన నేపథ్యంలో మన సమున్నత భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య సంస్థాపక విలువలను గౌరవించే మనం, మన రిపబ్లిక్ భవిష్యత్తు భద్రంగా ఉండాలని కోరుకునే మనం మత విశ్వాసాల రీత్యా ముస్లింలు అయిన భారతీయులను గౌరవాదరాలతో చూసేందుకు, ఈ దేశ సంపూర్ణ, సమాన పౌరులుగా పరిగణించేందుకు మన ప్రయత్నాలను మరింత ద్విగుణీకృతం చేయాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

'సుప్రీం' హద్దులు విస్తరిస్తున్నాయా?

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అత్యంత ఆమోదయోగ్యమైన, నిలకడైన పరిపాలనా విధానంగా కొనసాగడానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వేసిన పునాదే కారణం. అది మరింత బలోపేతం కావాలంటే రాజ్యాంగ మూలస్తంభాలైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు పరస్పర గౌరవంతో, స్పష్టమైన అధికార పరిధుల ఆధారంగా పనిచేయడం తప్పనిసరి. దీనికి విరుద్ధంగా ఇటీవల శాసన (రాష్ట్రపతి) – న్యాయ వ్యవస్థల మధ్య సంఘర్షణ చోటుచేసుకోవడం ఆందోళనకరం. ఇలాంటి ఘటనలతో ప్రజాస్వామ్య శాశ్వత మనుగడే ప్రశ్నార్థకం కాగలదు.

రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్లకు నెల రోజుల గడువు, రాష్ట్రపతికి మూడు నెలల గడువును విధిస్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడాన్ని రాజ్యంగ, రాజకీయ, న్యాయశాస్త్ర విశ్లేషకులు విమర్శిస్తున్నారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల మధ్య సుస్పష్టమైన హద్దులు ఉన్నప్పటికీ, న్యాయవ్యవస్థ ఈ విధమైన ఆదేశాలతో తన పరిధిని అధిగమించాలనో, విస్తరించాలనో చూస్తున్నదా అన్న అనుమానం వ్యక్తం అవుతున్నది.

సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలు 'సూపర్ పార్లమెంట్'గా వ్యవహరించాలని భారత రాజ్యాంగ నిర్మాతలు ఎన్నడూ అనుకోలేదని ఆయన అన్నారు. మరోవైపు సర్వోన్నత న్యాయస్థానం తన అభిప్రాయంగా— "రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఏ అధికార వినియోగమైనా న్యాయసమీక్షకు అతీతం కానే కాదు" అని స్పష్టం చేసింది. ఈ సందర్భాన్ని రాజ్యాంగ పరిరక్షణగా చూడాలా, లేక వ్యవస్థలు తమ పరిమితులు దాటే ప్రయత్నంగా చూడాలా అనే చర్చ అంతటా మొదలైంది.

సుప్రీంకోర్టు ఈ గడువు విధించే విషయంలో గవర్నర్ వ్యవస్థను రాష్ట్రపతి స్థాయితో సమానంగా భావించడం తగునా అన్నది ఆలోచించాల్సిన విషయం. రాష్ట్రపతి, గవర్నర్ ఈ రెండు రాజ్యంగ వ్యవస్థలను వారి వారి పరిధులలో "సమాన అధికారాలున్న అసమానులు"గా చూడాలి. భారత రాజ్యాంగం ప్రకారం సంపూర్ణమైన ఎన్నిక ద్వారా పదవిలోకి వచ్చే అత్యున్నత, ఏకైక అధికార పీఠం కేవలం రాష్ట్రపతిది మాత్రమే. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, రాష్ట్రాల -కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభ సభ్యుల ఎలెక్టోరల్ కాలేజీ కలిసి రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. మిగతా వారంతా రాష్ట్రపతి విచక్షణాధికారం ద్వారా నియమించబడడమో, లేదా నామినేట్ చేయబడడమో జరుగుతుంది. కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థలకు రాష్ట్రపతే అధిపతి. రాష్ట్రపతి చేసే ముఖ్యాతి ముఖ్యమైన నియామకాలలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్ట్, హైకోర్ట్ న్యాయమూర్తులు, ఎన్నికల అధికారులు తదితరులు ఉంటారు.

గవర్నర్ వ్యవస్థ ఆది నుంచీ తటస్థ వ్యవస్థగా పేరు తెచ్చుకోలేకపోయింది. గవర్నర్ల నియామకం ఎప్పుడూ వివాదాస్పదమే. గవర్నర్ తనకు సంక్రమించిన అధికారాలను, విధులను సహకార సమాఖ్య స్ఫూర్తితో, భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడానికి ఉపయోగిస్తారని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. దురదృష్టవశాత్తూ దీనికి పూర్తి భిన్నంగా, అందరూ కాకపోయినా మెజారిటీ గవర్నర్లు, అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఏజంట్లుగా పదవిని దుర్వినియోగం చేస్తూ వచ్చారు. కాబట్టి ఈ సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం గవర్నర్‌లకు గడువు విధించడం సమంజసమే కావచ్చు. కానీ రాష్ట్రపతిని గవర్నర్లతో సమానంగా భావిస్తూ గడువు విధించడం చర్చించాల్సిన అంశం!



భారత రాజ్యాంగంలో న్యాయసమీక్షకు విశేష ప్రాధాన్యత ఉన్నది. అలాగే రాష్ట్రపతి పదవికి, అధికారాలకు, బాధ్యతలకు కూడా విశేషమైన ప్రాధాన్యత ఉన్నది. న్యాయసమీక్ష అనే సూత్రాన్ని స్వేచ్ఛతో నిర్వర్తిస్తున్న సుప్రీంకోర్టు అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన రాష్ట్రపతికి ఏ మేరకు పరిమితులు విధించవచ్చు?

ఏదైనా మౌలికమైన అంశంలో రాష్ట్రపతి సరైన ఆలోచన కోసం తీసుకునే సమయంతో సహా, అనేక అంశాల్లో స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవడమన్నది ఆ పదవికి వన్నె తెచ్చే రాజ్యాంగపరమైన అధికారం. అటువంటి విషయంలో సర్వోన్నత న్యాయస్థానం గడువు విధించడం గౌరవభరిత రాజ్యాంగ కర్తవ్యంలో జోక్యం చేసుకోవడంగానే భావించాలి.

భారత రాజ్యాంగంలో న్యాయసమీక్షకు విశేష ప్రాధాన్యమున్నది. అలాగే రాష్ట్రపతి పదవికి, అధికారాలకు, బాధ్యతలకు కూడా విశేషమైన ప్రాధాన్యం ఉన్నది. న్యాయసమీక్ష అనే సూత్రాన్ని స్వేచ్ఛతో నిర్వర్తిస్తున్న సుప్రీంకోర్టు అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన రాష్ట్రపతికి ఏ మేరకు పరిమితులు విధించవచ్చా అన్నది చర్చనీయాంశం. ఒకవేళ రాష్ట్రపతి లేదా గవర్నర్ కార్యాచరణలో మలినమైన ఉద్దేశం లేదా రాజ్యాంగ ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తే తప్ప, సర్వోన్నత న్యాయస్థానం ఈ అంశంపై మార్గనిర్దేశాలు ఇవ్వడం అనేది అతి జోక్యమే అవుతుంది.

అసలు రాష్ట్రపతి, గవర్నర్ల ఆలస్యాలపై తీర్పు చెప్పే ముందు న్యాయస్థానాలు స్వయంస్థితిని గుర్తించకపోవడం తగునా? వివిధ స్థాయి న్యాయస్థానాలలో వేలాది కేసులు దశాబ్దాలుగా పెండింగులో కొనసాగుతున్నాయి. అయోధ్య, ఎన్నికల అనర్హత కేసులు, పౌర వివాదాలు వంటి అనేక గుణాత్మక కేసులు సంవత్సరాల తరబడి కోర్టులలో కొట్టుమిట్టాడాయి. ముందు ఈ అంశంపై సమగ్రంగా ఆలోచన చేయకుండా, సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్రపతికి గడువు విధించడంపై రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులు చర్చ జరపాలి. 'ఆలస్యమైన న్యాయం అన్యాయమే' అనే సూత్రానికి అనుగుణంగా న్యాయస్థానాలు సైతం నిర్ణీత గడువులో కేసుల పరిష్కారం విషయంలో సమయపాలన పాటించేటందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

బిల్లులపై నిర్ణయాలను గడువుల్లో తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన తీర్పు వెనుక ఉన్న ఉద్దేశం మంచిదే కావచ్చు. అధికార స్వామ్యం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలు ఆలస్యం కావటం లేదా వాటికి రాజకీయ ఆటలు అడ్డం రావటం... ఇంతవరకు మాత్రమే న్యాయశాస్త్రం పట్టించుకోవాల్సిన అంశం. రాజ్యాంగ విలువలను నిలబెట్టే బృహత్తర ప్రయత్నంలో శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల మధ్య సమన్వయం తప్పనిసరి. నిజమైన మార్పు రావాలంటే రాజ్యాంగపరమైన నియామకాల్లో రాజకీయ ముసుగు తొలగాలి. రాష్ట్రపతి, గవర్నర్లు రాజ్యాంగంలోని అక్షరాన్ని మాత్రమే కాదు, ఆత్మను కూడా గౌరవించాలి. అదే విధంగా, న్యాయవ్యవస్థ కూడా ఇతరులపై ప్రమాణాలు విధించే ముందు తనదైన ఆలస్యాలపై స్వయంగా ఆలోచించాలి. ప్రజాస్వామ్య త్రిమూర్తులు (న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు) పరిమితులకు లోబడి, పోటీ తత్త్వం లేకుండా వ్యవహరించడంలోనే ప్రజాస్వామ్య స్థిరత్వం ఆధారపడి ఉంది.

■ వనం జ్వాలానరసింహారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా | ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com





కలల సౌధం కళ్ల ముందు వాలింది. ఆశల రాజధాని అంగరంగ వైభవంగా ఆవిష్కృతమైంది. అమరావతి 2.0కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన వేడుకకు రాష్ట్రవ్యాప్తంగా జైత్రయాత్ర కదిలింది. దారులన్నీ వెలగపూడివైపే సాగాయి. రూ.49,040 కోట్లతో కూడిన ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన, కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవంతో రాజధాని అంతటా పండుగ వాతావరణం కనిపించింది. వికసిత అమరావతే లక్ష్యమంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా సాగగా, తెలుగులో ఆయన మాట్లాడిన తీరుకు సభికుల నుంచి హర్షధ్వానాలు మిన్నంటాయి. అమరావతి చరిత్రను కీర్తిస్తూ, రైతుల త్యాగాలను ఉటంకిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రసంగం రాజధాని ఔన్నత్యాన్ని తెలియజేసింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు వేదికలను అలంకరించగా, సభా ప్రాంగణంలో అమరావతి రైతులకు అగ్రస్థానం లభించింది. అంబరాన్నంటిన ఈ వేడుకకు వాతావరణం కూడా చల్లగా మారగా, జనాలు తండోపతండాలుగా తరలివచ్చి అమరావతికి జేజేలు పలికారు.

గ్యాలరీలు నిండిపోవడంతో వేదిక బయట నుంచే ప్రధాని ప్రసంగాన్ని వింటున్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) సభావేదికపై పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు చిరునవ్వులు

అమరావతి 2.0





జయహో..

వేడుకలా రాజధాని పునః ప్రారంభోత్సవం

ప్రధాని మోదీ రాకతో పండుగ వాతావరణం

అమరావతి ఔన్నత్యాన్ని కీర్తించిన సీఎం చంద్రబాబు

- కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- నాగాయలంక మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ వర్చువల్ ప్రారంభం
- దేశ రక్షణకు నవశక్తిని ఇస్తుందంటూ ప్రధాని వ్యాఖ్య
- విజయవాడ-కాజీపేట మూడోలైన్ జాతికి అంకితం

దారులన్నీ రాజధానివైపే.. భారీగా తరలిన జనం

- వందలాది వాహనాలతో పార్కింగ్ ప్రాంతాలు ఫుల్

కిక్కిరిసిపోయిన సభా ప్రాంగణాలు, గ్యాలరీలు

విజయవాడ/గుంటూరు/తుళ్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి జనసంద్రంగా మారింది. వెలగపూడి వేదికగా రాజధానిలో రూ.49 వేల కోట్ల పనులకు, నిర్మాణాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు ప్రధాన వేదికపై ఆశీనులు కాగా, ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. సభ జరిగే వెలగపూడితో పాటు అన్ని గ్రామాల్లోనూ ఇదే వాతావరణం కనిపించింది. సభకు వెళ్లే మార్గాలన్నీ వాహనాలు, జనంతో నిండిపోయాయి. కాగా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగాయలంకలో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశరక్షణ వ్యవస్థలో కీలకపాత్ర పోషించనున్న మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌ను నవదుర్గగా అభివర్ణించారు. అమరావతి రాజధానికి అన్నివిధాలా సహకరిస్తానని ఆయన చెప్పటంతో సభికులు చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు. అలాగే, విజయవాడ-కాజీపేట మూడోలైన్ మార్గాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. అమరావతి కోసం భూ సమీకరణలో భూములిచ్చిన మిగతా 6లో..

బస్సెనక బస్సు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అన్నిదారులూ అమరావతివైపే సాగాయి. వందలాది బస్సులు అమరావతికి క్యూ కట్టాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి అంచనాలకు మించి బస్సుల్లో తరలివచ్చారు. దీంతో జాతీయ రహదారులన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 400 ఆర్టీసీ బస్సులు, 2,500కు పైగా ప్రైవేట్ బస్సుల్లో అమరావతి వెళ్లారు. ఇవికాకుండా సొంతకార్లు, ఇతర వాహనాల్లోనూ బయల్దేరి వెళ్లారు. హైదరాబాద్ నుంచి కూడా తండోపతండాలుగా వాహనాలు తరలివచ్చాయి. ఈ వాహనాలన్నీ ఎన్టీఆర్ జిల్లా మీదుగానే వెళ్లాల్సి రావడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది. పోలీసుల ముందస్తు ప్రణాళికల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాలేదు. భారీ వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్లించడంతో సమస్యలు తలెత్తలేదు. బస్సులు భారీగా తరలివస్తుండటంతో అధికారులు ఒకింత ఆందోళన చెందారు. మధ్యాహ్నం 2 గంటలకే అమరావతిలో సభా ప్రాంగణం పక్కనే ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్ ప్లేస్‌లు నిండిపోయాయి. వస్తున్న వాహనాలకు చోటు లేకపోవటంతో నగరం బయటే వాహనాలను నిలుపుదల చేశారు. చాలామంది నడుచుకుని అమరావతి వెళ్లారు. అశేషంగా వస్తున్న ప్రజలకు భోజన ఏర్పాట్లు కూడా సరిపోకపోవడంతో అదనంగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది.



వెలుగులీనుతున్న ప్రకాశం బ్యారేజీ

జాతీయ జెండాతో స్కేటింగ్ క్రీడాకారుల విన్యాసం



రక్షణరంగ ఆకాంక్షలు సాకారం

నాగాయలంక నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ పనులు ప్రారంభం 8లో

ఆటంకాలు లేకుండా అమరావతికి..

కీలకంగా మారిన పశ్చిమ బైపాస్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రంలో ఎక్కడెక్కడి నుంచో బస్సులు కదిలొచ్చినా విజయవాడపై మాత్రం ఆ ప్రభావం పడలేదు. సాధారణ వాహనదారులు ముందుకు సాఫీగా సాగిపోయారు. దీనంతటికీ ప్రధాన కారణం పశ్చిమ బైపాస్ రోడ్డు మార్గమే. వెలగపూడిలో రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం భారీస్థాయిలో నిర్వహించినా నగరం మీదుగా ఎలాంటి బస్సులు రాకపోకలు సాగించకుండా ఈ రోడ్డు ప్రధానంగా నిలిచింది. బస్సులన్నీ నగరంలోకి ప్రవేశించకుండానే అమరావతి చేరుకున్నాయి. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచి బస్సులు భారీగా రాగా, గన్నవరం నుంచి నిర్మించిన పశ్చిమ బైపాస్ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకున్నాయి. ఇందుకు కృష్ణా బ్రిడ్జి కూడా కీలకంగా ఉపయోగపడింది. ఫలితంగా గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన బస్సులు నేరుగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వెలగపూడి చేరుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి బయల్దేరిన వాహనాలు కూడా ఇదే మార్గంలో వెళ్లాయి. కృష్ణాజిల్లా నుంచి కొన్ని బస్సులు మాత్రం వారధి మీదుగా వెళ్లాయి.

దశదిన కర్మకు వెళ్తుండగా

దారుణం

రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం

జొన్నపాడు పెట్రోల్ బంకు వద్ద ఘటన





రామాంజనేయులు, సీతామహాలక్ష్మి (ఫైల్)

పెదపారుపూడి/గుడ్లవల్లేరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : చనిపోయిన బంధువు దశదిన కర్మకు బయల్దేరిన ఆ జంటకు అదే ఆఖరిరోజు అయ్యింది. పెదపారుపూడి పరిధిలోని జొన్నపాడు పెట్రోల్ బంకు వద్ద కారు ఢీకొని మిగతా 6లో..

పుట్టినింటి నుంచి మెట్టినింటికి..

పాకిస్థాన్‌కు చెందిన బెజవాడ కోడలు ప్రయాణం

- దేశాలు వేరైనా పెద్దలు కుదిర్చిన పెళ్లి
- ఉగ్రదాడికి ముందు పాకిస్థాన్‌కు పయనం
- ఆంక్షల నేపథ్యంలో ఆగమేఘాలపై భారత్‌కు..
- వీలుకుదిరినప్పుడల్లా విహారయాత్రలు
- భర్త, కూతురుతో కలిసి ఉన్న ఫొటోలు వైరల్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మోనికా రజని.. భారత్-పాక్ యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్న పేరు. పాకిస్థాన్‌లోని కరాచీలో పుట్టిన ఈమె నగరంలోని గురునానక్ కాలనీకి చెందిన పవన్ బొడానిని 2016లో వివాహం చేసుకున్నారు. అయితే, ఇటీవలే ఆమె పుట్టినింటికి వెళ్లారు. ఆ తర్వాత ఉగ్రదాడి జరగటం, రెండు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవటం, స్థానికేతరులు తిరిగి వెళ్లిపోవాలని రెండు దేశాలు ప్రకటించడంతో మోనిక పేరు వెలుగులోకి వచ్చింది. ఆమె రాకపై ఉత్కంఠ నెలకొనగా, రెండు రోజుల కిందటే అమృత్‌సర్‌కు చేరుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా ఆమె ఫొటోలు వైరల్ అవుతున్నాయి. తన ఐదేళ్ల కుమార్తెతో క్షేమంగా చేరుకోవడంతో పాకిస్థాన్‌కు చెందిన బెజవాడ కోడలి టాపిక్ ఎక్కువగా నడుస్తోంది. జియా బొడానిగా పేరు మార్చుకున్న ఆమె భారతదేశ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. త్వరలో ఆమెకు భారత పౌరసత్వం లభించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఆమె పాకిస్థాన్ పౌరురాలిగా ఉన్నప్పటికీ దీర్ఘకాలిక వీసాను కలిగి ఉండటం వల్ల ఆమెకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం కుమార్తెతో కలిసి అమృత్‌సర్‌లో ఉన్న ఆమె భర్త పవన్ బొడాని, అత్తమామలు కలిశారు. వీరంతా త్వరలో విజయవాడకు రానున్నారు. రెండు దేశాలపై ఎంతో మమకారంతో ఉండే రజనీ.. పాకిస్థాన్‌లోని సింధ్ ప్రాంతంలో ఉన్న కియామరి ఫ్రెంచ్ బీచ్‌ను సందర్శించారు. సముద్రతీరంలో ఆమె దిగిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె ఇండియాకు తిరిగొచ్చి రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో షరీఫ్ దర్గాను సందర్శించారు. అనాసాగర్ సరస్సును కూడా వీక్షించారు.

అన్యోన్య దాంపత్యం

మోనికా రజని, పవన్ బొడాని దంపతులను చూస్తే చూడముచ్చటేస్తుంది. పాకిస్థాన్‌లో పుట్టినా ఆమె భారత పండుగలను ఘనంగా జరుపుకొంటారు. దీపావళి పండుగంటే చాలా ఇష్టపడతారు. తన కూతురు సమైరాను ఇటీవల క్యూటెస్ట్ బేబీ కాంపిటీషన్‌లో పాల్గొనేలా చేశారు. భర్త పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఐ లవ్ మై హస్బెండ్ అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

భారీ వర్ష బీభత్సం

- జగ్గయ్యపేటలో అర్ధరాత్రి ఈదురుగాలులు
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు..దెబ్బతిన్న పంటలు 8లో





అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక • రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి



పవన్ స్వాగతం.. లోకేశ్, మోదీ చమత్కారం

కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

మహిళల విజయ దరహాసం

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధానమంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



దుర్గమ్మను దర్శించుకుని సభావేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పలనాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్దప్రసాద్, కామినేని శ్రీనివాస్



అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి వచ్చిన గల్ఫ్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు రాధాకృష్ణ, మీడియా కో-ఆర్డినేటర్ డి.సాగర్

వేదికలు నిండిపోవడంతో బయట నుంచే ప్రధాని ప్రసంగం వింటున్న ప్రజలు

జయహో..

(5వ పేజీ తరువాయి)

రైతులు మురిసిపోయారు. ఐదేళ్ల అష్టకష్టాలు పడ్డామని, తిరిగి అమరావతికి ప్రాణం పోస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. సభలో అమరావతి రైతులకు అగ్రస్థానాన్ని అందజేశారు. ఏ ప్లస్ పాసులు ఇచ్చి ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రవేశ ద్వారంలో అనుమతించారు.

అన్నిదారులూ అమరావతివైపే..

అమరావతిని చూడాలన్న ఆకాంక్షతో రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకే రాజధానికి దారి తీసే మార్గాల్లో జనసందోహం కనిపించింది. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వివిధ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలకు సభ ముగిసిన సమయంలో కూడా ప్రాంగణానికి చేరుకుంటూనే ఉన్నారు.

మధ్యాహ్నానికే కిటకిట

వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నాం 12 గంటలకే నిండిపోయింది. గ్యాలరీలన్నీ నిండిపోవడంతో ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఈ-6, 7, 8 రోడ్ల వరకు, ఎన్-9 రోడ్డు, సచివాలయం చుట్టుపక్కల రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణానికి చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటు చూసినా జనమే కనిపించారు.

వెల్లివెరిసిన జాతీయత

రాజకీయ పార్టీల జెండాలకు ఆస్కారం లేకుండా అమరావతి పునర్నిర్మాణ పండుగ జరిగింది. ప్రజలు మూడు రంగుల జెండాలను ప్రదర్శిస్తూ జాతీయతను చాటారు. సభ వెలుపల, సభా ప్రాంగణంలో ఎక్కడా ఏ పార్టీ జెండాల ప్రదర్శన లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కేవలం మువ్వన్నెల జాతీయ జెండాను మాత్రమే అనుమతించారు. ప్రధాని సభావేదిక మీదకు రాగానే ప్రజలు వందేమాతరం.. అంటూ స్వాగతం పలికారు. అమరావతి రైతులు జయహో... అమరావతి అంటూ పచ్చ కండువాలు గాలిలో ఊపారు. అలాగే, ప్రధాని హెలిప్యాడ్ మొదలు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం పొడవునా సభా ప్రాంగణం వరకు జాతీయ జెండాలతో అలంకరించారు.



ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్ నజీర్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రఘురామ కృష్ణంరాజు

ప్రధాని మోదీకి ఘనస్వాగతం, వీడ్కోలు

» గన్నవరం విమానాశ్రయంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు

గన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి విజయవాడ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. కేరళలోని తిరువనంతపురం నుంచి గన్నవరం విమానాశ్రయానికి శుక్రవారం మధ్యాహ్నాం 2.49 గంటలకు 'ఇండియా వన్' ప్రత్యేక విమానంలో మోదీ వచ్చారు. విమానం నుంచి దిగుతూనే మోదీ అభివాదం చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్(చిన్ని), సీఎం రమేష్, తెన్నేటి కృష్ణప్రసాద్, పాక వెంకట సత్యనారాయణ, చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, యార్లగడ్డ వెంకట్రావు, సోము వీర్రాజు, కొణిదెల నాగబాబు, యలమంచిలి సుజనాచౌదరి, కామినేని శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంత రాము, డీజీ అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ అభిషేక్, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులు ప్రధాని మోదీకి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. విమానాశ్రయం నుంచి వాయుసేన హెలికాప్టర్‌లో అమరావతికి మోదీ బయలుదేరి వెళ్లారు.

భారీ బందోబస్తు ఏర్పాట్లు

ప్రధాని మోదీ రాకను పురస్కరించుకుని గన్నవరం విమానాశ్రయం పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ పర్యవేక్షణలో అడుగడుగునా పోలీసు బలగాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి.

ప్రధాని మోదీకి ఘన వీడ్కోలు

అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపనతో పాటు, రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం వాయుసేన హెలికాప్టర్‌లో ప్రధాని విజయవాడ విమానాశ్రయానికి బయలుదేరారు. ప్రధానితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు మోదీతో హెలికాప్టర్‌లో విజయవాడ విమానాశ్రయానికి సాయంత్రం 6.07 గంటలకు చేరుకున్నారు. కూటమి నాయకులు, అధికారులతో మోదీ కొద్దిసేపు ముచ్చటించి ప్రత్యేక విమానంలో 6.44 గంటలకు ఢిల్లీ వెళ్లారు. ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం చంద్రబాబు రోడ్డు మార్గాన ఉండవల్లిలో తన నివాసానికి వెళ్లారు.

పంచుమర్తి అనూరాధకు ప్రధాని పరామర్శ

ఢిల్లీకి తిరిగి వెళ్లే క్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధను ప్రధాని ప్రత్యేకంగా పలకరించారు. తాను బలహీన వర్గానికి చెంది.. కేన్సర్‌తో బాధపడుతున్నా పార్టీలో కష్టపడి పనిచేస్తుండటాన్ని చంద్రబాబు గుర్తించి గౌరవంగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని అనూరాధ చెప్పగా.. రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోండి.. చంద్రబాబు మీకు మంచి అవకాశం ఇచ్చారు. అది నిలబెట్టుకోవాలి' అని మోదీ అన్నారు.



విమానాశ్రయంలో నిర్మిస్తున్న టవర్ సమీపం నుంచి పొగ

విమానాశ్రయంలో అగ్ని ప్రమాదం!

గన్నవరం : గన్నవరం విమానాశ్రయంలో శుక్రవారం మధ్యాహ్నాం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రధాని మోదీ వచ్చే ముందు విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న టవర్ సమీపంలో మంటలు వ్యాపించాయి. ఆ ప్రాంతం ఖాళీగా ఉండటంతో ఎండిపోయిన గడ్డి, చెత్త, చెట్లు ఉన్నాయి. సరిగ్గా ప్రధాని వచ్చే ముందు మంటలు ఎగసిపడ్డాయి. దట్టంగా పొగ వ్యాపించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న టవర్ దగ్గర పనిచేసే కూలీలకు సెలవు ఇచ్చారు. అయితే ఆ సమీపంలోనే కూలీలు ఉంటున్నారు. బహిర్భూమికి వెళ్లి బీడీ, సిగరెట్ కాల్చి ఎండిపోయిన గడ్డి మీద వేసి ఉంటారని భావిస్తున్నారు. మంటలు ఎగసిపడటంతో విమానాశ్రయంలో ఏం జరిగిందోనని చుట్టుపక్కల నివాసితులు ఆందోళన చెందారు.

ఘనంగా ఐసీఆర్‌ఏఐసీ 2 ఐటీ సదస్సు

విజయవాడ కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్స్, ఇంజనీరింగ్ విభాగం అధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆగిరిపల్లిలో జరిగిన అంతర్జాతీయ సదస్సు 'సమీప కాలానుగుణ కృత్రిమ మేధస్సు, గణితబద్ధమైన మేధస్సు, సమావేశపూరిత సాంకేతికతల అభివృద్ధి (ఐసీఆర్‌ఏఐసీ 2 ఐటీ)' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కంప్యూటర్ శాస్త్ర విభాగాధిపతి డి.సునీత ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఛైర్మన్, డీన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాల అధిపతి కేవీ సాంబశివరావు సదస్సు నివేదికను సమర్పించారు. మొత్తం 284 పరిశోధనా పత్రాలు అందగా, కఠినమైన ద్వంద్వ గోప్య సమీక్ష (డబుల్-బ్లైండ్‌పీర్-రివ్యూ) ప్రక్రియ అనంతరం 114 పత్రాలు ఎంపికయ్యాయి. ఈ పత్రాలు ప్రపంచ స్థాయి స్కోపస్ సూచికలో వుండే టేలర్ అండ్ ఫ్రాన్సిస్ ప్రచురణల్లో వెలువడనున్నాయి. రైట్ స్టేట్ విశ్వవిద్యాలయం, కాలిఫోర్నియా స్టేట్ విశ్వవిద్యాలయం, ఇస్రో, అమృత విశ్వవిద్యాలయం, వీఐటీ, నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, నెక్టార్ ఇన్ఫోటెక్ (అమెరికా), చండీగఢ్ విశ్వవిద్యాలయం, మహీంద్రా విశ్వవిద్యాలయం, ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్, అన్నా విశ్వవిద్యాలయం తదితర 122 ప్రతిష్టాత్మక విద్యా, పరిశోధనా సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌ఐ ఐటీ ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్ మాట్లాడుతూ, ఇలాంటి సదస్సులు అంతర్జాతీయ స్థాయిలో విద్యా, పరిశోధన సంబంధాలు పెంపొందించడంలో కీలకంగా పనిచేస్తాయన్నారు. ముఖ్యఅతిథి ఎలక్ట్రానిక్స్ అధినేత డాక్టర్ దాసరి రామకృష్ణ డిజిటల్ భవిష్యత్తును ఆవిష్కరించడంలో ఇంజనీరింగ్ పాత్రపై ప్రసంగించారు. అకడమిక్స్ డైరెక్టర్ జి.సాంబశివరావు మాట్లాడుతూ, పరిశోధనలు కొత్త ఆవిష్కరణలతో పాటు వాటి సమాజానికి యదార్థ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలన్న అవసరాన్ని గుర్తు చేశారు. ఢిల్లీలోని అనుసంధాన్ జాతీయ పరిశోధన సంస్థ (ఏఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి రూ.1,50,000 మంజూరు చేయడం ఈ సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, డి.కైలాసరావు, డి.సునీతలు పాల్గొన్నారు.



ఐటీ సదస్సులో పాల్గొన్న ఎలక్ట్రానిక్స్ అధినేత డాక్టర్ దాసరి రామకృష్ణ, ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల అధినేత ఆర్.వెంకట్రావు తదితరులు

దశదిన కర్మకు వెళ్తుండగా దారుణం

(5వ పేజీ తరువాయి)

దంపతులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్ జంక్షన్‌లో ఇటీవల ఓ బంధువు చనిపోగా, శుక్రవారం జరిగిన దశదిన కర్మలో పాల్గొనేందుకు గుడ్లవల్లేరు మండలం చినగొన్నూరుకు చెందిన కోటప్రోలు రామాంజనేయులు (60), సీతామహాలక్ష్మి (55) శుక్రవారం ఉదయం టీవీఎస్ ఎక్సెల్‌పై బయల్దేరారు. జొన్నపాడు పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి వేగంగా వచ్చిన కారును వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

చినగొన్నూరులో విషాదఛాయలు

దంపతుల మృతితో చినగొన్నూరు గ్రామం శోకసంద్రమైంది. సామాన్య రైతు కుటుంబమైన వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెళ్లిళ్లై ఎవరి జీవితం వారు జీవిస్తున్నారు. ప్రమాద సమయంలో మృతురాలి సోదరి, భర్త అయిన కోటప్రోలు శివరామకృష్ణ, శివపార్వతి వెంటే ఉన్నారు. కళ్లెదుటే జరిగిన ప్రమాదాన్ని చూసి వారు తట్టుకోలేకపోతున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గ్రామానికి తీసుకురాగా, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

రైతుబజారులో కాటాల తనిఖీలు



పటమట, మే 2 (ఆంధ్రజ్యోతి): పటమట రైతుబజారులో వ్యాపారస్థుల కాటాలను తూనికల కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. స్టాంప్ డ్యూటీ కట్టని 25 మంది చేత స్టాంప్ డ్యూటీ కట్టించి కాటాలకు సీలు వేసి క్రమబద్ధీకరించినట్లు తూనికల కొలతలశాఖ సర్కిల్ -1 ఇన్‌స్పెక్టర్ మునిరాజ్ తెలిపారు.

యువతలో గుండెపోటుపై ఆరోగ్య సదస్సు నేడు

బెంజిసర్కిల్, మే 2 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్‌లోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు యువతలో గుండెపోటు అనే అంశంపై ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జి. సమరం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసదస్సుకు ముఖ్యవక్తగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె. వంశీకృష్ణ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.

జగన్మాతకు నృత్య కళార్చన



ఇంద్రకీలాద్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో ఉన్న కళావేదికపై శుక్రవారం విజయవాడకు చెందిన కళాబృందం కనకదుర్గమ్మకు నృత్య కళార్చన నిర్వహించారు. నృత్య గురువు బి.హెచ్.భవానీ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు 17 మంది కళాకారులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

ఆర్థిక సమస్యలతో వివాహిత ఆత్మహత్య

వన్‌టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తాళలేక మనస్తాపం చెందిన వివాహిత (27) గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక ఆనంద్‌భవన్ రోడ్డులో అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతను పాత పేపర్ల వ్యాపారం చేస్తాడు. ఇతని పెద్ద కుమార్తె శిరీష (27)కు బాపట్ల సమీపంలో ఉంటున్న పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. శిరీష బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసి కొద్ది రోజుల క్రితం మానేసింది. ప్రస్తుతం ఆమె కృష్ణలంకలో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె భర్త హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. గత కొన్ని రోజులుగా తనకు, భర్తకు ఉద్యోగం లేదని మనస్తాపం చెందుతుంది. మరోపక్క ఆర్థిక సమస్యలతో కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆమె గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

జనశిక్షణా సంస్థాన్‌లో వేసవి శిక్షణా తరగతులు

మొగల్రాజపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనశిక్షణా సంస్థాన్‌లో జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం మే నెలలో స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఏ. పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలలో కటింగ్ టైలరింగ్,హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ హెల్పర్, రిఫ్రిజిరేషన్ రిపేర్, మెషిన్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్, జామ్ జ్యూస్ తయారీలతో పాటు స్క్రీన్ ప్రింటింగ్, చాక్లెట్ మేకింగ్, మిర్రర్ వర్క్స్, శారీ ఫోల్డింగ్, ఫ్లవర్‌మేకింగ్ తదితర వాటిలో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శనివారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 0866- 2470420కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.



కుర్చీలను విరాళంగా అందించిన బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్

బెజవాడ బార్‌కు కుర్చీల వితరణ

విజయవాడ లీగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్‌కు బార్ కౌన్సిల్ మెంబర్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ శుక్రవారం 50 కుర్చీలను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కె.బాషా, కనిశెట్టి వెంకట రంగారావులు చలసానికి ధన్యవాదాలు తెలియజేశారు. బార్ కౌన్సిల్ మెంబర్లు చలసాని అజయ్‌కుమార్, సూరాబత్తుల మల్లేశ్వరరావు, బార్ కోశాధికారి సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

20న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాం

ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్

బస్టేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు శుక్రవారం ఆర్టీసీ ఎండీకి నోటీసు అందజేశారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి ఆధ్వర్యంలో ఎండీకి నోటీసు ఇచ్చిన అనంతరం నాయకులు పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని ఎన్టీఆర్ భవన్ వద్ద తమ డిమాండ్ల పత్రాన్ని విలేకర్లకు అందజేశారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సుల సేకరణ, నిర్వహణ, ఇంకా 37 డిమాండ్ల సాధన కోరుతూసమ్మెను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.



మోదీ సభకు ..

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు , 18వ డివిజన్ నుంచి, 20వ డివిజన్ నుంచి, 6వ డివిజన్ నుంచి తరలి వెళుతున్న కూటమి నేతలు, కార్యకర్తలు

భారీగా తరలిన కూటమి శ్రేణులు

పటమట, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు తూర్పు నియోజకవర్గం నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. తూర్పు నుంచి బయలు దేరిన బస్సులను ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు జెండా ఊపి సాగనంపారు. అమరావతి ఆంధ్ర ప్రజల భవిష్యత్ అని అన్నారు. ఏపీలో ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా అమరావతిని చంద్రబాబు తీర్చిదిద్దుతారన్నారు. ● 12వ డివిజన్ నుంచి కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, సాయిన బుజ్జి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ● 14వ డివిజన్‌లో టీడీపీ నాయకుడు నర్రా కిషోర్, కూటమి నాయకుల ఆధ్వర్యంలో వెళ్లారు. ● 11వ డివిజన్ నుంచి కోనేరు రాజేష్, కూటమి నేతల ఆధ్వర్యంలో అమరావతికి తరలివెళ్లారు.

కృష్ణలంక 20, 21, 22 డివిజన్ల నుంచి ..

కృష్ణలంక : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి కృష్ణలంక 20, 21, 22 డివిజన్ల నుంచి వందలాదిగా ప్రజలు బస్సులలో శుక్రవారం ఉదయం తరలివెళ్లారు. వీరితో పాటు స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మోటేపల్లి చిన్నా, జి.జయ, అడపా శివ, గొరిపర్తి నామేశ్వరరావు, తదితరులు వున్నారు.



ఏడో డివిజన్ నుంచి



గుణదల సాయిమెస్ సెంటర్ నుంచి

రాణిగారితోట 17, 18 డివిజన్ల నుంచి...

రాణిగారితోట: రాణిగారితోట 17, 18 డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. 18వ డివిజన్‌లో టీడీపీ తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య అధ్వర్యంలో భారీగా తరలివెళ్ళారు. తెలుగు యువత అధ్యక్షుడు పులిపాటి రాజకుమార్, గంధ్ర రాజు తదితరులు పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు ఆధ్వర్యంలో బస్సులలో తరలి వెళ్లారు.

7, 8 డివిజన్ల నుంచి ..

మొగల్రాజపురం: అమరావతి శంకుస్థాపన సభకు తూర్పు పరిధి 7, 8 డివిజన్ల నుంచి కార్యకర్తలు, నాయకులు, స్థానికులు తరలి వెళ్లారు. ఒక్కో డివిజన్‌కు నాలుగు బస్సులు కేటాయించగా అవి సరిపోలేదు. 7వ డివిజన్ నుంచి నాయకులు గుమ్మడి గురుప్రసాద్, నాగుమోతు రాజా ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు, మహిళా కార్యకర్తలు తరలివెళ్లారు. 8 డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

2, 6 డివిజన్ల నుంచి...

ప్రభుత్వాసుపత్రి: తూర్పు పరిధి 2, 6 డివిజన్ల నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున బస్సుల్లో తరలివెళ్లారు. నేతలు బస్సులకు జెండా ఊపి వాటిని సాగనంపారు. ఈ కార్యక్రమాల్లో దాసరి గాబ్రియేలు, సుగసాని రత్నశ్రీ, ముత్యాల కృష్ణయ్య, పడాల గంగాధర్, పాల్గొన్నారు.

3, 4 డివిజన్ల నుంచి

భారతీనగర్: మోదీ సభకు తూర్పు పరిధి 3, 4 డివిజన్ల నుంచి స్థానిక ప్రజలు, కూటమి కార్యకర్తలు తరలి వెళ్లారు.

నేడే చూడండి
RAM CINEMAS
4K DIGITAL LASER, DOLBY ATMOS
(FORMERLY RAMGOPAL THEATRE)
GUNADALA, VIJAYAWADA
HIT
(తెలుగు) 5 ఆటలు : 11-30 AM, 2-45 PM, 6-30PM, 9-45 PM, 10-15PM
రెట్రో
(తెలుగు) 4 ఆటలు : 11-00AM, 2-30PM, 6-45PM, 10-15PM
BOOK YOUR TICKETS IN "BOOK MY SHOW"

RUNNING VERY SUCCESSFULLY at NAVRANG A/c
థండర్ బోల్ట్స్
తెలుగు 3D రోజూ 4 ఆటలు
11:45 AM, 3-00 PM
6:45 PM, 9-45 PM
ADVANCE BOOKING OPEN ONLINE " BOOK MY SHOW"

రింగ్ నుంచి వారధి వరకు
తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



వారధి వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, తాగునీరు, మజ్జిగ కేంద్రాలు

బెంజిసర్కిల్, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి సభకు వెళ్లేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు శుక్రవారం ఉదయం నుంచే రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు రోడ్డు వెంబడి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీకి అధికారులు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వారధి సమీపంలో ఉచిత వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. రింగ్ రోడ్డు నుంచి వారధి వరకు రోడ్డు పక్కన టీడీపీ, జనసేన, బీజేపీ బ్యానర్లను ఏర్పాటుచేశారు. రోడ్డు వెంట పోలీస్ పహారా కూడా భారీగానే కనిపించింది. మచిలీపట్నం, గుడివాడ వైపు నుంచి బందరురోడ్డు మీదుగా అమరావతి సభాస్థలికి వెళ్లే వాహనాలు ఎటువైపు వెళ్లాలో తెలియజేస్తూ బెంజిసర్కిల్‌లో ప్రచార బోర్డులను ఏర్పాటు చేశారు. పోలీసులు మైకు ద్వారా కూడా ప్రచారం నిర్వహించారు.

కులగణనపై కేంద్రం నిర్ణయం చారిత్రాత్మకం

బెంజిసర్కిల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి కృష్ణయ్య పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్. కృష్ణయ్య

బెంజిసర్కిల్, మే 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనగణనలో కులగణన చేయాలనే కేంద్రప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. బెంజిసర్కిల్‌లో శుక్రవారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. మారేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్. కృష్ణయ్య ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తొలుత ప్రధాని చిత్రపటం పట్టుకొని కొద్దిసేపు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ సంఘాల, బీసీ ప్రజల మనోభావాలను ప్రధాని నరేంద్ర మోదీ గుర్తించి ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల దేశం మొత్తం హర్షిస్తుందన్నారు. ప్రధానికి, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యార్లగడ్డ సందీప్, ఎల్ల బాబు, నరేష్‌గౌడ్, మురళీకృష్ణ, పితాని ప్రసాద్, లక్ష్మణరావు, పలువురు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల నగరోత్సవం



జగద్గురు ఆదిశంకరాచార్యుల నగరోత్సవం, చిన్నారులు, భక్తుల కోలాటం



లలితా సహస్రనామం పఠిస్తున్న మహిళలు

ఇంద్రకీలాద్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నగరోత్సవం నిర్వహించారు. మహామండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, కూచిపూడి నృత్య కళాకారుల అభినయం, భజన సంకీర్తనలు, ఆది శంకరుల వేషధారణలు, చిన్నారుల కోలాహలంతో అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ స్థానాచార్యుడు వి.శివ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు కనకదుర్గానగర్, రథంసెంటర్, వినాయక ఆలయం, కెనాల్‌రోడ్ నుంచి తిరిగి దేవస్థానానికి చేరుకుంది.

అభిషేకం, అర్చన

విజయవాడ కల్చరల్: ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా యనమలకుదురులోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆదిశంకరాచార్యులకు అభిషేకం, అర్చన నిర్వహించారు. అనంతరం వేదపండితులను సత్కరించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్ కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు లలితాసహస్ర నామ స్తోత్రాలను పఠించారు. భక్తులకు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగా నర్సింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్.భవానీ తదితరులు పాల్గొన్నారు.

Capital CINEMAS 4K
TRENDSET MALL, BENZ CIRCLE
Book Online Tickets : Paytm TICKETNEW
NOW SHOWING
HIT THE THIRD CASE (A) (TEL)
9:30 AM,10:00 AM,10:20 AM,10:40 AM,12:45 PM
1:10 PM,1:30 PM,1:45 PM,2:00 PM,3:50 PM,4:20 PM
4:35 PM,4:50 PM,5:05 PM,7:00 PM,7:30 PM,7:40 PM
8:00 PM,10:10 PM,10:45 PM,10:50 PM,11:10 PM
RETRO (U/A) (TEL)
10:30 AM,1:00 PM,4:15 PM,7:35 PM,10:55 PM
GYMKHANA (U/A) (TEL) 11:30 AM
RAID 2 (U/A) (HIN)
10:00 AM,2:15 PM,8:05 PM,11:00 PM
THUNDERBOLTS (U/A) (3D) (TEL)
10:00 AM,3:15 PM,8:25 PM
THUNDERBOLTS (U/A) (3D) (ENG)
12:40 PM,5:50 PM,11:00 PM
THE BHOOTNII (U/A) (HIN)
5:20 PM,7:55 PM,10:35 PM
*NOTE: Timings are subject to change without any prior notice.

భోజనం, స్నాక్స్, ఫ్రూట్స్..

» పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పంపిణీ



మొగల్రాజపురం, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమంలో భాగంగా వెలగపూడిలో ప్రధాని సభకు ఎన్టీఆర్ జిల్లా నుంచి తరలివెళుతున్న ప్రజలకు కలెక్టర్ అధ్వర్యంలో పౌరసరఫరాలశాఖ ఆహారం పంపిణీ చేసింది. బ్రేక్‌ఫాస్ట్‌గా బిస్కట్లు, పులిహోర, అరటి పండ్లు, మంచినీరు బాటిల్స్, ఓఆర్ఎస్ టెట్రా ప్యాకెట్, మజ్జిగ ప్యాకెట్లు, భోజనం కిట్‌లో వెజ్‌బిరియాని, సాయంత్రం కిచడీ, గోంగూర చట్నీ అందించారు. మూడు మండలాలు క్లస్టర్లుగా ఐదు కేంద్రాల ద్వారా ఆహారం అందించారు. ఫుడ్ కిట్లను ఎండీయూ వాహనాలు, ఇతర వాహనాల ద్వారా పంపిణీ చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పాపారావు పర్యవేక్షణలో అధికారులు పంపిణీ బాధ్యత నిర్వహించారు. వారితో పాటు మండలాల సిబ్బంది, డీలర్ల బృందాలు పనిచేశాయి. ఈ సదర్భంగా రేషన్ డీలర్లను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అభినందించారు. మొత్తం 50 వేలమందికి పైగా ఆహారం కిట్లను అందించారు.



ప్రాజెక్టు వివరాలు చెబుతున్న వహీమ్

ఏఐలో వహీమ్‌కు అంతర్జాతీయ గుర్తింపు

మొగల్రాజపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ మొదటి బ్యాచ్ విద్యార్థి వహీమ్ అవుట్ స్టాండింగ్ సొల్యూషన్ ఇంప్లిమెంటేషన్ అవార్డును గెలుచుకున్నాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలో వహీమ్ ప్రాజెక్టు ప్రత్యేకంగా నిలవడమే కాకుండా 200 డాలర్ల బహుమతిని గెలుచుకున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కన్వీనర్ లలితప్రసాద్, డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, అధ్యాపకులు, శిక్షణా, ఉద్యోగ నిర్వహణాధికారి కావూరి శ్రీధర్ తదితరులు వహీమ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ముందుగా వహీమ్ తన ప్రాజెక్టును ప్రదర్శించి చూపారు.

రాహుల్‌గాంధీ పోరాట ఫలితమే జనగణన

● సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు

గవర్నర్‌పేట, మే 2 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ చేసిన పోరాట ఫలితంగానే దేశవ్యాప్తంగా జనగణన చేసేందుకు కేంద్ర క్యాబినెట్ ముందుకు వచ్చిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నరహరిశెట్టి మాట్లాడుతూ జనగణనతో పాటుగా అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా కులగణన కూడా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వి.గుర్నాథం, ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు, ఎస్కే అన్సారీ, పోతురాజు ఏసుదాసు, కండెల వరప్రసాద్, బూదాల జోసెఫ్, వేముల శ్రీనివాస్, కుసుమంచి గణేష్, పరశురామ్ యాదవ్, పీటర్ జోసెఫ్, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235071

WANTED
» బ్యాంక్ అనుబంధ సంస్థలో పని చేయుటకు రిటైర్డ్ అయిన వారు VRS తీసుకొన్న వారు టీచర్స్ మరియు గృహిణులు కావలెను. అర్హత : SSC to PG. Age : 30 above. వివరాలకు సంప్రదించండి. 99660 13779
AJB-235351

» Wanted Qualified & Experienced Teachers for MATHS, P.S. up to X, Full Time, NCC "C" Holder Preference. Salaray : Rs. 20,000/- బెజవాడ రాజారావు హైస్కూల్, అరవింద వీధి, విద్యాధరపురం, విజయవాడ-12. ✆ 0866 - 2411914
AJB-235074

★ Wanted Experienced Godown Incharge & Packing boys for Medical Agencies. Srinivasa Drugs, Bhavanipuram. Call: 9704071271
AJH-15154

SALE / RENT
» కానూరు నుండి సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజి బ్యాక్ రోడ్డులో, 2230 చ.అడుగులు 3 BHK డీలక్స్ ఫ్లాట్స్, ఫ్లోర్‌కి ఒకటి చొప్పున 3 ఫ్లాట్స్ అమ్మకము / అద్దెకు (ఫ్యామిలీ). సంప్ర. సెల్ : 91778 64837, 74162 50983
AJB-235018

TO-LET
» ఆటోనగర్ నందు 3rd Phaseలో కమర్షియల్ మరియు Godown నిమిత్తం కొత్తగా Construction చేయబడిన Building అద్దెకు ఇవ్వబడును. Each Floor: 16000 Sft కలిగియున్న ఈ Building నందు మూడు ఫ్లోర్లు అద్దెకు ఇవ్వబడును. అనగా మొత్తం 48000 SFT అద్దెకు ఇవ్వబడును. Car పార్కింగ్ సౌకర్యం Cellar నందు కలియున్నది. ఫ్రైట్ (Goods) Lift మరియు Passenger Lift సౌకర్యం కలదు. మహానాడు రోడ్డు మరియు HT-AYUSH HOSPITAL రోడ్డుకి అతి సమీపంలో ఉన్నది. ✆ 96526 26777, 92468 48505
AJB- 235028

HOUSE FOR SALE
» నెలకు 80,000 అద్దెలు వచ్చే 250 చ.గ. నిర్మించిన G+3, Pent House గల బిల్డింగ్, విజయవాడ ప్రసాదంపాడులో అమ్మకమునకు కలదు. రేటు: 3.25 Cr. ✆ 94403 73594
AJB- 125

PLOT FOR SALE
» అగిరిపల్లి మం. చొప్పరమెట్ల హరిజనవాడ SVR వెంచర్‌లో 68 నెం. పడమర ఫ్లాట్ 111.6 చ.గ., కనసానపల్లిలో తూర్పుఫేస్ గల 40 నెం. 150 చ.గ. ఫ్లాట్ అమ్మబడును. ఫెన్సింగ్ కలదు. సం.88976 25168
AJB- 225549

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, బట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
GST 5%
రూ.290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240





అమరావతి పునఃప్రారంభం సభా ప్రాంగణం వద్ద జనం కోలాహలం



ఆహ్వాన పత్రికలతో సభకు వస్తున్న మహిళా రైతులు



జాతీయ జెండాలు చూపుతున్న ప్రజలు

అమరావతికి తరలిన

అశేష జనం

- పశ్చిమ ఎన్టీఆర్ నుంచి భారీ సంఖ్యలో పయనం
- ఇబ్రహీంపట్నం రింగ్ వైపు నుంచి వెయ్యికి పైగా బస్సులు, 500 కార్లు, 2 వేలకు పైగా ద్విచక్రవాహనాల్లో తరలి వెళ్లిన ప్రజలు
- ఎక్కడికక్కడే ట్రాఫిక్ మళ్లింపు..

ఇబ్రహీంపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా నుంచి బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో పెద్ద సంఖ్యలో జనం తరలివెళ్లారు. అందులో పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా నుంచి అశేషంగా తరలివెళ్లారు. పోలీసుల అంచనా ప్రకారం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి వెయ్యికి పైగా బస్సులు(ప్రభుత్వ, ప్రైవేటు), 500 కార్లు, 2వేల వరకు ద్విచక్రవాహనాలు అమరావతికి వెళ్లాయి. ఇన్ని వాహనాల రోడ్డు మీదకు వచ్చినా ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు జాగ్రత్తలు వహించారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే లారీను ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద నుంచి మైలవరం వైపు మళ్లించారు. అక్కడి నుంచి నూజివీడు, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు వైపునకు మళ్లించారు. విజయవాడ వైపు వెళ్లాల్సిన 30 లారీలను ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద నిలుపుదల చేశారు. తొలిసారి ట్రక్ టెర్మినల్‌ను ఈసభ ద్వారా వినియోగంలోకి తెచ్చినట్లు పోలీసులు తెలిపారు. అమరావతికి కాకుండా వెళ్లే ద్విచక్రవాహనాలు, కార్లను నేరుగా విజయవాడ వైపు పంపారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాలేదు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తిరువూరు, రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి బస్సుల్లో తరలివెళ్లే వారికి ఉదయం, సభ అనంతరం కూడా భోజనం ప్యాకెట్లు అందించేందుకు కొండపల్లి ఐడీఏలో వంట చేయించారు. ప్యాకెట్లను సిద్ధం చేసి ఉదయాన్నే వాటిని కొండపల్లి హెచ్‌పీ కంపెనీ ఎదుట ఉంచి ఎండీయూ వాహనాల్లో ఎక్కించి గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ హాల్ వద్దకు చేర్చించారు. సభ ముగిశాక కూడా వారికి తిరిగి ఆహార పొట్లాలు అందించేందుకు వంట చేయించారు. పలు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మందులు అందుబాటులో ఉంచారు. వెస్ట్ బైపాస్ కింద కూడా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. బైపాస్ ప్రధాన ద్వారం వద్ద మజ్జిగ, వాటర్ బాటిల్స్ నేరుగా బస్సుల్లోకి పంపిణీ చేశారు.



గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ వద్ద కార్లు, బస్సుల్లో తరలివెళుతున్న మహిళలు



కొండపల్లి ఐలా కార్యాలయంలో వంటలు



వెస్ట్ బైపాస్‌పై ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

చింతమనేని ఆత్మీయ ఆతిథ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అమరావతిలో ప్రధాని సభకు తరలివెళుతున్న కూటమి శ్రేణులు, ప్రజలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ఆత్మీయ ఆతిథ్యాన్ని అందజేశారు. బాపులపాడు మండలం ఎస్.ఎస్.పాలెం వద్ద జాతీయ రహదారిపై నియోజకవర్గం నుంచి బస్సుల్లో పెద్దఎత్తున తరలివస్తున్న ప్రజలకు అభినందనలు తెలిపారు. వారికి భోజన ఏర్పాట్లు చేశారు. గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్‌లో సుమారు 5వేల మందికి పైగా విందు భోజనం పెట్టించారు. మటన్ ధమ్‌బిర్యానీ, కట్టా, పెరుగుపచ్చడి, కిళ్లీ, కూల్‌డ్రింక్, మినరల్ వాటర్ బాటిల్ అందిస్తూ స్వయంగా వడ్డించారు. నాన్‌వెజ్ తినని వారికి ప్రత్యేకంగా పప్పు, సాంబారు, వంకాయబఠానీ కూరలతో, మామిడికాయ పచ్చడితో భోజనాలు పెట్టి, కూల్‌డ్రింక్ అందజేశారు.



కార్యకర్తకు భోజనం వడ్డిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

శభాష్.. టీమ్ ఎన్టీఆర్

- సమష్టి కృషితో అమరావతి పునఃప్రారంభం కార్యక్రమం విజయవంతం
- మండల, జిల్లాస్థాయి నోడల్ అధికారులకు అభినందనలు: కలెక్టర్ లక్ష్మీశ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర చరిత్రలో కీలక ఘట్టమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో టీమ్ ఎన్టీఆర్ చేసిన కృషి ప్రశంసనీయమని, కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆయన మాట్లాడారు. ఎంఐపీ, వీవీఐపీ, వీఐపీ తదితరులకు విజయవాడలో వసతి, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం, విజయవాడకు వచ్చిన బస్సులు ఏయే మార్గాల్లో వెళ్లాల్లో సరైన విధంగా దిశానిర్దేశం చేయడంతో పాటు విశాఖపట్నం, మన్యం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనం, తాగునీరు అందిచామన్నారు. ప్రతి బస్సు పార్కింగ్ ఎక్కడ చేయాలనేది స్పష్టంగా సూచనలిచ్చామన్నారు. పార్కింగ్ కోసమే 350 ఎకరాలు కేటాయించినట్టు లక్ష్మీశ తెలిపారు. వెస్టర్న్ బైపాస్, సర్వీసు రోడ్లను కూడా ఉపయోగించుకున్నట్లు తెలిపారు. ఎక్కడా భోజనం, తాగునీటికి కొరత అనే మాట లేకుండా చూశామన్నారు. కార్యక్రమం అనంతరం దూరప్రాంతాలకు తిరిగివెళ్తున్న వారికి రాత్రి భోజనం కూడా అందించినట్లు తెలిపారు. మండలాల నుంచి బయలుదేరుతున్న బస్సుల వద్దకే టిఫిన్లు, భోజనాలను అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. మండల, జిల్లాస్థాయి నోడల్ అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు కార్యక్రమంలో కీలక భాగస్వాములై సేవలందించారని.. వారందరికీ అభినందనలు అని ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రుల సహకారంతో పకడ్బందీ ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమీక్షిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



వాటర్ బాటిల్స్ బస్సుల్లోకి అందిస్తున్న సిబ్బంది

భేషుగ్గా ఏర్పాట్లు

జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చిన వారు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా నగరంలో ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసిన ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, తాగునీరు వంటి వాటిని ఏర్పాటు చేశారు. కలెక్టర్ లక్ష్మీశ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి నిరంతరం పరిస్థితిని సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటనలు చేశారు.



కూకటివేళ్లతో పడిపోయిన మామిడి చెట్లు

భారీ వర్ష బీభత్సం

- జగ్గయ్యపేటలో అర్ధరాత్రి ఈదురుగాలులు
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు..దెబ్బతిన్న పంటలు

జగ్గయ్యపేట, మే 2(ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. పట్టణంలో పలుచెట్లు నేలకూలగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తెల్లవారుఝామున 3 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణానికి నీటి సరఫరా చేసే వాటర్ వర్క్స్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటుచేసి నీటి సరఫరా చేయాల్సి రావటంతో ఆలస్యంగా జరిగింది. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ రాఘవేంద్ర, టీడీపీ నేత ధూళిపాళ లక్ష్మణరావు నష్టం జరిగిన ప్రాంతాలను పరిశీలిచారు. ట్రాన్స్‌కో ఏఈ కృష్ణారెడ్డితో మాట్లాడి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు.

ట్రాన్స్‌కోకు రూ.20 లక్షల నష్టం

వర్షం వల్ల ట్రాన్స్‌కోకు రూ.20లక్షల నష్టం వాటిల్లిందని ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు. రాత్రి నుంచి విద్యుత్ స్తంభాలను నిలబెట్టటం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టామని, ఎక్కడైన సేవాలోపం ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. జగ్గయ్యపేటలో 18.2 మీ.మీల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ ఉపేంద్ర తెలిపారు.

కొట్టుకుపోయిన పాల బూత్

తొర్రగుంటపాలెంలో తెల్లవారుజామున వచ్చిన ఈదురు గాలులకు వెంకటేశ్వర్లు పాలబూత్ కొట్టుకుపోవటంతో అందులో ఉన్న ఫ్రిజ్, పాలు, ఇతర పాల ఉత్పత్తులు ధ్వంసమైయ్యాయి. రూ. 30వేలు విలువైన ఉత్పత్తులు ఉన్నాయని బాధితుడు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తంచేశాడు.



ధ్వంసమైన పాల బూత్

కుదేలైన రైతులు

జగ్గయ్యపేట రూరల్: ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురవటంతో మొక్కజొన్న, మామిడి, వరి రైతులు కుదేలయ్యారు. మండలంలోని అనుమంచిపల్లి, గండ్రాయి, మల్కాపురం, షేర్ మహ్మద్‌పేట, అన్నవరం, తక్కెళ్లపాడు గ్రామాల్లో రైతులు తీవ్ర నష్టాలను చవి చూశారు. ఇళ్ల పైకప్పులు లేచిపోగా మామిడి తోటలు కూకటి వేళ్లతో పడిపోయాయి. తోటలు కొన్న రైతులు లబోదిబోమంటున్నారు. వరి, మొక్కజొన్న రైతులు కోతలు కోసి పంటలు ఆరబెట్టారు. ఒక్కసారిగా వచ్చిన వర్షంతో తడిసి ముద్దయ్యాయి.

- త్రుటిలో తప్పిన ప్రమాదం

మల్కాపురంలో ఇంటి ఆవరణలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి దగ్ధమైంది. అప్పటి వరకు కుటుంబ సభ్యులంతా ఆరుబయట పడుకున్నామని, వాతావరణంలో మార్పులతో ఇంటిలోకి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డామని ఇంటి యజమాని సులేమియా తెలిపారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లి ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యులతో ఇళ్లలో ఉండగా ఆ ఇళ్లపై ఏర్పాటు చేసిన రేకులు గాలికి లేచిపోయి వీధిలో పడ్డాయి. రాత్రి కావటంతో ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది.





ఇండిజెనాస్ రాడార్స్, క్షిపణి ప్రయోగం ఊహాచిత్రాలు, వర్చువల్ శంకుస్థాపనను గుల్లలమోదలో తిలకిస్తున్న కల్నల్, ఆర్డీవో స్వాతి తదితరులు



రక్షణ రంగ ఆకాంక్షలు సాకారం

రూ.1500 కోట్ల అంచనాలతో నాగాయలంక నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ పనులు ప్రారంభం

అవనిగడ్డ, మే 2(ఆంధ్రజ్యోతి): గుల్లలమోదలో డీఆర్డీవో నిర్మించనున్న మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ దేశ రక్షణ రంగ ఆకాంక్షలను సాకారం చేసే ప్రాజెక్టు అవుతుందని దివి ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రూ.1500 కోట్ల అంచనాలతో ప్రధాని నరేంద్ర మోదీ మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ పనులను అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేంద్రానికి నాగాయలంక నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్‌గా నామకరణం చేస్తూ రక్షణ రంగానికి ఈ కేంద్రం దుర్గామాత నవశక్తినిచ్చే కేంద్రంగా అభివర్ణించారు.

ఏడాదిలోపే తొలి పరీక్ష?

గుల్లలమోదలో నిర్మిస్తున్న మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ నిర్మాణ పనులు ఆరేడు సంవత్సరాలపాటు జరుగుతాయని, ఇందుకోసం దాదాపుగా రూ.25 వేల కోట్లకుపైగా వెచ్చించనున్నారని సమాచారం. అయితే భారత రక్షణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాబోయే సంవత్సరం లోపే ఇక్కడి నుంచి క్షిపణి పరీక్షలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయబోతున్నారని తెలియవస్తోంది. ఇప్పటికిప్పుడు మిస్సైల్ టెస్టింగ్ నిర్వహణకు కావాల్సిన పర్మినెంట్ రాడార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయటం కష్టమే అయినప్పటికీ బెల్‌తో డీఆర్డీవో నిర్మించిన ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్‌ను ఉపయోగించి కూడా స్వల్ప శ్రేణి క్షిపణులను ప్రయోగించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేయనున్నారని తెలుస్తోంది.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం

నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమవనుంది. 5 వేల కిలోమీటర్లకు పైబడిన లక్ష్యాలను ఛేదించే మిస్సైల్‌ను ప్రయోగించేందుకు ఈ కేంద్రాన్ని వేదికగా చేసుకోవచ్చుని డీఆర్డీవో భావిస్తోంది. దీని కోసం అత్యాధునిక ఈవో(ఎలక్ట్రో ఆప్టికల్ సిస్టమ్)ను ఈ కేంద్రంలో వినియోగించనున్నట్లుగా తెలుస్తోంది.

ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్

ఇక్కడ అత్యాధునిక ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్ కూడా ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ పార్టనర్‌షిప్‌తో డీఆర్డీవో ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్‌ను వినియోగిస్తూ ఇంద్ర, అశ్విని, స్వాతి, షోర్డ్‌షిప్ వంటి ఆధునిక రాడర్లను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురాగా, వీటిని నాగాయలంకలో ఏర్పాటు చేయబోయే మిస్సైల్ టెస్టింగ్ రేంజ్‌లో పూర్తిస్థాయిలో ఉపయోగించనున్నట్లు సమాచారం. వీటి ద్వారా భూమికి సమీపం నుండి వెళ్లే మిస్సైల్‌లు, హెలికాప్టర్లను గుర్తించే వెసులుబాటు ఉంటుంది.

దీర్ఘశ్రేణి క్షిపణులను పరీక్షించే వెసులుబాటు

నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ ద్వారా దీర్ఘశ్రేణి క్షిపణులు సైతం పరీక్షించే వెసులుబాటు ఉంటుంది. ఇంతకాలం హైదరాబాద్‌లోని డీఆర్డీవో తయారు చేసే క్షిపణులను ఒడిశాలోని బాలసోర్ నుంచి పరీక్షిస్తుండగా, హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి బాలసోర్‌కు చేరుకునేందుకు ఎక్కువ సమయం పడుతుండటం, పరీక్ష చేయాల్సిన క్షిపణుల రక్షణకు కూడా ప్రమాదం పొంచి ఉండటంతో దీర్ఘశ్రేణి క్షిపణులను తరలించేందుకు డీఆర్డీవో ఇబ్బందులు పడుతూ వచ్చింది. నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ దూరం బాలసోర్‌కు వెళ్లే దూరం సగానికి సగం కంటే తక్కువగా ఉండటం, ఇక్కడకు దీర్ఘ శ్రేణి క్షిపణులను తరలించేందుకు కావాల్సిన మౌలిక వసతులు ఇప్పటికే దాదాపుగా కలిగి ఉండటంతో ఈ కేంద్రం నుంచి 5 వేల కిలోమీటర్లు, అంతకు మించి వెళ్లే క్షిపణులను పరీక్షించే అవకాశం ఉంది.



ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ప్రధాని నరేంద్రమోదీకి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృతజ్ఞతలు

అమరావతిలో సభా వేదిక మీదకు వచ్చే ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కలిశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మిస్సైల్ టెస్టింగ్‌రేంజ్ ఏర్పాటుపై మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుల్లలమోద వచ్చిన డీఆర్డీవో చైర్మన్ సమీర్ వి.కామత్

నాగాయలంక/అవనిగడ్డ: గుల్లలమోదలోని క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని ఉదయం 7 గంటలకు డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ సందర్శించి ప్రారంభ ఏర్పాట్లను ప్రాజెక్టు మేనేజర్ కల్నల్ సమీర్ శర్మతో చర్చించి అనంతరం అమరావతి వెళ్లారు. డీఆర్డీవో డైరెక్టర్ చోబేతోపాటు 20 మంది అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రాజెక్టు డైరెక్టర్ సమీర్ శర్మతో ఇక్కడి పనులను వేగవంతంగా చేయాలని ప్రత్యేకంగా టెస్ట్ రేంజ్ నిర్మాణ పనులపై దృష్టి పెట్టాలని సమీర్ వి.కామత్ సూచించినట్లు సమాచారం. వర్చువల్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు గ్రామానికి చెందిన 200 మందిని ప్రత్యేక అనుమతులతో ఆహ్వానించారు. ఆర్డీ వో కె.స్వాతి, జిల్లా అధికారి పి.సాయిబాబు, తహసీల్దార్ ఎం.హరనాథ్ హాజరయ్యారు.

కాంగ్రెస్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గాన్ని డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ శుక్రవారం ప్రకటించారు. పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ వివరాలను ఆయన వెల్లడించారు. 34 మందితో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గంలో అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా కోకా ఫణిభూషణ్, ఉపాధ్యక్షులుగా కిలారు వెంకటరత్నం, తాడిశెట్టి సాంబశివరావు, కొడాలి బసవమ్మ, బీమా శ్రీనివాసరావు, ఆది రా మ్మోహనరావు, గొల్లా వెంకటసుబ్బారావు, పి.సాగర్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా పదిమంది, కార్యదర్శులుగా పదిమంది, జాయింట్ సెక్రటరీలుగా ఆరుగురిని నియమించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాబ్జీ, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శొంఠి నాగరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, మచిలీపట్నం కాంగ్రెస్ కో ఆర్డినేటర్ అ బ్దుల్ మతీన్, ఎం.శామ్యూల్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో జీఎం తనిఖీలు

రైల్వేస్టేషన్, మే 2(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్, శివారు ప్రాంతాల రైల్వేస్టేషన్లను విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్‌తో కలిసి తనిఖీలు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లోని ఆరో నెంబరు ప్లాట్‌ఫాం నుంచి తనిఖీలను ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా అంశాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, మంచినీటి వనరుల పనితీరు పరిశీలించారు. క్రూ లాబీని తనిఖీ చేసి అక్కడ లోకో పైలట్లు, సిబ్బందితో సంభాషించారు. రోజువారీ కార్యకలాపాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను, అడ్డంకులను తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్లాట్‌ఫాం నెంబర్ 1లో కూడా ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తనిఖీ సమయంలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సంత్రాగచి-మంగళూరు ఎక్స్‌ప్రెస్(నెం22851) ఆన్‌బోర్డు హౌసింగ్ కీపింగ్ సర్వీసు శుభ్రత, రేక్ నిర్వహణను ఆయన పరిశీలించారు. వేసవిలో ప్రయాణికులకు నీరు, మజ్జిగ పంపిణీ చేయటానికి ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన సమ్మర్ కియోస్క్ పనితీరును పరిశీలించారు. తర్వాత గుణదల రైల్వేస్టేషన్‌లో రూ.24.37 కోట్ల వ్యయంతో నిర్వహిస్తున్న అమృత్‌భారత్ స్టేషన్ పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. 12 మీటర్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫాం ఉపరితలం మెరుగుదల, అదనపు కవర్ ఓవర్ ప్లాట్‌ఫాం, రెండు లిఫ్టుల ఏర్పాటు, వెయిటింగ్ హాల్, ముందు భాగంలోని భవనం, సర్క్యులేటింగ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు.



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న పురస్కారాలకు దరఖాస్తులు

గవర్నర్‌పేట, మే 2(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న జాతీయస్థాయి పురస్కారాలు-2025కు ఎంపిక చేసేందుకు వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తూ ప్రతిభ కనబరుస్తున్న వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్‌ఎస్ నారాయణ మాస్టారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటకరంగం, టీవీ, సినీ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు వారి సేవల గుర్తింపు సర్టిఫికెట్లు, పేపర్ కటింగ్, ఫొటోలు, జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జతచేసి ఈనెల 15వ తేదీ లోపు కార్యాలయానికి చేరేలా చూడాలని కోరారు. మే 25న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 96523 47207కు ఫోన్ చేయాలని సూచించారు.

దివ్య ఔషధం... పులిచింతాకు

చాంగేరి శాకమత్యుష్ణం కటురోచన పాచనమ్
కఫ వాతార్శః సంగ్రహణ్యతిసారజిత్

చాంగేరి (ఇండియన్ సారెల్)ని తెలుగులో పులిచింత మొక్కలని పిలుస్తారు. 'పులిచెడ్డ, పులిచెట్ట' అని కూడా అంటుంటారు. తెలుగు, తమిళ, కన్నడ ఉష్ణమండల ప్రాంతాల్లో విస్తారంగా పెరుగుతుంది. మూడాకుల పొత్తిగా ఉండే చిన్న పొద ఇది. మౌలికంగా ఇది ఔషధంగా పనికొచ్చే మొక్క. ఆహార పదార్థంగా వాడుకోవటమూ ఉంది.

పుల్లనిరుచి... జాఠరాగ్నివర్ధకం...

పుల్లని ఆకులే దీని ప్రత్యేకత. గోంగూర, చుక్కకూర, చింతచిగురుల్లాగే ఇవి కూడా పుల్లగా ఉంటాయి. ఎండించి దంచిన పొడిని ఆమ్‌చ్యూర్ లాగా వాడుకునేవారు. ఒకప్పుడు చింతపండు ఇప్పటిలాగా విపరీతంగా వాడేవారు కాదు. చింతపండువల్ల ఉప్పు, కారం కూడా అధికంగా కలపవలసి వస్తుంది. కాబట్టి చింతపండుని పరిమితంగా వాడేవారు. దానికి బదులుగా ఈ పులిచింత ఆకులు బాగా ఉపయోగపడేవి.

భోజన కుతూహలం



పులిచింతలో ఆక్జాలిక్ ఆమ్లం ఎక్కువ శాతంలో ఉంటుంది. అందుకని వేడి చేసే అవకాశం ఉంది. కాబట్టి, పరిమితంగా వాడుకోవాలి. గోంగూరని తిన్నట్టుగా తినకూడదు. పులుపు కోసం వంటకంలో మూడు నాలుగు ఆకులు వేసుకుంటే సరిపోతుంది. ఎక్కువగా తింటే మూత్రంలో వేడి పెరిగి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది.

ఇలాగూ తినవచ్చు...

ఆకుల్ని సన్నగా తరిగి మజ్జిగలో కలుపుకుని తాగితే అమీబియాసిస్ తగ్గుతుంది. నీళ్ల విరేచనాలు ఆగుతాయి. ఇరిటబుల్ బవుల్ సిండ్రోమ్‌తో బాధపడేవారికి ఉపయోగపడుతుంది. ఎండించి దంచిన పొడి అర చెంచా మోతాదులో, తేనెతో రంగరించి రోజూ తింటే కడుపులో నులిపురుగులు పోతాయి. ఈ ఆకులతో టీ కాచుకుని తాగితే జ్వరం తగ్గుతుంది.

- కొబ్బరి పచ్చడిలో పులిచింతాకులు నాలుగు కలిపి నూరితే కమ్మగా ఉంటుంది. చారు, సాంబారు, పులుసు, సూపుల్లో పులుపు కోసం ఈ ఆకుల రసాన్ని కలుపుకుంటే గుణవర్ధకంగా ఉంటుంది. కూరల్లో పప్పుల్లో పులుపు కోసం కొద్దిగా ఈ ఆకుల్ని వాడుకోవచ్చు.

వంటింటి ఔషధం...


చింతపండువల్ల శరీరంలో వాతం, కఫం పెరుగుతాయి. పులిచింత ఆకులు వాత కఫాల్ని నియంత్రిస్తాయి. వాపులు, నొప్పులు తగ్గుతాయి. జీర్ణకోశ వ్యాధుల్లో మేలు చేస్తుంది. విరేచనాలను తగ్గిస్తుంది. అమీబియాసిస్ లాంటి వ్యాధుల్లో ఔషధంగా పని చేస్తుంది. మలబద్ధకం వదిలించి, కాలవిరేచనం అయ్యేలా చేస్తుంది. కడుపులో నులిపురుగుల్ని వెళ్లగొడుతుంది. చింతపండుకు లేని ఈ ప్రయోజనాలు పులిచింతకి ఉన్నాయి కాబట్టి, ఇది వంటగదిలోకి చేరాల్సిన ఔషధం.

ఎన్నో ప్రయోజనాలు...

- ఈ ఆకులు జీర్ణశక్తికి తోడ్పడతాయి. ప్రసవించిన తరువాత బాలింతలకు గర్భాశయం పునరుద్ధరణ కోసం, వాతం తగ్గించటం కోసం ఈ ఆకులతో టీ కాచి ఇస్తే ఫలితం ఉంటుంది.
- సాత్మీకరణం అంటే సరిపడని పదార్థాల్ని తీసుకున్నప్పుడు కలిగే విష దోషాల్ని హరించే గుణం ఈ ఆకులకుంది. ఊపిరితిత్తుల సమస్యల మీద ఈ ఆకుల ప్రయోగం ఉంది. ముఖ్యంగా కఫాన్ని, జ్వరాన్ని, ఊపిరితిత్తుల్లో ఏర్పడే వాపుల్ని తగ్గిస్తుంది.
- జానపదుల వైద్యంలో పాము కాటు వేసిన గాయం మీద ఈ ఆకుల ముద్ద ఉంచి, కట్టు కడతారు. మొలల మీద ఈ ఆకు గుజ్జుని పట్టిస్తే బాధ తగ్గుంది. గాయల మీద లేపనంలా వేస్తే పుండు త్వరగా తగ్గుతుంది. రక్తస్రావం ఆగుతుంది.
- కడుపులో ఉబ్బరం, తిన్నది వంటబట్టకపోవటం, తరచూ విరేచనాలు, జిగురుతో కూడిన విరేచనాల్లాంటి సమస్యల మీద పని చేసేందుకు పులిచింతాకులతో తయారైన 'చాంగేరీ ఘృతం' అనే ఆయుర్వేద ఔషధం బాగా పని చేస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



మనం సొరకాయతో కూర, పచ్చడి, పప్పు, పులుసు లాంటి ఎన్నో వంటలు చేస్తూ ఉంటాం. ఇవి కాక సొరకాయతో రుచికరమైన అల్పాహారాలు కూడా చేసుకోవచ్చు. అలాంటి రుచులు మీ కోసం...



సొరకాయతో... కమ్మని అల్పాహారం

• ఊతప్పం

కావాల్సిన పదార్థాలు

- సొరకాయ తురుం- రెండు కప్పులు, కేరట్ తురుం- అర కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, సన్నగా తరిగిన పచ్చి మిర్చి ముక్కలు- రెండు చెంచాలు, ఉడికించిన ఆలుగడ్డలు- రెండు, బియ్యం- ఒక కప్పు, అల్లం ముక్కలు- ఒక చెంచా, మిరియాలు- ఒక చెంచా, పెరుగు- పావు కప్పు, బేకింగ్ పౌడర్ లేదా బేకింగ్ సోడా- అర చెంచా, ఉప్పు- తగినంత, నువ్వులు- ఒక చెంచా, ఇంగువ- పావు చెంచా, జీలకర్ర- అరచెంచా, ఆవాలు- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, నూనె- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- అర కప్పు

తయారీ విధానం

- ఒక గిన్నెలో బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడిగి నిండా నీళ్లు పోసి గంటసేపు నానబెట్టాలి.
- మరో గిన్నెలో సొరకాయ తురుం, కేరట్ తురుం, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలిపి పది నిమిషాలు నాననివ్వాలి. తరవాత ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతిలోకి తీసుకుంటూ మరో గిన్నెలోకి రసాన్ని గట్టిగా పిండాలి.
- మిక్సీలో ఉడికించిన ఆలుగడ్డల ముక్కలు, నాన బెట్టిన బియ్యం, అల్లం ముక్కలు, మిరియాలు, సొరకాయ వి...శ్రమం నుంచి పిండిన రసం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. పిండి గరిటె జారుగా ఉండాలి. అవసరమనిపిస్తే అర గ్లాసు నీళ్లు కలుపుకోవచ్చు. ఈ పిండిని వెడల్పాటి గిన్నెలోకి తీసుకుని బేకింగ్ సోడా లేదా బేకింగ్ పౌడర్ వేసి కలపాలి. అయిదు నిమిషాలు నాననివ్వాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, కరివేపాకు వేసి దోరగా వేపాలి. ఈ తాలింపును పిండిలో వేసి కలపాలి. తరవాత పిండిలో సొరకాయ-కేరట్ తురుముల మిశ్రమం, నువ్వులు, పెరుగు, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి వేడి చేసి ఒక చెంచా నూనె రాయాలి. ఒక గరిటెడు పిండిని పెనం మధ్యలో వేయాలి. చుట్టూరా కొద్దిగా నూనె చిలకరించి మూతపెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత మూత తీసి ఊతప్పాన్ని రెండోవైపునకు తిప్పాలి. రెండు నిమిషాల తరవాత పళ్లెంలోకి తీయాలి. ఈ ఊతప్పాన్ని పెరుగు చట్నీతో తింటే రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- లేత సొరకాయ తురుం తీసుకుంటే ఊతప్పం రుచిగా ఉంటుంది
- పిండిని పెనం మీద వేసిన తరవాత దాన్ని గరిటెతో పరచకూడదు.
- చిన్న మంట మీదనే ఊతప్పాన్ని రెండు వైపాలా ఉడకనివ్వాలి.



• గారెలు

కావాల్సిన పదార్థాలు

- పెసరపప్పు- రెండు కప్పులు, సొరకాయ తురుం- ఒక కప్పు, బియ్యప్పిండి- అర కప్పు, అల్లం తురుం- మూడు చెంచాలు, పుదీనా తరుగు- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, కరివేపాకు- ఒక రెమ్మ, పచ్చిమిర్చి- నాలుగు, జీలకర్ర- ఒక చెంచా, ఉల్లిపాయ- ఒకటి, ఉప్పు- తగినంత, నూనె- గారెలు వేగడానికి సరిపోయేంత

జాగ్రత్తలు

- సొరకాయలో నీరు ఉంటుంది కాబట్టి పిండి జారుగా కావచ్చు. అప్పుడు పిండిలో కొద్దిగా బొంబాయి రవ్వ కలిపితే గారెలు కరకరలాడుతూ వస్తాయి. నూనె పీల్చుకోవు.
- పిండిలో కొద్దిగా పాలకూర తరుగు కలిపితే గారెల రుచి పెరుగుతుంది.

తయారీ విధానం

- పెసరపప్పును ఒక గంటసేపు నీళ్లలో నానబెట్టాలి. సొరకాయ తురుమును చేత్తో తీసుకుని గిన్నెలోకి గట్టిగా రసాన్ని పిండాలి. మిక్సీలో నానబెట్టిన పెసరపప్పు, సొరకాయ రసం, పచ్చిమిర్చి ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పిండిని వెడల్పాటి గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో జీలకర్ర, కరివేపాకు తరుగు, పుదీనా తరుగు, కొత్తిమీర తరుగు, అల్లం తురుం, బియ్యప్పిండి, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. పిండి గట్టిగానే ఉండాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికి పైగా నూనె పోసి వేడి చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్ల మీద గారెలా చేసి మధ్యలో బొటనవేలితో రంధ్రం చేసి నూనెలోకి మెల్లగా జారవిడచాలి. ఇలా మొత్తం పిండితో గారెలు చేసి నూనెలో వేయించాలి. గారెలను రెండు వైపులా ఎర్రగా వేపి పళ్లెంలోకి తీయాలి. వీటిని వేడిగా తింటే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.
- ఈ పిండితో చిన్న పునుగులు, పకోడీలు, చెక్కలు కూడా చేసుకోవచ్చు. ఈ పిండిని మిక్సీలో వేసి, తగినన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేసి దానితో దోశలు వేసుకోవచ్చు.

• పరాఠా

కావాల్సిన పదార్థాలు

- సొరకాయ తురుం- రెండు కప్పులు, పచ్చి మిర్చి- నాలుగు, వెల్లుల్లి రెబ్బలు- ఏడు, చిన్న అల్లం ముక్కలు- రెండు, నువ్వులు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, జొన్న పిండి- ఒక కప్పు, బియ్యప్పిండి- అర కప్పు, గోధుమ పిండి- అర కప్పు, శనగపిండి- పావు కప్పు, నెయ్యి- తగినంత

జాగ్రత్తలు

- సొరకాయ పరాఠాని రెండు కప్పుల బియ్యప్పిండి లేదా జొన్న పిండి లేదా గోధుమ పిండితో కూడా తయారు చేసుకోవచ్చు. కానీ అన్నిరకాల పిండ్లు కలిపితేనే దాని రుచి అమోఘంగా ఉంటుంది.
- పరాఠాలు అదిమిన క్లాత్‌ను మధ్య మధ్యలో తడుపుతూ దానికి అంటిన పిండిని తొలగించాలి. లేని పక్షంలో పరాఠాలు క్లాత్‌కి అంటుకుపోతాయి.
- పరాఠాని మరీ సన్నగా లేదా మరీ లావుగా అదమకూడదు
- నెయ్యికి బదులు నూనె వాడుకోవచ్చు.

తయారీ విధానం

- మిక్సీలో పచ్చి మిర్చి ముక్కలు, అల్లం, వెల్లులి రెబ్బలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో సొరకాయ తురుం, పచ్చిమిర్చి-అల్లం పేస్టు, నువ్వులు, జీలకర్ర, కొత్తిమీర తరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత జొన్న పిండి, గోధుమ పిండి, బియ్యప్పిండి, శనగపిండి వేసి ముద్దలా కలపాలి. అవసరమనిపిస్తే ఒక చెంచా నీళ్లు చిలకరించి కలపాలి. ఈ ముద్ద మీద మూత పెట్టి పావు గంటసేపు నానబెట్టాలి.
- చేతి రుమాలు లేదా కాటన్ క్లాత్‌ను తడిపి నీళ్ల పిండి సిద్ధం చేసుకోవాలి. చేతిని నీళ్లతో తడుపుకుని కొద్దిగా పిండిని తీసుకుని గుండ్రని ముద్దలా చేసి తడి క్లాత్ మీద పెట్టి చేతితో పరాఠాలా అదమాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి వేడిచేయాలి. ఒక చెంచా నెయ్యి రాయాలి. వేడెక్కిన పెనం మీద పరాఠా వేసి పై నుంచి క్లాత్‌ని తీయాలి. మూతపెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత పరాఠా మీద ఒక చెంచా నెయ్యి రాసి రెండో వైపునకు తిప్పి రెండు నిమిషాలు ఉంచాలి. రెండు వైపులా ఎర్రగా కాలిన తరవాత పళ్లెంలోకి తీసుకోవాలి. ఈ పరాఠాని వేడిగా తిన్నా చల్లారాక తిన్నా రుచిగానే ఉంటుంది.



- సొరకాయలో ఎ, బి, సి విటమిన్లతోపాటు పొటాషియం, ఐరన్ లాంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇది పూర్తిగా నీటితో నిండి ఉంటుంది కాబట్టి వేసవిలో ఏర్పడే నిర్జలీకరణ సమస్యలను నివారిస్తుంది. సొరకాయను తరచూ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యంగా పనిచేస్తాయి. ఒత్తిడి, అలసట, నీరసం తగ్గుతాయి. దీనిలోని పీచు పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకాన్ని, ఊబకాయాన్ని నివారిస్తాయి. సొరకాయలోని పోషకాలు చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో చర్మం బిగుతుగా కాంతివంతంగా ఉంటుంది.

బ్యాంకు ఖాతా తెరిచే సందర్భంలో కనురెప్పలు ఆర్పలేక ఇబ్బందిపడిన ప్రజ్ఞ ప్రసూన్... తనలాంటి ముఖ వైకల్యం కలిగి ఉన్నవారికి కేవైసీ నిబంధనలను సవరించాలంటూ దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి... విజయం సాధించింది. యాసిడ్ బాధితురాలైన ఆమె... 'ఐ వోంట్ బ్లింక్' పేరుతో ఉద్యమాన్ని లేవనెత్తి... సుదీర్ఘ న్యాయ పోరాటం సాగించింది. ఆ పోరాటం వెనుక వ్యథాభరిత కథ ఇది.

న్యూస్ మేకర్



నిలదీసే 'ప్రజ్ఞ'

జూలై, 2023లో యాసిడ్ దాడి బాధితురాలైన ప్రజ్ఞ ప్రసూన్ ఖాతా తెరవడం కోసం ఐసిఐసిఐ బ్యాంకుకి వెళ్లింది. కానీ 'లైవ్ ఫొటోగ్రాఫ్' కోసం కనురెప్పలు ఆర్పలేని కారణంగా డిజిటల్ కెవైసి ప్రక్రియ పూర్తి చేయలేకపోవడంతో ఆమె బ్యాంకులో ఖాతా తెరవలేకపోయింది. ఈ చేదు అనుభవంతో మనస్తాపం చెందిన ప్రజ్ఞ, సామాజిక మాధ్యమాల్లో 'ఐ వోంట్ బ్లింక్' అనే పేరుతో, ఉద్యమాన్ని లేవనెత్తింది. ఆ తర్వాత బ్యాంకు ఉద్యోగి, ప్రజ్ఞను సంప్రతించి, డిజిటల్ కెవైసి నుంచి మినహాయింపు ఇచ్చి, బ్యాంకు ఖాతా తెరవడంలో సహాయపడ్డారు. కానీ ప్రజ్ఞ అంతటితో సరిపెట్టుకోలేకపోయింది. తనలాంటి ముఖ వైకల్యం కలిగిన ఇతరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సంబంధించి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయించుకుంది. బ్యాంకు ఖాతా మొదలు, సిమ్ కార్డు కొనుగోలు వరకూ వేర్వేరు సందర్భాల్లో డిజిటల్ కెవైసి పొందడం తప్పనిసరి. కళ్లకు సంబంధించిన సమస్యలున్నవారు, అగ్ని ప్రమాదాలు, యాసిడ్ దాడులతో ముఖ వైకల్యం వల్ల కనురెప్పలను ఆర్పలేని వారి పట్ల కెవైసి నిబంధనలను సవరించాలని కోరుతూ ప్రజ్ఞ వేసిన పిటిషన్‌కు సానుకూలంగా స్పందించిన సుప్రీమ్‌కోర్టు... డిజిటల్ కెవైసి ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. అనీ, అర్హులైన వారికి ఆ ప్రక్రియను సులభతరం చేయాలనీ, అన్ని ప్రభుత్వ పోర్టల్స్, లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్, ఆర్థిక సాంకేతిక సేవలన్నీ అందరికీ అందుబాటులో ఉంచాలనీ తాజాగా సంచలనాత్మక తీర్పునిచ్చింది.



ఎవరీ ప్రజ్ఞ..?

జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో పుట్టిన ప్రజ్ఞ ప్రసూన్ సింగ్, ఫ్యాషన్ డిజైనర్. ఏప్రిల్ 15, 2006న ప్రజ్ఞ పెళ్లైంది. అదే నెల 30న ఆమె ఢిల్లీలో ప్రాంగణ నియామకానికి హాజరు కావాల్సి ఉంది. దాంతో పెళ్లైన 15 రోజులకే, బనారస్ నుంచి ఢిల్లీ రైలు ప్రయాణానికి సిద్ధపడిందామె. అది రాత్రి ప్రయాణం. అర్ధరాత్రి దాటిన తర్వాత, గాఢ నిద్రలో ఉన్న ప్రజ్ఞ ముఖం మీద ఒక యువకుడు యాసిడ్‌ను కుమ్మరించాడు. అతనెవరో కాదు. గతంలో ప్రజ్ఞ పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిన యువకుడే! తన ప్రతిపాదనను తిరస్కరించడంతో పగ పెంచుకున్న సదరు యువకుడు, ప్రజ్ఞ మీద ఆ ఘాతుకానికి తెగబడ్డాడు. అలా ఊహించని పరిణామాన్ని ఎదుర్కొన్న ప్రజ్ఞ, తనకేం జరుగుతుందో అర్థం చేసుకునేలోపే జరగవలసిందంతా జరిగిపోయింది. తోటి ప్రయాణికుల సహాయంతో ఆస్పత్రికి చేరిన ఆమె ప్రాణాలు నిలిచినా, ముఖం గుర్తుపట్టలేనంతగా కాలిపోయింది. ఆ ప్రమాదంలో ఆమె ఒక కన్నును కోల్పోయింది. వైద్యులు శ్రమించి ఒక కంటిని కాపాడగలిగారు. రెండేళ్ల పాటు వరుస సర్జరీల తర్వాత ప్రజ్ఞ పూర్తిగా కోలుకుంది. యాసిడ్ దాడితో జీవితం ఎంతలా తలకిందులైపోతుందో స్వీయానుభవంతో తెలుసుకున్న ప్రజ్ఞ తనలా యాసిడ్ దాడికి గురైన వారికి తోడ్పాటును అందించాలని నిర్ణయించుకుంది. అలాంటి వారికి ఆర్థికంగా అండగా నిలవడం కోసం ఆమె 2013లో 'అతిజీవన్ ఫౌండేషన్'ను స్థాపించింది. యాసిడ్ దాడి బాధితులకు ఉచిత సర్జరీలు చేయడంతో పాటు, వృత్తి విద్యల్లో శిక్షణ అందించి, పునరావాసం కల్పించడం అతిజీవన్ స్వచ్ఛంద సంస్థ లక్ష్యం. ఇప్పటివరకూ ప్రజ్ఞ అతిజీవన్ ఫౌండేషన్ ద్వారా 250మంది యాసిడ్ బాధితులకు సహాయం అందించింది.

చికిత్స పొందుతున్న సమయంలో ఆస్పత్రిలో నాలాంటి వారిని కలిశాను. వారిలో కొందరికి ఎవరి తోడూ, ధైర్యం చెప్పేవాళ్లూ లేరనే విషయాన్ని గ్రహించాను. వారికి భరోసా కల్పించడం కోసం 'అతిజీవన్ ఫౌండేషన్'ను స్థాపించాను.

నారీ పురస్కారం

ప్రజ్ఞ, తన స్వీయానుభవం గురించి వివరిస్తూ... "చికిత్స పొందుతున్న సమయంలో ఆస్పత్రిలో నాలాంటి కొందర్ని కలిశాను. వారిలో కొందరికి ఎవరి తోడూ లేదనీ, దిశానిర్దేశం చేసేవాళ్లు, ధైర్యం చెప్పేవాళ్లూ లేరనే విషయాన్ని గ్రహించాను. వాళ్లతో మాట్లాడి వివరాలు తెలుసుకుని, వారికి భరోసా కల్పించడం కోసం అతి జీవన్ ఫౌండేషన్‌ను స్థాపించాను. ఈ సంస్థ ద్వారా యాసిడ్ దాడి బాధితులకు స్కిన్ గ్రాఫ్టింగ్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను అందించి, ముఖాకృతిని సరి చేసి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడం అతిజీవన్ లక్ష్యం. సాధికారత కల్పించడంవల్ల బాధితులందరూ స్వాభిమానంతో జీవించగలుగుతున్నారు. సమాజం, యాసిడ్ దాడికి గురైనవారిని బాధితులుగా పరిగణించకూడదు. వారిని ధీశాలులుగా భావించాలి" అంటూ చెప్పుకొచ్చింది ప్రజ్ఞ. ప్రజ్ఞ కృషికి ప్రభుత్వ గుర్తింపు దక్కింది. 2019లో భారత ప్రభుత్వం ఆమెను నారీ శక్తి పురస్కారంతో సత్కరించింది.

మేకప్

వేడుకల్లో వెలిగేలా...

పెళ్లిళ్ల సీజన్‌లోకి అడుగు పెట్టేశాం! మరి వేడుకల్లో వెలిగిపోవాలంటే అందుకోసం వేసుకునే మేకప్ కూడా వినూత్నంగా ఉండాలి. అదెలాగో తెలుసుకుందాం!

సన్‌స్క్రీన్ అవసరమే

మేకప్ ముందు మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లను తప్పనిసరిగా పూసుకోవాలి. వీటితో వేడుకల్లో లైట్ల వెలుగుకు చర్మం పాడవకుండా ఉంటుంది. మేకప్ కూడా ఎక్కువ సమయం పాటు తాజాగా ఉంటుంది.

రెండు ఫౌండేషన్లు

కెమెరా ఫ్లాష్ వెలుగుకు ముఖం విపరీతంగా (అతిమీరి) వెలిగిపోకుండా ఉండాలంటే, రెండు భిన్నమైన ఫౌండేషన్లు వేసుకోవాలి. ఇందుకోసం మ్యాట్, సాఫ్ట్ గ్లోయీ రకాలకు చెందిన ఫౌండేషన్లను కలిపి వేసుకోవాలి. జిడ్డు చర్మమైతే, నుదురు, ముక్కు, చుబుకం మీద మ్యాట్ ఫౌండేషన్, మిగతా ముఖమంతా డ్యూయీ ఫౌండేషన్ వేసుకోవాలి. తర్వాత లూజ్ పౌడర్ అద్దుకోవాలి.

బ్లష్ ముఖ్యం

పగటి వేళ వేడుకలకు హాజరయ్యేటప్పుడు ముదురు రంగు బ్లష్‌లకు బదులుగా... సహజసిద్ధంగా కనిపించే న్యాచురల్ లేదా రోజీ బ్లష్ ఎంచుకోవాలి. బుగ్గలతో పాటు, కొద్దిగా ముక్కు, చుబుకం మీద కూడా లైట్‌గా బ్లష్‌ను అద్దుకోవాలి.

ఐ షాడో ఇలా...

ముఖం మొత్తంలో కళ్లూ, పెదవులే ఫోకల్ పాయింట్లు. కాబట్టి వాటి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. పగలైనా, రాత్రైనా ముదురు రంగు షాడోలకు దూరంగా ఉండాలి. పేస్టెల్, సాఫ్ట్ మెటాలిక్ ఐ షాడోలు ఎంచుకోవాలి. ముడతలు పడకుండా ఉండేందుకు క్రీమీ షాడోలకు బదులు పౌడర్ ఐ షాడో ఎంచుకోవాలి. పౌడర్ ఐ షాడోలు మేకప్‌లో చక్కగా కలిసిపోయి, ఎక్కువసేపు ఉంటాయి.



లవ్లీ లిప్‌స్టిక్

ఎరుపు, ప్లమ్, మెరూన్ రంగు లిప్‌స్టిక్స్ వేడుకలకు బాగుంటాయి. అలాగే ఐ షాడోకు మ్యాచ్‌అయ్యే లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. గ్లిట్టర్, పేస్టెల్, మోనోటోన్ రంగు లిప్‌స్టిక్స్ పగటిపూట, మెటాలిక్, ముదురు రంగు షేడ్స్ రాత్రి వేడుకలకు మ్యాచ్ అవుతాయి.

ఇక అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లే..!



న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లో ఇకపై మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లే ఎక్కువగా దర్శనమివ్వనున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అధిక వాటా భారత్ నుంచి దిగుమతి చేసుకోనున్నట్లు యాపిల్ సీఈఓ టిమ్‌కుక్ వెల్లడించారు. అమెరికాలో విక్రయించే అధిక శాతం ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్‌ను వియత్నాం ప్లాంట్ల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇతర మార్కెట్లలో విక్రయించే ఐఫోన్లను మాత్రం చైనా నుంచి సమీకరించనున్నట్లు ఈ మార్చితో ముగిసిన రెండో త్రైమాసిక ఫలితాల విడుదల అనంతరం అనలిస్ట్ కాల్ కాన్ఫరెన్స్‌లో ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ సుంకాల అనిశ్చితి నేపథ్యంలో యాపిల్ ఈ నిర్ణయం తీసుకుంది. సుంకాలతో జూన్ క్వార్టర్‌లో 90 కోట్ల డాలర్ల (రూ.7,650 కోట్లు) మేర భారం పడవచ్చని కంపెనీ అంచనా వేసింది. యాపిల్ అక్టోబరు నుంచి తదుపరి సెప్టెంబరు వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ అధ్యయన నివేదిక ప్రకారం.. యాపిల్ గత ఏడాది అమెరికా మార్కెట్లో 7.59 కోట్ల ఐఫోన్లను విక్రయించింది. భారత్‌లో తయారవుతున్న యాపిల్ ఐఫోన్లలో అధిక శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. ఈ ఫిబ్రవరి 28తో ముగిసిన మూడు నెలల్లో మన ఐఫోన్ల ఎగుమతుల్లో అమెరికా వాటా 81.9 శాతంగా ఉంది. మార్చిలో ఇది 97.6 శాతానికి పెరిగింది.

అదానీ గ్రీన్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్

గౌతమ్ అదానీ బంధువు ప్రణవ్ అదానీ దోషి:సెబీ



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ సంస్థ.. అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లలో 2021 మే నెలలో జరిగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ దోషులెవరో సెబీ నిగ్గు తేల్చింది. ఈ మొత్తం తతంగంలో అదానీ గ్రూప్ ప్రధాన ప్రమోటర్ గౌతమ్ అదానీ దగ్గరి బంధువు ప్రణవ్ అదానీ ప్రధాన పాత్రదారి అని సెబీ దర్యాప్తులో తేలింది. అదానీ గ్రీన్ ఎనర్జీ.. ఎస్‌బీ ఎనర్జీ హోల్డింగ్స్ అనే సంస్థను 350 కోట్ల డాలర్లకు కొనబోతోందన్న కీలక విషయాన్ని ప్రణవ్ అదానీ తన బావ మరిది కునాల్ షాకు రెండు మూడు రోజుల ముందే చేరవేశాడు. దాంతో కునాల్ అతడి సోదరుడు నృపుల్.. అదానీ గ్రీన్‌ఎనర్జీ షేర్లలో ట్రేడింగ్ చేసి రూ.90 లక్షల మేర వెనకేశారని సెబీ దర్యాప్తు తేల్చింది. ప్రణవ్ అదానీ కాల్ రికార్డులు, కునాల్, నృపుల్ ట్రేడింగ్ ఆధారంగా సెబీ ఈ నిర్ణయానికి వచ్చింది. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ కుమారుడే ప్రణవ్.

సెటిల్‌మెంట్ కోసం యత్నాలు: ప్రణవ్ అదానీ అనేక అదానీ గ్రూప్ కంపెనీల బోర్డుల్లో సభ్యుడు కూడా. సెబీ దర్యాప్తులో దొరికిపోవడంతో ఇప్పుడు చడీచప్పుడు లేకుండా ఆ కేసు సెటిల్ చేసుకునేందుకు సెబీతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. సెబీ నిబంధనల ప్రకారం ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసుల్లో దోషులుగా తేలిన వ్యక్తులు తమ నేరాన్ని ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా సెబీ విధించే జరిమానా చెల్లించి ఆ కేసులను సెటిల్ చేసుకోవచ్చు. అయితే కునాల్ సోదరులు మాత్రం ఈ విషయంలో ఇంకా సెబీతో సెటిల్‌మెంట్‌కు ముందుకు రాలేదు. ప్రమోటర్ల మద్దతుతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరుగుతోందని ఎప్పటి నుంచో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎట్టకేలకు ఆ ఆరోపణల్లో ఒకటి నిజమని సెబీ తేల్చింది.

అపోలో డిఫెన్స్ చేతికి ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్

డీల్ విలువ రూ.107 కోట్లు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కార్పొరేట్ ప్రపంచంలో మరో టేకోవర్ చోటు చేసుకుంది. హిందుజా గ్రూప్ కంపెనీ ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్‌ను అపోలో మైక్రోసిస్టమ్స్ అనుబంధ సంస్థ అపోలో డిఫెన్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏడీఐపీఎల్) రూ.107 కోట్లకు కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి శుక్రవారం రెండు సంస్థల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అవసరమైన అన్ని అనుమతులు లభిస్తే రెండు మూడు నెలల్లో ఈ కొనుగోలు పూర్తవుతుందని అపోలో మైక్రోసిస్టమ్స్ తెలిపింది. ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్.. గనులు, వివిధ పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే పేలుడు పదార్థాల తయారీలో ఉంది. రక్షణ రంగానికి అవసరమైన పేలుడు, మందుగుండు సామాగ్రి తయారీలో ఉన్న అపోలో డిఫెన్స్‌కు ఈ కొనుగోలు ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు.

ఐటీ శాఖ నుంచి 'ఐటీఆర్-3'

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) శాఖ 2025-26 పన్ను మదింపు సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్) సంబంధించి ఐటీఆర్-3 ఫామ్‌ను విడుదల చేసింది. వ్యాపార లేదా వృత్తిపరమైన ఆదాయం ఉన్న వ్యక్తులు, అవిభక్త హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ఈ ఫామ్ ద్వారా తమ ఆదాయ, పెట్టుబడులు, ఖర్చులు, లాభాల వివరాలు వెల్లడించాలి. ఈసారి ఐటీఆర్-3 ద్వారా వెల్లడించాల్సిన ఆస్తుల విలువను ప్రస్తుత రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పెంచారు. దీంతో మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులపై పెద్ద భారం తగ్గింది. ఈ ఫామ్ ద్వారా రియల్ ఎస్టేట్‌లో మూలధన లాభాలు ఏమైనా ఉంటే అవి గత ఏడాది జూలై 23 తర్వాత వచ్చాయా? లేక అంతకు ముందే వచ్చాయా? అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. ఈ లాభాలపై ఇండెక్సేషన్ వద్దనుకుంటే 12.5 శాతం, కావాలనుకుంటే 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మీ ఫోన్ రిపేర్ సాధ్యమేనా..!

రిపేరబిలిటీ ఇండెక్స్ తీసుకురానున్న ప్రభుత్వం



న్యూఢిల్లీ: కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ త్వరలో కీలక నిర్ణయం తీసుకోబోతోంది. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లకు రిపేరబిలిటీ సూచీ (ఇండెక్స్)ని తప్పనిసరి చేయబోతోంది. దీని ప్రకారం వీటిని తయారు చేసి అమ్మే కంపెనీలు ఇక తప్పనిసరిగా రేటింగ్ రూపంలో వాటి రిపేరబిలిటీ ఇండెక్స్‌ను సూచించాలి. ఇది ప్రస్తుతం ఇంధన సామర్థ్యానికి సంబంధించి ఏసీలు, బల్బులు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లకు అమలు చేస్తున్న రేటింగ్స్ రూపంలో ఉంటుంది. తాము కొన్న స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు, ఇతర కీలక ఎలక్ట్రానిక్ పరికరాలకు సరైన రిపేర్ సదుపాయాలు లభించడం లేదని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కేంద్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకోబోతోంది. దీంతో వినియోగదారులు ఈ వస్తువులను కొనే ముందే ఈ ఇండెక్స్ ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకుంటారని భావిస్తున్నారు.

దీనికి సంబంధించి కేంద్ర వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి భారత్ ఖేరా నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇప్పటికే ఒక నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం త్వరలోనే రిపేరబిలిటీ ఇండెక్స్‌కు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేస్తుందని మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖరే చెప్పారు. ముందు స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లకు ఈ సూచీని అమలు చేసి తర్వాత ల్యాప్‌ట్యాప్‌లు, డెస్క్ టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికాలన్నిటికి విస్తరిస్తారని ఆమె తెలిపారు. ఆయా వస్తువులకు సంబంధించిన రిపేరబిలిటీ ఇండెక్స్‌ను ప్రతి కంపెనీ తన విక్రయ కేంద్రం, ప్యాకింగ్, వెబ్‌సైట్ల ద్వారా తెలియజేయాల్సి ఉంటుంది.

రేటింగ్ ఇలా

ఎలక్ట్రానిక్ పరికరాల్లోని కీలక విడిభాగాలైన డిస్‌ప్లే స్క్రీన్లు, బ్యాటరీలు, కెమెరా అసెంబ్లీలు, చార్జింగ్ పోర్టులు, స్పీకర్లను రిపేర్ చేయడానికి ఉన్న అవకాశం, అందుబాటులో ఉండే విడిభాగాలు, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ విధానాల ఆధారంగా ఈ రిపేరబిలిటీ ఇండెక్స్ రేటింగ్స్ ఉంటాయి. ఏదైనా ఒక సర్వీస్ సంతృప్తికరంగా ఉంటే ఐదు పాయింట్లు, మధ్యస్థంగా ఉంటే మూడు పాయింట్లు ఇస్తారని భారత్ ఖేరా తెలిపారు. అమెరికా, ఈయూ, ఫ్రాన్స్‌తో సహా అనేక దేశాలు ఇప్పటికే ఈ రిపేరబిలిటీ ఇండెక్స్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఈ విధానానికి సిద్ధమవుతోంది. దీంతో కంపెనీలు తమ ఉత్పత్తుల విషయంలో మరింత బాధ్యతాయుతంగా ఉంటాయని భావిస్తున్నారు.

ఇంట్రాడేలో 81,000 పైకి సెన్సెక్స్


చివరికి 260 పాయింట్ల లాభంతో 80,501 వద్ద ముగిసిన సూచీ

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం స్వల్పంగా లాభపడ్డాయి. ట్రేడింగ్ తొలి గంటలో సెన్సెక్స్ 935 పాయింట్లు ఎగబాకి 81,177.93 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలు, ఏప్రిల్ నెల జీఎస్‌టీ వసూళ్ల సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరడం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు ఇందుకు దోహదపడ్డాయి. అయితే, ఈక్విటీ మదుపరులు మళ్లీ లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ ప్రారంభ లాభాలను నిలుపుకోలేకపోయింది. చివరికి 259.75 పాయింట్ల వృద్ధితో 80,501.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ప్రారంభ ట్రేడింగ్‌లో ఒక శాతానికి పైగా పెరిగి 24,589 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, ఆఖరికి 12.50 పాయింట్ల స్వల్ప లాభంతో 24,346.70 వద్ద ముగిసింది.

అవాంటెల్ రూ.80 కోట్ల సమీకరణ: రైట్స్ ఇష్యూ ద్వారా రూ.80.90 కోట్లు సమీకరించనున్నట్లు హైదరాబాద్, వైజాగ్ కేంద్రాలుగా కార్యకలాపాలు సాగిస్తున్న అవాంటెల్ లిమిటెడ్ ప్రకటించింది. రక్షణ, సమాచార రంగాలకు సాంకేతిక పరిష్కారాలందించే ఈ కంపెనీ.. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను తెలుగు రాష్ట్రాల్లోని తన తయారీ యూనిట్లు, మౌలిక వసతుల విస్తరణ కోసం వినియోగించనుంది.

నిఫ్టీ వేవ్స్ ఇండెక్స్ ప్రారంభం: మీడియా, వినోదం, గేమింగ్ రంగానికి చెందిన 43 లిస్టెడ్ కంపెనీలతో కూడిన నిఫ్టీ వేవ్స్ ఇండెక్స్‌ను ప్రారంభిస్తున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) శుక్రవారం ప్రకటించింది. వేవ్స్ 2025 సదస్సులో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఈ సూచీని ప్రారంభించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)



3వ తేదీ		విజయవాడ	470
హైదరాబాద్	445	గోదావరి	450
వరంగల్	447	విశాఖపట్నం	450
చిత్తూరు	523	డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	132
వరంగల్	130	గుంటూరు	130
కరీంనగర్	130	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	102
కర్నూలు	130	నెల్లూరు	107
విశాఖపట్నం	131	అనంతపురం	107
గోదావరి	132		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,510 ▼	87,550 ▼	1,09,000 ▲
విజయవాడ	97,000 ▲	91,200 ▲	96,500 ▲
విశాఖపట్నం	96,710 ▲	87,550 ▼	1,09,000 ▲
రాజమండ్రి	95,510 ▼	87,550 ▼	96,500 ▼
ప్రొద్దుటూరు	95,600 ▼	87,950 ▼	97,100 ▲
ముంబై	93,954 ▼	86,062 ▼	94,125 ▲

10 నెలల గరిష్ఠానికి తయారీ రంగం

దేశీయ తయారీ రంగం వృద్ధి రేటు ఏప్రిల్‌లో 10 నెలల గరిష్ఠ స్థాయికి చేరింది. శక్తివంతమైన ఆర్డర్లతో హెచ్‌ఎస్‌బీసీ తయారీ రంగ సూచీ (పీఎంఐ) 58.2 పాయింట్లుగా నమోదైంది. మార్చిలో ఇది 58.1 పాయింట్లుంది. గత ఏడాది జూన్ తర్వాత నమోదైన వేగవంతమైన వృద్ధి ఇదే. విదేశాల నుంచి వచ్చిన కొత్త ఆర్డర్లు కూడా 14 సంవత్సరాల గరిష్ఠ స్థాయికి చేరాయని పేర్కొంటూ ఆఫ్రికా, ఆసియా, యూరప్, పశ్చిమాసియా, అమెరికా ఇందుకు అండగా నిలిచినట్టు తెలిపింది. వ్యాపారాల్లో సానుకూలతతో కంపెనీలు కొత్త సిబ్బందిని కూడా నియమించుకున్నట్లు పీఎంఐ వెల్లడించింది.

విక్రేతలకు రిఫరల్ ఫీజు ఎత్తివేత

అమెజాన్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చిన్న వ్యాపారులకు మరింత తోడ్పాటునందించేందుకు గాను రిఫరల్ ఫీజును ఎత్తివేసినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. రూ.300లోపు ఉన్న అన్ని ఉత్పత్తులకు ఇది వర్తిస్తుందని అమెజాన్ ఇండియా డైరెక్టర్ సేల్స్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. 135 ఉత్పత్తుల కేటగిరీలోని వాటికి ఈ జీరో రిఫరల్ ఫీజు అమలవుతుందన్నారు. దీని ద్వారా కొనుగోలుదారులకు మరింత తక్కువ ధరకే ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయన్నారు. అపారెల్స్ ఫ్యాషన్ జువెలరీ, కిరాణా సహా పలు ఉత్పత్తులు ఈ కేటగిరిలో ఉన్నాయని భట్నాగర్ తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి ఇది అమల్లోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో అమెజాన్ ద్వారా పలు ఉత్పత్తులు విక్రయిస్తున్న 50 వేలకు పైగా విక్రేతలకు ఇది ఎంతగానో లబ్ది చేకూరుస్తుందన్నారు. హైదరాబాద్ సహా సమీప నగరాల్లోని విక్రేతలు అమెజాన్ ప్లాట్‌ఫామ్ ద్వారా హోమ్ అండ్ కిచెన్, ఫర్నీచర్, స్పోర్ట్స్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని తెలిపారు.

భూషణ్ స్టీల్ టేకోవర్‌కు సుప్రీం బ్రేక్

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్‌ఎల్)ను టేకోవర్ చేసేందుకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సమర్పించిన రూ.19,700 కోట్ల ప్రణాళికను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ బిడ్ చెల్లదని, దివాలా స్మృతి చట్ట నియమావళికి వ్యతిరేకమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. అంతేకాదు, బీపీఎస్‌ఎల్ లిక్విడేషన్ (కంపెనీ ఆస్తులను వేలం వేసి విక్రయించడం)కు కోర్టు ఆదేశించింది.

15 నుంచి ఆడి కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా తన వాహనాల ధరలను పెంచనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. భారత్‌లో విక్రయిస్తున్న అన్ని మోడళ్ల ధరలను గరిష్ఠంగా 2 శాతం పెంచుతున్నట్లు పేర్కొంది. పెరిగిన ధరలు ఈ నెల 15 నుంచి అమల్లోకి వస్తాయని ఆడి తెలిపింది.

ఉత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారిణి సౌమ్య



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) వార్షిక అవార్డుల్లో నిజామాబాద్ అమ్మాయి గుగులోతు సౌమ్యకు ఉత్తమ క్రీడాకారిణి పురస్కారం లభించింది. ఈ ఘనత సాధించిన తొలి తెలంగాణ క్రీడాకారిణి సౌమ్యనే కావడం విశేషం. శుక్రవారం భువనేశ్వర్‌లో జరిగిన 2024 ఏఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో సౌమ్య ఈ పురస్కారాన్ని అందుకుంది. ఐడబ్ల్యూఎల్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టు తరఫున తొమ్మిది గోల్స్‌తో టాప్ స్ట్రయికర్‌గా నిలిచిన సౌమ్య.. గతేడాది జరిగిన అంతర్జాతీయ పోటీల్లో టీమిండియా విజయాల్లో కీలకపాత్ర పోషించినందుకుగాను ఈ అవార్డు వరించింది. పురుషుల విభాగంలో సుభాషిష్ బోస్ ఉత్తమ ప్లేయర్ అవార్డు అందుకున్నాడు.

షూటర్ ముఖేష్‌కు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు యువ షూటర్ నేలవల్లి ముఖేష్ పసిడి పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం భోపాల్‌లో జరిగిన ఈ పోటీల్లోని 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో ముఖేష్ 600కు గానూ 586 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. సమీర్ (హరియాణా) రజతం, సాహిల్ చౌధురి (మధ్యప్రదేశ్) కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు చోటు లేదు

ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నిర్ణయం

లండన్: మహిళలు, బాలికల క్రికెట్ నుంచి ట్రాన్స్‌జెండర్లను పూర్తిగా నిషేధించనున్నట్టు..ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) శుక్రవారం వెల్లడించింది. గత నెలలో యూకే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కాగా..మహిళల ఫుట్‌బాల్‌లో ట్రాన్స్‌జెండర్లు ఆడడాన్ని నిషేధిస్తూ ఇంగ్లండ్, స్కాట్లాండ్ ఫుట్‌బాల్ సంఘం నిర్ణయం తీసుకున్న 24 గంటలలోనే ఈసీబీ కూడా అదే బాటలో పయనించడం గమనార్హం.

శ్రీశాంత్‌పై మూడేళ్ల సస్పెన్షన్

కేరళ క్రికెట్ సంఘం నిర్ణయం



తిరువనంతపురం: చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొన్న భారత జట్టునుంచి సంజూ శాంసన్‌ను తొలగించడానికి సంబంధించి నిరాధార ఆరోపణలు చేసిన మాజీ పేసర్ శ్రీశాంత్‌పై కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) కొరడా ఝుళిపించింది. అతడిని మూడు సంవత్సరాలు సస్పెండ్ చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. ఈమేరకు గతనెల 30న కొచ్చిలో జరిగిన కేసీఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కేరళ క్రికెట్ లీగ్‌లో కొల్లం ఏరీస్‌కు శ్రీశాంత్ సహ యజమానిగా ఉన్నాడు.

వివాదం ఏమిటంటే..: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీకి కేరళ జట్టులో సంజూని కేసీఏ ఎంపిక చేయలేదని..దరిమిలా అతడు చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడని ఓ మలయాళ టీవీ చానెల్ చర్చలో శ్రీశాంత్ ఆరోపించాడు. దాంతో శ్రీశాంత్‌కు కేసీఏ నోటీసు జారీ చేసింది. అయితే శాంసన్‌కు మద్దతు ఇచ్చినందుకు కాకుండా కేసీఏ పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యానించినందునే శ్రీశాంత్‌కు నోటీసు ఇచ్చినట్టు సంఘం పేర్కొంది. అలాగే సంజూ ఎంపికకు సంబంధించి అసోసియేషన్‌పై నిరాధార ఆరోపణలు చేసిన అతడి తండ్రి విశ్వనాథ్‌తోపాటు మరో ఇద్దరిపై నష్టపరిహారం కోసం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు కూడా కేసీఏ తెలిపింది.

రైజర్స్ కథ ముగిసినట్టే..

- ఏడో ఓటమితో ప్లేఆఫ్స్ సంక్లిష్టం
- 38 రన్స్ తేడాతో గుజరాత్ విజయం
- గిల్, బట్లర్ హాఫ్‌సెంచరీలు ● పోరాడిన అభిషేక్



గిల్ (76)

1 టీ20ల్లో వేగంగా (54 ఇన్నింగ్స్) 2 వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారత బ్యాటర్‌గా సుదర్శన్. ఓవరాల్‌గా మార్ష్ (53) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.

3 ఐపీఎల్‌లో తక్కువ బంతుల్లోనే (2677) 4 వేల రన్స్ పూర్తి చేసిన మూడో బ్యాటర్‌గా బట్లర్. గేల్ (2653), డివిల్లీర్స్ (2658) ముందున్నారు.

అహ్మదాబాద్: ప్లేఆఫ్స్ బెర్త్‌పై ఆశలను పెట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గట్టి ఝలక్ తగిలింది. మిగిలిన ఐదు మ్యాచ్‌లను కచ్చితంగా గెలవాల్సిన వేళ.. శుక్రవారం గుజరాత్ టైటాన్స్ చేతిలో 38 పరుగుల తేడాతో చిత్తయ్యింది. దీంతో ఏడు ఓటముల కారణంగా ఆరు పాయింట్లతో ఉన్న కమిన్స్ సేన సాంకేతికంగా రేసులో ఉన్నా.. నాకౌట్ చేరడం దాదాపు అసాధ్యమే. అటు సొంతగడ్డపై ఆల్‌రౌండ్‌షో కనబర్చిన గిల్ బృందం 14 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 224 పరుగులు చేసింది. గిల్ (38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 76), బట్లర్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 64), సుదర్శన్ (23 బంతుల్లో 9 ఫోర్లతో 48) రాణించారు. ఉనాద్కట్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులు చేసి ఓడింది. అభిషేక్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 74), క్లాసెన్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. ప్రసిద్ధ్, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రసిద్ధ్ నిలిచాడు.

అభిషేక్ ఒక్కడే..: భారీ ఛేదనలో రైజర్స్ స్థాయికి తగ్గట్టుగా ఆడలేకపోయింది. ఓపెనర్ అభిషేక్ మినహా మరే బ్యాటర్ ఆకట్టుకోలేదు. పేసర్ ప్రసిద్ధ్ షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బందిపెట్టగా, స్పిన్నర్ రషీద్ మాత్రం ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. అభిషేక్ మెరుపులకు తొలి నాలుగు ఓవర్లలో జట్టు 45 పరుగులతో మెరుగ్గానే కనిపించింది. కానీ ఆ తర్వాత టైటాన్స్ బౌలర్లు కట్టడి చేయడంతో పవర్‌ప్లేలో 57 పరుగులకే పరిమితమైంది. అటు మరో ఓపెనర్ హెడ్ (20) ఐదో ఓవర్‌లో రషీద్ అద్భుత క్యాచ్‌తో వెనుదిరిగాడు. కాసేపటికే ఇషాన్ (13)ను పేసర్ కొట్జీ అవుట్ చేయగా మధ్య ఓవర్లలో రైజర్స్ మరింతగా ఇబ్బందిపడింది. అభిషేక్‌కు జతగా క్లాసెన్ క్రీజులో ఉన్నా పరుగులు రావడం కష్టమైంది. అభిషేక్ 28 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అటు చేయాల్సిన రన్‌రేట్ పెరుగుతుండడంతో భారీ షాట్‌కు వెళ్లిన అభిషేక్.. సిరాజ్ సూపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. ఆ వెంటనే క్లాసెన్‌ను ప్రసిద్ధ్ అవుట్ చేయడంతో రైజర్స్ ఆశలు వదులుకుంది. దీనికి తోడు 17వ ఓవర్‌లో అనికేత్ (3), కమిందు (0)లను సిరాజ్ వరుస బంతుల్లో వెనక్కిపంపాడు. ఆఖర్లో నితీశ్ (21 నాటౌట్), కమిన్స్ (19 నాటౌట్) మెరుపులు ఓటమి అంతరాన్ని తగ్గించాయి.

చెలరేగిన టాపార్డర్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు ఎప్పటిలాగే టాపార్డర్ నుంచి సహకారం లభించింది. ఓపెనర్ గిల్ సిక్సర్‌తో తొలి ఓవర్‌లోనే 11 పరుగులు సాధించిన టైటాన్స్.. మూడో ఓవర్‌లో సుదర్శన్ ఐదు ఫోర్లతో 20 పరుగులు అందుకుంది. అనంతరం గిల్ 4,4,6తో కమిన్స్ 17 రన్స్ సమర్పించుకున్నాడు. హర్షల్ ఓవర్‌లోనూ సుదర్శన్ నాలుగు ఫోర్లతో 18 రన్స్ రాబట్టాడు. దీంతో గుజరాత్ జట్టు పవర్‌ప్లేలో 82 పరుగులతో తమ అత్యధిక స్కోరును పూర్తి చేసింది. అనంతరం జోరు మీదున్న సుదర్శన్‌ను స్పిన్నర్ జీషన్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు గిల్ మాత్రం షమి ఓవర్‌లో 4,4తో 25 బంతుల్లోనే హ్యాట్రిక్ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. అయితే 13వ ఓవర్‌లో తను రనౌట్ కావడంతో రెండో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 17వ ఓవర్‌లో 6,4తో బట్లర్ 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. తర్వాతి ఓవర్‌లోనే స్కోరు 200 దాటినా, ఆఖరి రెండు ఓవర్లలో టైటాన్స్ తడబడి బట్లర్, సుందర్, తెవాటియా (6), రషీద్ (0)ల వికెట్లను కోల్పోయింది. అయినా ఈ 12 బంతుల్లో 21 పరుగులతో ఫర్వాలేదనిపించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	10	2	8	0	4	-1.211

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — వేదిక: బెంగళూరు

చెన్నై x బెంగళూరు — రా.7.30 నుంచి

స్కోరుబోర్డు

గుజరాత్: సుదర్శన్ (సి) క్లాసెన్ (బి) జీషన్ 48; గిల్ (రనౌట్) 76; బట్లర్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 64; సుందర్ (సి) నితీశ్ (బి) ఉనాద్కట్ 21; షారుక్ (నాటౌట్) 6; తెవాటియా (సి) అనికేత్ (బి) ఉనాద్కట్ 6; రషీద్ (సి అండ్ బి) ఉనాద్కట్ 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 224/6. వికెట్ల పతనం:** 1-87, 2-149, 3-206, 4-218, 5-224, 6-224; **బౌలింగ్:** షమి 3-0-48-0; ఉనాద్కట్ 4-0-35-3; కమిన్స్ 4-0-40-1; హర్షల్ 3-0-41-0; జీషన్ 4-0-42-1; కమిందు 2-0-18-0.

హైదరాబాద్: హెడ్ (సి) రషీద్ (బి) ప్రసిద్ధ్ 20, అభిషేక్ (సి) సిరాజ్ (బి) ఇషాంత్ 74, ఇషాన్ (సి) ప్రసిద్ధ్ (బి) కొట్జీ 13, క్లాసెన్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 23, అనికేత్ (సి) షారుఖ్ (బి) సిరాజ్ 3, నితీష్ కుమార్ (నాటౌట్) 21, మెండిస్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 0, కమిన్స్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు 13, మొత్తం: 20 ఓవర్లలో 186/6; వికెట్లపతనం:** 1-49, 2-82, 3-139, 4-141, 5-145, 6-145, **బౌలింగ్:** సిరాజ్ 4-0-33-2, ఇషాంత్ శర్మ 3.2-0-35-1, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-19-2, కొట్జీ 4-0-36-1, సుందర్ 1-0-6-0, రషీద్ 3-0-50-0, సాయి కిషోర్ 0.4-0-1-0.

గిల్ అవుటా? నాటౌటా?

గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రనౌట్ వివాదాస్పదంగా మారింది. 13వ ఓవర్‌లో బట్లర్ షార్ట్ ఫైన్ లెగ్ వైపు ఆడి సింగిల్‌కు వెళ్లాడు. అయితే గిల్ నాన్‌స్ట్రయిక్ ఎండ్ నుంచి క్రీజులోకి వచ్చే లోపే హర్షల్ త్రోతో కీపర్ క్లాసెన్ వికెట్లను గిరాటేశాడు. కానీ రీప్లేలో మాత్రం వికెట్లను బంతితో కాకుండా గ్లోవ్స్‌తో పడగొట్టినట్టు అనిపించింది. చాలా సార్లు పరిశీలించాక చివరికి థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. దీంతో అసంతృప్తిగా మైదానం వీడిన గిల్ డగౌట్ దగ్గర 'సరిగ్గా చూడడం రాదా' అన్నట్టుగా తన కళ్లను చూపెడుతూ టీవీ అంపైర్‌తో వాదనకు దిగడం కనిపించింది.

బౌలింగ్‌లో బ్రాడ్‌మన్

బుమ్రాపై గిల్లీ ప్రశంస



న్యూఢిల్లీ: భారత స్టార్ పేసర్ బుమ్రాను బౌలింగ్‌లో బ్రాడ్‌మన్‌గా అభివర్ణించవచ్చని ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ గిల్‌క్రిస్ట్ కొనియాడాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్‌గా సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్‌ను క్రీడా పండితులు పేర్కొంటారు. గాయం నుంచి కోలుకున్న బుమ్రా రాకతో ముంబై ఇండియన్స్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. రాజస్థాన్‌పై తన చివరి మూడు ఓవర్లలో తను కేవలం ఐదు పరుగులే ఇచ్చాడు. 'బుమ్రాను ఏ ఫార్మాట్‌లోనైనా ఉత్తమ బౌలర్‌గా చెప్పవచ్చు. పిచ్ ఎలాంటిదైనా మైదానంలో అతడి ప్రదర్శన చూస్తే బ్రాడ్‌మన్ గుర్తుకురాకమానడు. అందుకే అతడిని బౌలింగ్‌లో బ్రాడ్‌మన్‌గా చెప్పవచ్చు' అని గిల్లీ అన్నాడు.

ఆసియా జిమ్నాస్టిక్స్‌కు నిషిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ ఆల్‌రౌండ్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి నిషిక అగర్వాల్ రజతంతో మెరిసింది. ఈ పతకంతో ఆసియా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌కు కూడా నిషిక అర్హత సాధించింది. శుక్రవారం పుణెలో జరిగిన ఈ పోటీల్లో నిషిక 43.750 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆసియా చాంపియన్‌షిప్ వచ్చే నెల 12 నుంచి 15వ తేదీ మధ్య కొరియాలో జరగనుంది.

శ్రీలంక విజయం

కొలంబో: మహిళల ముక్కోణపు టోర్నీలో ఆతిథ్య శ్రీలంకకు తొలి విజయం దక్కింది. శుక్రవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో లంక 5 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 235 పరుగులు చేసింది. డెరెక్సెన్ (61), లారా గూడాల్ (46) రాణించారు. మల్కి మడారాకు నాలుగు, విహంగకు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో లంక జట్టు 46.3 ఓవర్లలో 237/5 స్కోరుతో నెగ్గింది. హర్షిత (77), కవిష (61) అర్ధసెంచరీలు సాధించారు.

సురేశ్ ప్రొడక్షన్స్‌కు సుప్రీంలో చుక్కెదురు

- ఏపీ ప్రభుత్వ షోకాజ్ నోటీసుపై జోక్యానికి నో
- మధ్యంతర ఉపశమనమూ ఇవ్వలేమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 2(ఆంధ్రజ్యోతి): విశాఖలోని రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంపై సురేశ్ ప్రొడక్షన్స్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఏపీ ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసుపై కలుగజేసుకోవాలని కోరుతూ సురేశ్ ప్రొడక్షన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. మధ్యంతర ఉపశమనం కల్పించడమూ కుదరదని స్పష్టం చేసింది. సినీ పరిశ్రమను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఉమ్మడి ఏపీలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2003 సెప్టెంబరులో విశాఖపట్నం బీచ్ రోడ్డులో రామానాయుడు స్టూడియోకు 34.44 ఎకరాలు కేటాయించింది. నాటి మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.5.20 లక్షలు చొప్పున సురేశ్ ప్రొడక్షన్స్ చెల్లించింది. 2010 జనవరి 5న ఓ ప్రైవేట్ లిమిటెడ్‌కు కన్వేయెన్స్ డీడ్ ఇచ్చి, హక్కు కల్పించింది. ఆ భూముల్లో సుమారు 10 ఎకరాల్లో స్టూడియో నిర్మాణాలు జరగ్గా మిగిలిన భూమి ఖాళీగానే ఉంది. అయితే, వైసీపీ హయాంలో 2021 సెప్టెంబరులో స్టూడియో నిర్మాణానికి కేటాయించిన భూమిలో 15.17 ఎకరాల్లో లేఅవుట్‌కు అనుమతి కోసం జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. 2023 ఏప్రిల్‌లో ఇందుకు అనుమతి లభించింది. స్టూడియో భూముల సమీపంలో బావికొండ బౌద్ధ ప్రాంతం ఉందని, లేఅవుట్ల పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గతేడాది జనవరి 3న సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఫిబ్రవరి 9న స్టే ఇచ్చింది. ఈ క్రమంలోనే 15.17 ఎకరాలు ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలియజేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం షోకాజ్ జారీ చేసింది. ఈ నోటీసును సురేశ్ ప్రొడక్షన్స్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్లు శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. సురేశ్ ప్రొడక్షన్స్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. "అన్ని అనుమతులూ తీసుకునే అక్కడ పనులు చేపట్టాం. ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదు. ప్రభుత్వమే అనుమతులు ఇచ్చి, మళ్లీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది." అని తెలిపారు. షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చారా? అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ప్రశ్నించారు. తాము షోకాజ్ నోటీసులను సవాల్ చేస్తున్నామని సింఘ్వీ బదులిచ్చారు. అయితే.. షోకాజ్ నోటీసుపై కలగజేసుకోవడానికి ధర్మాసనం నిరాకరించింది. నోటీసు ఎక్కడ జారీ అయ్యిందో, అక్కడే తేల్చుకోవాలని సూచించింది. మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరగా, అందుకు కూడా సుప్రీంకోర్టు అంగీకరించలేదు. షోకాజ్ నోటీసుపై సంబంధిత కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలో తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని సురేశ్ ప్రొడక్షన్స్ కోరగా, అందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

అవన్నీ నాకెలా తెలుస్తాయి!

- మాకెన్నో లావాదేవీలు.. అవన్నీ ఆడిటర్లు చూసుకుంటారు
- మద్యం స్కాంతో సంబంధం లేదు... 'సిట్' కస్టడీలో రాజ్ కసిరెడ్డి

అమరావతి/విజయవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి దర్యాప్తు అధికారులకు సహకరించడం లేదని తెలిసింది. లిక్కర్ పాలసీ రూపకల్పన మొదలుకొని ఏది ఎలా చేయాలనే దానిపై ఏడంచెల వ్యవస్థ రూపొందించుకుని అమలు చేసిన ఆయన.. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కస్టడీలో నోరు విప్పడం లేదు. ఏదడిగినా దాటవేయడం.. లేదంటే అడ్డగోలు సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. కుంభకోణంతో తనకు సంబంధం లేదని వాదించారు. సిట్ అధికారులు పలు ఆధారాలు ఆయన ముందుంచడంతో.. 'వ్యాపారాలు చేసుకునే మాకు ఎన్నో లావాదేవీలు ఉంటాయి.. అవన్నీ మా ఆడిటర్లు చూసుకుంటారు.. నాకెలా తెలుస్తాయి' అని అడ్డగోలు వాదనకు దిగినట్లు తెలిసింది. కోర్టు ఆయన్ను ఏడు రోజులు కస్టడీకి ఇవ్వగా మొదటి రోజు ఏ మాత్రం సహకరించలేదని సిట్ అధికారులు సీఐడీ పెద్దలకు సమాచారం ఇచ్చారు. దీంతో రెండో రోజు ఎలా విచారించాలో వారు కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. ఇదే కేసులో మరో నిందితుడైన చైతన్యను శనివారం కస్టడీకి తీసుకుని అవసరమైతే కసిరెడ్డితో కలిపి.. లేదంటే వేర్వేరుగా విచారించే అవకాశముంది. అంతకుముందు శుక్రవారం ఉదయం సిట్ అధికారులు కసిరెడ్డిని కస్టడీలోకి తీసుకున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. సాయంత్రం ఆరు గంటల వరకు విచారించిన అనంతరం మళ్లీ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి జైలులో అప్పగించారు.

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో..

వంశీ బెయిల్ పిటిషన్ కొట్టివేత

- ఆయన పాత్రపై ఆధారాలున్నాయి: హైకోర్టు
- బెయిలిస్తే ఫిర్యాదుదారును బెదిరించవచ్చు
- సాక్షులను ప్రభావితం చేయొచ్చు
- ప్రాసిక్యూషన్ ఆందోళన సమర్థనీయమే
- తీర్పులో న్యాయమూర్తి స్పష్టీకరణ
- ఇతర నిందితులకు బెయిల్ మంజూరు

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టు షాక్ ఇచ్చింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై మూక దాడి, కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కులం పేరుతో దూషించారనే ఆరోపణలతో నమోదైన కేసులో ఆయన వేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం తీర్పు వెలువరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణా జిల్లా గన్నవరం టీడీపీ కార్యాలయంపై వల్లభనేని వంశీ అనుచరులు మూక దాడి చేసి వాహనాలను తగులబెట్టడమే గాక.. పలువురిపై దాడి చేసి గాయపరిచారు. పార్టీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సత్యవర్ధన్‌ను కులం పేరుతో దూషించారు. ఈ వ్యవహారంపై సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పలువురిని నిందితులుగా చేరుస్తూ 2023 ఫిబ్రవరి 22న గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వంశీకి బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుది విచారణ జరిపిన న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ శుక్రవారం నిర్ణయాన్ని వెల్లడించారు. 'కోర్టు ముందు ఉన్న వివరాలను పరిశీలిస్తే వంశీ అనుచరులు ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను బెదిరించి, బలవంతంగా కోర్టుకు తీసుకెళ్లి కేసును ఉపసంహరించుకునేలా వాంగ్మూలం ఇప్పించినట్లు అర్థమవుతోంది. ఘటనలో వంశీ పాత్రపై ఆరోపణలకు మద్దతుగా ప్రాథమిక సాక్ష్యాలను దర్యాప్తు సంస్థ సేకరించింది. కేసును ఉపసంహరించుకోవాలని ఫిర్యాదుదారును బలవంతం చేయడంలో వంశీ ప్రమేయం లేకుండా ఉన్నట్లయితే.. కేసులో ఇతర నిందితులతో సమానంగా ఆయన బెయిల్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకునేవాళ్లం. కానీ ప్రాసిక్యూషన్ కోర్టుకు సమర్పించిన



వాంగ్మూలాలను పరిశీలిస్తే ఘటనలో పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. కేసు దర్యాప్తు ప్రస్తుతం కీలక దశలో ఉంది. చార్జిషీటు దాఖలు చేయబోతున్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడొచ్చు. ఫిర్యాదుదారును బెదిరించడం వంటి ఘటనలుపునరావృతం చేయొచ్చు. పిటిషనర్‌ను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాలను తారుమారు చేయడం వంటివి చేయవచ్చన్న ప్రాసిక్యూషన్ తరఫు సీనియర్ న్యాయవాది ఆందోళన సమర్థనీయమే' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకుంటే బెయిల్ కోసం సెషన్స్ కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేశారు. కాగా.. ఇదే కేసులో నిందితులుగా ఉన్న కైలా ఆదిలక్ష్మి, కైలా శివకుమార్, నీలం ప్రవీణ్‌కుమార్, రాచేటి రూతమ్మ, మహ్మద్ మౌలానా అబ్దుల్ కలామ్, షేక్ సర్దార్ జానీకి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

ఈ దశలో రక్షణ కల్పించలేం

- మద్యం స్కాం కేసులో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అప్పటి సీఎం జగన్ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించింది. వివరాలు సమర్పించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరుతున్న నేపథ్యంలో ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమని స్పష్టం చేసింది. విచారణను 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, చాణక్యల రిమాండ్ రిపోర్టులో తమ పాత్ర గురించి ప్రస్తావించారని.. అందుచేత అరెస్టు చేస్తారని ఆందోళన ఉందని, తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప హైకోర్టును ఆశ్రయించారు. ఆ వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు రాగా.. సీఐడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. వ్యాజ్యాలు మొదటిసారి విచారణకు వచ్చాయన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ధనుంజయరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ స్పందిస్తూ.. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఈ రోజే ఉత్తర్వులిచ్చి తీరాలన్నారు. ఇరుపక్షాల వాదనలు నమోదు చేసిన న్యాయమూర్తి.. కేసు వివరాలు సమర్పించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరుతున్నందున ఈ దశలో రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమని తేల్చిచెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అయితే వికాస్‌సింగ్ జోక్యం చేసుకుని.. తదుపరి విచారణలోపు అరెస్టు చేస్తే తమ వ్యాజ్యాలు నిరర్థకమవుతాయన్నారు. విచారణకు రావాలని తమకు నోటీసులు ఇచ్చి.. తాము హాజరుకాకుంటే ఆ కారణంతో బెయిల్ ఇవ్వొద్దని ప్రాసిక్యూషన్ కోరే ప్రమాదం ఉందని.. అందుచేత అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. విచారణను ఇప్పటికే వాయిదా వేశామన్నారు. కోర్టు విచారణ ప్రక్రియకు ఆటంకం కలిగించవద్దని సీనియర్ న్యాయవాదికి స్పష్టం చేశారు.

నాకు నోటీసిచ్చే అధికారం ఏపీసీఐడీకి లేదు

- నేను హైదరాబాద్‌లో ఉంటున్నా.. సుప్రీంలో కసిరెడ్డి పిటిషన్
- ఏపీ ప్రభుత్వానికి నోటీసులు

న్యూఢిల్లీ, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(రాజ్ కసిరెడ్డి) వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మద్యం కుంభకోణం కేసులో ఏపీ సీఐడీ సీఆర్పీసీ 160 ప్రకారం తనకు నోటీసులు జారీ చేసిందని, హైదరాబాద్‌లో ఉంటున్న తనకు నోటీసులు జారీ చేసే అధికారం ఏపీ సీఐడీకి లేదంటూ గత నెల 10న రాజ్ కసిరెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట ఆ పిటిషన్ విచారణకు వచ్చింది. రాజ్ కసిరెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెలంగాణలో నివసిస్తున్న రాజ్ కసిరెడ్డికి తమ పరిధిని దాటి ఏపీ సీఐడీ పోలీసులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. తప్పనిసరిగా విచారణకు హాజరు కావాల్సిందేననే అధికారం ఏపీ సీఐడీకి లేదని చెప్పారు. మరో రాష్ట్రంలో ఉన్న వ్యక్తికి నోటీసులు ఇచ్చే అధికారం సీఐడీకి ఉంటుందా? అని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాదిని జస్టిస్ జేబీ పార్దివాలా ప్రశ్నించారు. ఏపీ పరిధిలోనే మద్యం కుంభకోణం జరిగిందని, ఎక్కడైనా నోటీసులు ఇచ్చే అధికారం సీఐడీకి ఉంటుందని న్యాయవాది బదులిచ్చారు. ఎక్కడైనా అంటే.. ప్రత్యేకించి మరో రాష్ట్రంలో ఉన్న వ్యక్తికి నోటీసులు ఇవ్వొచ్చా? లేదా? అన్న దానిపై సమాధానం చెప్పాలని జస్టిస్ పార్దివాలా ప్రశ్నించారు. నిందితుడు అరెస్టులో ఉన్నాడా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అరెస్టు అయ్యాడని నిందితుడి తరఫు న్యాయవాది బదులిచ్చారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ప్రతివాదులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సిట్, ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనాలకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేస్తూ, ఆ లోపు నోటీసులకు సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది.

అంతా పీఎస్సార్ కనుసన్నల్లోనే!

- పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్ కోసం బెజవాడలో అన్యాయంగా జెత్వానీపై కేసు
- ఈ దశలో బెయిలిస్తే పీఎస్సార్ సాక్ష్యాలు తారుమారు చేస్తారు
- సీఐడీ తరఫున ప్రాసిక్యూషన్ వెల్లడి



విజయవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో తామంతా అప్పటి నిఘా విభాగం చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలతోనే పనిచేసినట్లు విజయవాడ డీసీపీగా పనిచేసిన విశాల్ గున్ని వాంగ్మూలం ఇచ్చారని ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ కోర్టుకు విన్నవించారు. బెయిల్ కోసం, జైలులో సదుపాయాల కల్పనకు సంబంధించి పీఎస్సార్ దాఖలు చేసిన పిటిషన్లపై సీఐడీ తరఫున ఆయన శుక్రవారం విజయవాడ మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో వాదనలు వినిపించారు. ముంబైలో పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌పై జెత్వానీ పెట్టిన కేసులో.. ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చేసేందుకు విజయవాడలో అన్యాయంగా ఆమెపై కేసు పెట్టారని తెలిపారు. ముంబై కేసులో ఆమె అక్కడి కోర్టుకు వెళ్లకుండా అడ్డుకోవడానికి.. ఇక్కడ కేసు నమోదు చేసి జైలులో బంధించారని వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారమంతా పీఎస్సార్ కనుసన్నల్లోనే సాగిందన్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని.. ఈ పరిస్థితుల్లో ఆయనకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని తెలిపారు. వాదనల అనంతరం న్యాయాధికారి టి.తిరుమలరావు తీర్పును తొమ్మిదో తేదీకి రిజర్వ్ చేశారు.

హెలిప్యాడ్ కేసులో పైలట్ మళ్లీ గైర్హాజరు

- వర్చువల్‌గా అవకాశమివ్వాలని పోలీసులకు వినతి
- నేడో, రేపో మూడో నోటీసు!

చెన్నేకొత్తపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పర్యటనలో శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద చోటు చేసుకున్న ఘటనపై విచారణకు హెలికాప్టర్ పైలట్ అనిల్‌కుమార్ రెండోసారీ గైర్హాజరయ్యారు. మే 2న రావాలని పోలీసులు ఆయనకు రెండో నోటీసు పంపిన విషయం తెలిసిందే. మొదటి నోటీసు ఇచ్చినప్పుడు గత నెల 16న కో-పైలట్ శ్రేయాజ్ జైన్ హాజరయ్యారు. అయితే తాను తప్పనిసరి సెలవులో ఉన్నానంటూ.. పైలట్ అనిల్‌కుమార్ ఆ రోజు డుమ్మాకొట్టారు. రెండో నోటీసుపై శుక్రవారం స్పందిస్తూ, నేరుగా విచారణకు హాజరు కాలేనని, వర్చువల్‌గా అవకాశం కల్పించాలని పోలీసులకు విన్నవించినట్లు తెలిసింది. ఆయనకు ఒకట్రెండు రోజుల్లో మూడో నోటీసు ఇవ్వనున్నట్లు సమాచారం. కో-పైలట్ చాలా ప్రశ్నలకు సమాధానాలు దాటవేయడం, ప్రధాన పైలట్ విచారణకు గైర్హాజరవుతుండటంతో దర్యాప్తు ముందుకు సాగడం లేదు. గత నెల 8న జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ శ్రేణులు హెలిప్యాడ్ వద్దకు దూసుకెళ్లాయి. ఆ సమయంలో విండ్ షీల్డ్ దెబ్బతిందని.. జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేతలు ఆరోపణలు గుప్పించడంతో సర్కారు తీవ్రంగా పరిగణించి.. విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే.

చిత్రజ్యోతి

★SINCE 1965★

'స్పిరిట్' తర్వాతే...



ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. అయితే మొదట 'యానిమల్'కు సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' ప్రారంభమవుతుందని, అందువల్ల 'స్పిరిట్' షూటింగ్ ఆలస్యం అవుతోందంటూ వార్తలు వెలువడ్డాయి. తాజాగా నిర్మాత భూషణ్ కుమార్ ఈ వార్తలను ఖండించారు. మరో రెండు, మూడు నెలల్లో 'స్పిరిట్' షూటింగ్ ప్రారంభం అవుతుందన్నారు. దీని తర్వాతే 'యానిమల్ పార్క్'ను రూపొందిస్తామని స్పష్టం చేశారు.

తూటాల వర్షంలో పువ్వేదో పూసేనా



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్ డమ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్రబృందం తొలి గీతాన్ని విడుదల చేసింది. 'హృదయం లోపల' అంటూ సాగే ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూర్చడంతో పాటు అనుమిత నదేశన్‌తో కలసి ఆలపించారు. కేకే సాహిత్యాన్ని అందించారు. అద్భుతమైన కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేలా ఈ సినిమా ఉండబోతోంది అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జోమోన్ టి. జాన్, గిరీష్ గంగాధరన్, ఎడిటర్: నవీన్ నూలి.

జూన్‌లో విడుదల




నూతన నటీనటులు ఆశిష్ గాంధీ, మానసా రాధాకృష్ణన్‌లు జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. కిరణ్ కిట్టి, లక్ష్మీ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. సోనుధి ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై ఆర్‌యూ రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. నిర్మాత మాట్లాడుతూ 'ఈ సినిమాలో గోపీ సుందర్ స్వరపరిచిన ఆరుపాటలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి. త్వరలో టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తాం, జూన్‌లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. 'మనసుకు హత్తుకునే భావోద్వేగాలున్న కథ ఇది. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించాం' అని దర్శకులు తెలిపారు.

మన వాళ్లకు శక్తిమంతులైన హీరోలు కావాలి!



భారతీయ ప్రేక్షకులు శక్తిమంతులైన హీరోలను చూడటానికి ఇష్టపడతారని హీరో నాగార్జున అభిప్రాయపడ్డారు. ముంబైలో జరుగుతున్న వేవ్స్ సమావేశంలో శుక్రవారం జరిగిన ఒక చర్చలో ఆయన పాల్గొన్నారు. "మన దేశంలో చాలా మంది ప్రజలకు రోజువారీ జీవితంలో చాలా ఒత్తిడి ఉంటుంది. సినిమాలను చూస్తే వారికి ఆ ఒత్తిడి పోతుంది. అందుకే వారు సినిమాల్లో మ్యాజిక్ కోరుకుంటారు. ఒక హీరో 20 మందిని ఎలా కొట్టగలుగుతాడని కొందరు అడుగుతారు. హాలీవుడ్‌లో మార్వెల్‌లాంటి సినిమాల్లో కూడా అదే చేస్తారు. కానీ వాళ్లకు సూపర్ పవర్స్ ఉన్నట్లు చూపిస్తారు. మన హీరోలకు అలాంటి ప్రత్యేక శక్తులు ఉండవు. ఒక సామాన్యుడు అసామాన్యంగా ప్రవర్తిస్తే మన ప్రేక్షకులకు నచ్చుతుంది.." అని నాగార్జున వ్యాఖ్యానించారు. 'పుష్ప-2' లాంటి సినిమాలకు దేశవ్యాప్తంగా ఆదరణ లభించటానికి ఇదే కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. "పుష్ప' తెలుగులో కన్నా హిందీలో ఎక్కువ వసూళ్లు సాధించింది. తెలుగులో 'పుష్ప'లాంటి సినిమాలు ఇంతకు ముందూ వచ్చాయి. కానీ బిహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో 'పుష్ప'లోని పుష్పరాజ్,, 'కేజీఎఫ్'లో రాకీ.. 'బాహుబలి'లో ప్రభాస్ లాంటి హీరోలను చూడాలనుకుంటున్నారు.. అందుకే ఈ సినిమాలు అక్కడ పెద్ద హిట్ అయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. మాతృభాష పట్ల అభిమానం.. సొంత సంస్కృతి పట్ల మమకారం ఉన్న దర్శకుల చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారన్నారు. "బాహుబలి సినిమాలో ప్రతి ఫ్రేమ్‌ను రాజమౌళి- తెలుగు సినిమాలాగే తీసారు. దానిని ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఆదరించారు. కథను మంచిగా చెప్పగలిగితే - అందరూ ఆదరిస్తారు" అని నాగార్జున పేర్కొన్నారు. తాను తన సినిమాలు తెలుగులో హిట్ కావాలని కోరుకుంటానని.. తెలుగులో హిట్ అయితే ఇతర భాషల్లో కూడా తప్పనిసరిగా హిట్ అవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్, తమిళ నటి ఖుష్బు సుందర్, హీరో కార్తీలు కూడా ఈ చర్చలో పాల్గొన్నారు.


వినోదం పంచేలా...



నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా మురళీ మనోహర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. డా.సంధ్య గోలి సమర్పణలో వేను సద్ది, అమర్ బుర్రా, జయకాంత్(బాబీ) నిర్మిస్తున్నారు. ఈ సినిమా పోస్టర్‌ని మేకర్స్ శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ చిత్రం ఆద్యంతం హాస్యభరితంగా ఉండబోతున్నట్టు పోస్టర్ చూస్తే తెలుస్తోంది. విభిన్నంగా తీర్చిదిద్దిన క్యారెక్టర్లను హైదరాబాద్ నగర బ్యాక్‌డ్రాప్‌లో స్టైలిష్‌గా ప్రెజెంట్ చేశారు.

ప్రపంచవ్యాప్తంగా మనకు గుర్తింపు వచ్చింది!

సినిమా- సాఫ్ట్ పవర్ అనే అంశంపై శుక్రవారం వేవ్స్ అంతర్జాతీయ సమావేశంలో జరిగిన చర్చలో - హీరో విజయ్ దేవరకొండ, బాలీవుడ్ నటి కరీనాకపూర్, హిందీ దర్శకుడు కరణ్ జోహార్ పాల్గొన్నారు. భారతీయ సినిమాలను, కథలను ప్రపంచవ్యాప్తంగా అందరూ గుర్తిస్తున్నారని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. "కశ్మీర్.. ముస్సోరీ వంటి ప్రాంతాలకు వెళ్తే అక్కడ చాలా మంది గుర్తుపడుతున్నారు. పదేళ్ల క్రితం దక్షిణాది నటులను ఎక్కువగా గుర్తుపట్టేవారు కాదు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. వారు మమల్ని గుర్తుపడుతున్నారంటే దానికి కారణం సినిమా మాత్రమే! " అని విజయ్ అభిప్రాయపడ్డారు. తనకు చిన్నతనం నుంచి అమెరికా గురించి తెలుసునని.. అమెరికాలో ఉన్న 10 ప్రధాన నగరాలు కూడా తెలుసునని.. దానికి కారణం సినిమాలేనని విజయ్ పేర్కొన్నారు. దక్షిణాది, ఉత్తరాదికి చెందిన స్టార్స్ కలిసి పనిచేస్తే భారీ సినిమాలు వస్తాయన్నారు. "షారుక్ ఖాన్ సినిమా రూ. వెయ్యి కోట్లు కలెక్ట్ చేసింది.. అల్లు అర్జున్ 'పుష్ప' రూ. వెయ్యి కోట్లు కలెక్ట్ చేసింది.. ఇలాంటి ఇద్దరు స్టార్స్ కలిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.." అన్నారు. ఆగస్టు నెలలో జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటించిన 'వార్ 2' సినిమా విడుదల అవుతోందని.. ఉత్తరాది, దక్షిణాది హీరోలు కలిస్తే ఎలా ఉంటుందనే విషయానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని కరణ్ జోహార్ పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా భారతీయ సినిమాలకు ఆదరణ పెరిగిందని.. రాజమౌళి లాంటి దర్శకుల సామర్థ్యాన్ని ప్రపంచమంతా గుర్తిస్తోందని కరణ్‌జోహార్ పేర్కొన్నారు. "ప్రస్తుతం దక్షిణాది.. ఉత్తరాది సినిమాలనేవి ఏమి లేదు. భారతీయ సినిమా మాత్రమే ఉంది. దీనిని అందరూ గుర్తించాలి. అందరూ కలిసినప్పుడే మన భారతీయ సినిమాలను ముందుకు తీసుకువెళ్లగలుగుతాం" అన్నారు. భారతీయ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఎప్పటి నుంచో గుర్తింపు ఉందని కరీనా కపూర్ పేర్కొన్నారు. "లండన్‌లో ఒక సారి ట్యాక్సీలో వెళ్తున్నా. ఆ ట్యాక్సీ డ్రైవర్ మా తాతగారు రాజ్‌కపూర్ సినిమాలోని - 'మేరా జూతా హై జపానీ..' పాట హిందీలో పాడి వినిపించాడు. నాకు చాలా గర్వంగా అనిపించింది.." అని ఆమె తన అనుభవాన్ని వివరించారు. ప్రముఖ దర్శకుడు స్పీల్‌బర్గ్ కూడా మన హిందీ సినిమాలు చూస్తారని కరీనా కపూర్ పేర్కొన్నారు.



వేవ్స్ అద్భుతం

\- శ్రీలీల



వేవ్స్ సదస్సులో కథానాయిక శ్రీలీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం నాకు ఎంతగానో నచ్చింది. వినోదరంగంలో పెట్టుబడులు పెట్టాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించిన తీరు ఆలోచింపజేసింది. నిర్వాహకులు కార్యక్రమాన్ని చాలా అద్భుతంగా నిర్వహిస్తున్నారు' అని ఆమె పేర్కొన్నారు.

థ్రిల్లర్ కథాంశంతో

'స్త్రీ 2' చిత్రం బ్లాక్‌బస్టర్ అవ్వడంతో బాలీవుడ్‌లో శ్రద్ధాకపూర్ దశ తిరిగింది. ఆ విజయంతో ఒక్కసారిగా ఆమె డిమాండ్ ఉన్న కథానాయికగా మారారు. హిందీ పరిశ్రమలోని అగ్ర నిర్మాణ సంస్థల నుంచి శ్రద్ధకు ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఆమె మాత్రం ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటున్నారు. ముఖ్యంగా హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలకే శ్రద్ధాకపూర్ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏక్తాకపూర్ నిర్మాతగా తెరకెక్కుతోన్న చిత్రంలో నటించేందుకు శ్రద్ధా అంగీకరించారనీ, ఇందుకోసం రూ. 17 కోట్లు పారితోషికంగా అందుకోంటున్నారని బాలీవుడ్ టాక్. థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'తుంబాడ్' ఫేమ్ రహి అనిల్ బర్వే దర్శకత్వం వహించనున్నారట. ఈ ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌పైకి వెళ్లనుందని తెలుస్తోంది. శ్రద్ధాకపూర్ కెరీర్‌లో ఇప్పటివరకూ ఆమె అందుకున్న అత్యధిక పారితోషికం ఇదే అవుతుంది.



కామెడీ ఎంటర్‌టైనర్



ఇప్పటివరకూ పలు హాస్యపాత్రల్లో ప్రేక్షకులను మెప్పిస్తూ వచ్చిన ప్రవీణ్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతోన్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం యూనిట్ విడుదల చేసింది. చేతిలో గరిటెతో తీక్షణమైన చూపులతో కనిపిస్తున్న ప్రవీణ్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంతో ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. వైవాహర్ష, కృష్ణ భగవాన్, షైనింగ్ ఫణి కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాలను అలరించే అంశాలున్నాయి. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది' అన్నారు. నటుడిగా ప్రవీణ్‌లోని కొత్తకోణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నారని నిర్మాతలు తెలిపారు. సంగీతం: వికాస్ బాడిస, సినిమాటోగ్రఫీ: బాల సరస్వతి

అమరావతికి జయం!



మోదీజీ హమ్ ఆప్‌కే సాత్‌హై!

అమరావతి సభలో పహల్గాం ఉగ్రదాడి ఘటనను సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఈసమయంలో తామంతా ప్రధాని మోదీ వెంట ఉంటామంటూ హిందీలో చంద్రబాబు తన మద్దతు ప్రకటించారు. 'మోదీజీ హమ్ ఆప్‌కే సాత్‌హై. ఆంధ్రప్రదేశ్ కే పాంచ్ కరోడ్ లోగ్ ఆప్‌కే సాత్ హై. పూరా దేశ్ ఆప్‌కే సాత్ హై." (మోదీగారు! మీ వెంట మేముంటాం. ఏపీకి చెందిన ఐదు కోట్ల మంది ప్రజలు మీతోనే ఉంటారు. దేశమంతా మీ వెంట ఉంటుంది) అంటూ స్పష్టం చేశారు. అనంతరం సభికులతో వందేమాతరం....భారత్‌మాతా కీ జై అంటూ చంద్రబాబు నినాదాలు చేయించారు. ప్రధాని మోదీ సైతం...చెయ్యెత్తి వందేమాతరం..భారత్ మాతాకీ జై అంటూ నినదించారు.





సభా ప్రాంగణం బయటా జనం రద్దీ

"అమరలింగేశ్వర స్వామి ఆలయం కొలువైన పుణ్యభూమి అమరావతి. కృష్ణమ్మ తీరాన విలసిల్లిన శాతవాహనుల రాజధాని....భౌద్ధుల ఆధ్యాత్మిక కేంద్రం ఇది. అమరావతిని రాజధానిగా ఎంపిక చేసుకుని 2015లో ప్రధాని మోదీ చేతులు మీదుగా పనులు ప్రారంభించుకున్నాం. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన పాలకులు రాజధాని పనులు నిలిపివేశారు, విధ్వంసం సృష్టించారు. తిరిగి మళ్లీ మోదీ చేతుల మీదుగానే రాజధాని పనులను పునఃప్రారంభించుకుంటున్నాం. ఇది రాజధానికి పునరుజ్జీవం. రాజధాని పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రధాని చేతుల మీదుగానే మళ్లీ మూడేళ్ల తర్వాత ప్రారంభోత్సవాలు చేయిద్దాం."

\- సీఎం చంద్రబాబు

ఆత్మగౌరవ ప్రతీక అమరావతి



ఇది కేవలం రాజధాని నగరమే కాదు.. ఐదుకోట్లమంది ప్రజల సెంటిమెంట్

మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి.. తిరిగి మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తాం

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): "అమరావతి కేవలం ఒక రాజధాని నగరమే కాదు. అది ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి, ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. వెలగపూడిలో శుక్రవారం జరిగిన అమరావతి పనుల పునఃప్రారంభ సభలో చంద్రబాబు మాట్లాడారు. అమరావతి పనులు పునఃప్రారంభించుకుంటున్న ఈ రోజు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజుగా గుర్తుండిపోతుందని సీఎం వ్యాఖ్యానించారు. "2014లో రాజధాని లేని పరిస్థితుల్లో పాలన ప్రారంభించుకున్నాం. 29వేల పైచిలుకు మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రాజధాని కోసం 34 వేల ఎకరాలు ఇచ్చారు. వారి త్యాగాలు ప్రపంచానికి ఆదర్శం. కానీ వారి త్యాగాలను గత వైసీపీ ప్రభుత్వం అపహాస్యం చేసింది. అవహేళన చేసింది. రాజధాని రైతులు ఎన్నో బాధలు పడ్డారు.. అవమానాలు ఎదుర్కొన్నారు.. లాఠీ దెబ్బలు తిన్నారు.. జైలుకుపోయారు. కానీ వెనకడుగు వేయలేదు. ఇలాంటి ఉద్యమాన్ని నా జీవితంలో చూడలేదు.. ఇకపై చూస్తానని కూడా అనుకోవడం లేదు.' అని చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు చేసిన న్యాయ పోరాటం ఫలితంగా న్యాయస్థానాలు అమరావతిని బతికించాయన్నారు. చంద్రబాబు ప్రసంగం ఆయన మాటల్లోనే..

హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి

"విధ్వంస పాలన ముగిసి 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రజలు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. ప్రజల ఆశీస్సులతో నాలుగోసారి సీఎం అయ్యాను. కానీ ఆర్థికపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఎలా బయటకు తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నప్పుడు కేంద్రం, వ్యక్తిగతంగా మోదీ ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చారు. కేంద్రం సహకారంతో 10 నెలల్లో అమరావతిని గాడినపెట్టాం. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం. ఈ రోజు వర్షం వస్తుందని అనుకున్నాం. మోదీ రావడంతో వర్షం కూడా వెనక్కి తగ్గింది. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో వాతావరణం అనుకూలించక ఏ ఒక్క కార్యక్రమం కూడా రద్దు అయిన దాఖలా లేదని మోదీ చెప్పారు. మంచి సంకల్పం ఉంటే ప్రకృతి కూడా సహకరిస్తుందనడానికి ఇదే నిదర్శనం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండబోతోంది."

జపాన్ మియావాకీ ఆదర్శం..

"రాజధానిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రతి పౌరుడూ 'నా రాజధాని అమరావతి' అని గర్వంగా చెప్పుకొనేలా నిర్మిస్తాం. రాజధానిలో 30 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. నవ నగరాలు.. భూగర్భంలోనే విద్యుత్ ఇతరత్రా పైపులు వెళ్లేలా డిజైన్ చేశాం. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు.. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ప్రధాన నగరాలను అమరావతికి అనుసంధానం చేస్తాం. 5లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాని మోదీ ఇదే కోరారు. రాజధానిలో మంచి విద్యాసంస్థలను ఏర్పాటు చేసి భావి తరాలను తీర్చిదిద్దండని సూచన చేశారు. దాన్ని ఆచరణలో పెడుతున్నాం. ఇప్పటికే చాలా విద్యాసంస్థలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. జపాన్ మియావాకీని ఆదర్శంగా తీసుకుని రాజధానిని పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం. ఈ రోజు రూ.49వేల కోట్ల విలువైన 74 పనులను ప్రారంభించుకోవడంతోపాటు మరో రూ.8వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసుకున్నాం. ఇది రాజధానికి పునరుజ్జీవం. ఇప్పుడు శంకుస్థాపన చేస్తున్న ప్రధాని చేతుల మీదుగానే మళ్లీ మూడేళ్ల తర్వాత ఈ పనులు ప్రారంభోత్సవాలు చేయిద్దాం."



అమరావతి పనుల పునఃప్రారంభంలో మోదీ ఆవిష్కరించిన పైలాన్ వద్ద లోకేశ్, శ్రీనివాస వర్మ, నారాయణ, సత్య కుమార్, నాదెండ్ల మనోహర్, రామ్మోహన్ నాయుడు, శ్రవణ్, పెమ్మసాని చంద్రశేఖర్



దారులన్నీ.. అమరావతి పునర్నిర్మాణ సభకే



మోదీ సభలో అమరావతి మహిళలు, రైతుల సంబరం

ప్రధాని మోదీకి ఘనస్వాగతం

విజయవాడ, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధానిలోని వెలగపూడిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వేదిక వద్దకు వెళ్లారు. అంతకుముందు మధ్యాహ్నం 2.49 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్, సుభాష్ తదితరులు స్వాగతం పలికారు. వాయుసేన హెలికాప్టర్‌లో ప్రధాని మోదీ అమరావతికి బయలుదేరారు. సభ ముగిసిన తర్వాత వాయుసేన హెలికాప్టర్‌లో ప్రధానితో పాటు చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి ఢిల్లీ వెళ్లారు.



అమరావతి పనుల పునఃప్రారంభ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, పక్కన చంద్రబాబు, పవన్, పెమ్మసాని, నాదెండ్ల, సత్యకుమార్, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, లోకేశ్, నారాయణ, శ్రవణ్

మోదీ మొహంలో బాధ కనిపించింది

- ఆహ్లాదంగా ఉండే ఆయన గంభీరంగా కనిపించారు
- పహల్గాం ఉగ్రదాడిని సభలో ప్రస్తావించిన చంద్రబాబు

అమరావతి పునఃప్రారంభ సభలో పహల్గాం ఉగ్రదాడి అంశాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. "గతంలో ఎప్పుడు మోదీని కలిసినా ఆహ్లాదంగా ఉండేవారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మోదీని కలిసినప్పుడు ఆయన మొహంలో బాధ చూశాను. అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి ఆహ్వానించడానికి వెళ్లినప్పుడు ఆయన చాలా గంభీరంగా కనిపించారు. ఉగ్రదాడిలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్న ఆవేదన మోదీలో కనిపించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల తరఫున చెబుతున్నాను. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని మోదీ తీసుకునే ప్రతి చర్యకూ మద్దతుగా ఉంటాం. విశాఖలో వచ్చే నెల 21వ తేదీన పదో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ప్రధాని తాను వస్తానని అన్నారు. ఆయన రాక మనకు స్ఫూర్తినిస్తుంది." అంటూ చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు.

టెక్నాలజీ అంటేనే మోదీ

దేశానికి సరైన సమయంలో లభించిన సరైన నాయకుడు మోదీ. మోదీ అధికారంలోకి వచ్చిన 2014లో ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మన దేశానిది 10వ స్థానం. 11 ఏళ్లలో మోదీ 5వ స్థానంలోకి తీసుకొచ్చారు. ఈ ఏడాది జపాన్‌ను అధిగమించి 4వ స్థానానికి వస్తామని, 2027 నాటికి జర్మనీని అధిగమించి 3వ స్థానానికి వస్తామని ఐఎంఎఫ్ గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల కేంద్ర కేబినెట్‌లో మోదీ కులగణన అనే విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇది దేశంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుంది. టెక్నాలజీ అంటే మోదీ. ఆయన జన్‌ధన్ ఖాతాలు, యూపీఐ ద్వారా నగదు రహిత లావాదేవీలు వంటి ఎన్నో వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. ఇటీవలే జాతీయ క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించారు. ఆయన స్ఫూర్తితో అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం. అందులో భాగంగా ఈ రోజే టీసీఎస్, ఐబీఎం వంటి సంస్థలతో ఎంవోయూలు చేసుకున్నాం. ఏఐను ప్రోత్సహించే విధంగా కార్యాచరణ అమలు చేస్తున్నాం.

అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యం

"అమరావతినే కాదు రాష్ట్రంలోని 26 జిల్లాలనూ అభివృద్ధి చేస్తాం. 2027 నాటికి కేంద్రం సహకారంతో పోలవరాన్ని పూర్తి చేస్తాం. నదుల అనుసంధానం చేస్తాం. విశాఖను నాలెడ్జ్, ఫైనాన్షియల్ కేపిటల్‌గా చేస్తాం. గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ కంపెనీలు విశాఖకు వచ్చాయి. భోగాపురం విమానాశ్రయం పూర్తిచేయడంతో పాటు విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీని బలోపేతం చేస్తాం. ఇప్పటికే కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థికసాయం చేసింది. విశాఖకు రైల్వే జోన్ కేటాయించింది. వెనకబడిన రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. డిఫెన్స్ ఇండస్ట్రీలు రానున్నాయి. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తాం. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ వస్తుంది. తిరుపతిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం.

అవకాశాల రాజధాని!

- ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లక్కర్లేదు
- మోదీ సహకారం.. చంద్రబాబు అనుభవంతో ప్రపంచస్థాయి నగరంగా అమరావతి తథ్యం
- రైతుల కష్టాలు నాకు గుర్తున్నాయి: పవన్

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): "రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుంది"... అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు. ముఖ్యాంశాలు..

నాడు చెప్పాం.. నేడు చేస్తున్నాం

అప్పట్లో దివి సీమ తుఫాను వచ్చి అందరి ఆశలు తుడిచిపెట్టినట్లు... గత ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టింది. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 30, సెక్షన్ 144 మాత్రమే గుర్తుకు వచ్చేలా చేసింది. రాజధాని కోసం 34వేల ఎకరాలు ఇచ్చిన 29వేల పైచిలుకు రైతులు గత ఐదేళ్లు నలిగిపోయారు. రోడ్ల మీదకు వచ్చారు. ముళ్ల కంచెల మధ్య కూర్చున్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి సమయంలో... తమ కన్నీళ్లు తుడిచేవారు ఉన్నారా... మా కష్టాలు ప్రధాని మోదీకి తెలుస్తాయా అని నన్ను అప్పట్లో అడిగారు. మోదీకి తెలియకుండా ఏదీ ఉండదు... అమరావతే శాశ్వత రాజధానిగా ఉంటుందని ఆనాడే మాట ఇచ్చాం. గత ప్రభుత్వం ఈ త్యాగాన్ని అవమానించింది. మూడు రాజధానుల పేరుతో అమరావతిని అగౌరవపరిచింది. మగవాళ్ల పోరాటం ఆపివేస్తే మహిళలు ఆంధ్రుల పౌరుషం చూపించారు. మీ సాహసం, సహనం అందరికీ ప్రేరణగా నిలుస్తాయి. మీరు ఎదుర్కొన్న అవమానాలు, మీకు అయిన గాయాలు అన్నీ గుర్తున్నాయి. మరీ ముఖ్యంగా... మహిళా రైతుల పాత్ర మరిచిపోలేం. జవాబుదారీగా ఉంటాం. అప్పుడు చెప్పినట్లుగానే... ఇప్పుడు ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనుల పునః ప్రారంభం జరుగుతోంది. అది కూడా... ఆదిశంకరాచార్యుడి జయంతి సందర్భంగా జరుగుతుండటం ఎంతో ఆనందం కలిగిస్తోంది. ధర్మం కోసం మనం నిలబడితే... ధర్మం మన పక్షాన నిలబడుతుంది. కేంద్రంలో, రాష్ట్రంలో స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వం ఉంది. అభివృద్ధి వేగంగా సాగుతోంది.గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కేంద్రం నుంచి వచ్చే వేల కోట్లు నష్టపోయాం. ఇప్పుడు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో పని చేస్తున్నాయి. నేడు అమరావతి పనులతోపాటు రహదారులు, రైల్వే, పారిశ్రామిక, రక్షణకు సంబంధించిన అనేక ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేస్తున్నారు. నేను ఎన్నికల సమయంలో అవనిగడ్డలో ఇచ్చిన హామీకి అనుగుణంగా మిస్సైల్ టెస్ట్ రేంజ్‌కు శంకుస్థాపన జరుగుతుండటం ఆనందంగా ఉంది.



మోదీకి దేశమే ఇల్లు.. అమరావతి రాష్ట్రానికి ఇల్లు

ప్రధాని మోదీ గతంలో సన్యాశమ దీక్షలో ఉన్నప్పుడు 'అనికేత్' అనే పేరు పెట్టుకున్నారు. దాని అర్థం... ఇల్లు లేని వాడు, పరమశివుడు అని అర్థం. కానీ... అలాంటి వ్యక్తి నేడు ఐదు కోట్ల తెలుగు వారి కోసం, మనందరికీ ఇల్లు లాంటి రాజధాని నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్నారు. కశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు... కామాఖ్య నుంచి ద్వారక వరకు.. ఉన్న దేశాన్నే ఆయన తన ఇల్లుగా చేసుకున్నారు.

చంద్రబాబు విజన్.. దక్షత...

చంద్రబాబు విజనరీ లీడర్. ఒకప్పుడు రాళ్లు, రప్పల్లో ఒక మహానగరాన్ని చూసిన వ్యక్తి. 20 ఏళ్ల ముందుకు వెళ్లి ఆలోచించే నాయకుడు. రాష్ట్రానికి అలాంటి నేత సీఎం కావాలని ఆకాంక్షించాం. అదే జరిగింది. చంద్రబాబు సైబరాబాద్‌ను ఎంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. ఆయన అనుభవం, దక్షత, పాలనా సామర్థ్యంతో అమరావతినీ అలాగే అభివృద్ధి చేస్తారు. ఈ నగరం తెలుగు వారికే కాదు... దేశానికే తలమానికంగా ఉంటుంది.

ప్రధానికి దుర్గమ్మ శక్తినివ్వాలి...

కశ్మీర్‌లో ఉగ్ర దాడి నేపథ్యంలో... క్లిష్ట సమయంలోనూ.. దేశమంతా యుద్ధంవైపు వెళ్తున్న సమయంలోనూ ప్రధాని ఇక్కడికి వచ్చారు. లోపల ఎంతో వేదన ఉన్నప్పటికీ... అమరావతి రైతులు చేసిన త్యాగాలు మరచిపోకూడదనే ఆయన ఇక్కడికి వచ్చారు. రాష్ట్రం పట్ల ఆయన నిబద్ధతకు ఇది నిదర్శనం. పహల్గాం దాడి జరిగిన రోజు... చీకటి రోజు. కశ్మీర్‌లో చిందిన నెత్తురు... దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఉగ్రవాదులపై కఠిన చర్యలు ఉంటాయని మోదీ దేశ ప్రజలకు మాట ఇచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని నడిపిస్తున్న ప్రధానికి... కనకదుర్గమ్మ, భవానీ మాత ఆశీస్సులు, శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. జై భవానీ, జై భారత్, జైహింద్.

తుంపర్లతో ఉపశమనం

- సభ వద్ద పిడుగులను నియంత్రించే వ్యవస్థ ఏర్పాటు
- ట్రాఫిక్ స్తంభించకుండా పకడ్బందీ చర్యలు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగిన ప్రధాని సభకు హాజరైన లక్షలాది ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. సభలో చల్లదనం కోసం తుంపర జల్లులను ఏర్పాటు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం సభ ప్రాంతంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో లోపల ఆశీనులైన ప్రజలు ఉక్కపోతకు గురికాకుండా ఆ తుంపరల జల్లు ఎంతగానో ఉపయోగపడింది. అదే సమయంలో గాలి వీచడంతో నీటి తుంపరలు సభా ప్రాంగణమంతా విస్తరించి శీతలమయం చేశాయి. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సభా ప్రాంగణానికి సమీపంలో పిడుగులను నిరోధించే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదృష్టవశాత్తు వర్షం కురవలేదు. ప్రాంగణంలోకి ఏ పార్టీ జెండాలను పోలీసులు అనుమతించలేదు. మువ్వన్నెల జాతీయ జెండాలను మాత్రమే అనుమతించారు. రోడ్డు పొడవునా ప్రధానికి మహిళలు స్వాగతం పలికారు. సభకు రాష్ట్రం నలుమూలల నుంచీ ప్రజలు తరలి వచ్చారు. చాలామంది ఉదయం 10 గంటలకే అమరావతి చేరుకున్నారు. ఎండ తీవ్రతను ఏమాత్రం లెక్క చేయకుండా మహిళలు తరలిరావడం విశేషం. సభకు తరలి వచ్చే వారి కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలతో పాటు టీడీపీ నేతలు పలు చోట్ల ఆహారం, తాగునీరు, మజ్జిగ సరఫరా చేశారు. మొత్తం ఎనిమిది మార్గాల ద్వారా సభా వేదిక వద్దకు ప్రజలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించి పోకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.



సభా ప్రాంగణంలో ప్రజలకు ఎండ నుంచి ఉపశమనం లభించేలా తుంపర జల్లులు



అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు..

అండగా నిలుస్తా.. భుజం కలిపి నడుస్తా!



'అమరావతి పునఃప్రారంభ' సభలో మోదీ

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు సరైన దారిలో వెళుతోంది. సరైన వేగం అందుకుంది. రాష్ట్రాభివృద్ధి ప్రస్థానంలో మీతో భుజం కలిపి నడుస్తాను" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. అమరావతి పనుల పునరుద్ధరణతోపాటు రాష్ట్రంలోని పలు రైల్వే, రహదారులు, రక్షణ ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా అమరావతిలోని వెలగపూడి సచివాలయ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. అమరావతి, పోలవరం పూర్తికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అమరావతిని ఒక 'శక్తి'గా అభివర్ణించారు. "అమరావతి... స్వర్ణాంధ్ర విజన్‌కు శక్తినిస్తుంది. స్వర్ణాంధ్ర.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని బలపరుస్తుంది. అమరావతి కేవలం ఒక నగరం కాదు... అమరావతి ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక ప్రదేశ్‌గా, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి" అని ఉద్ఘాటించారు. చంద్రబాబు మూడేళ్లలో అమరావతిని నిర్మిస్తామని లక్ష్యంగా పెట్టుకున్నారని... ఆ తర్వాత రాష్ట్ర జీడీపీని అమరావతి నగరం ఎక్కడికి తీసుకెళుతుందో తాను ఊహించగలనని ప్రధాని అన్నారు. ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమరావతి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భుజం కలిపి నడుస్తానని భరోసా ఇచ్చారు. ప్రధాని ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఆయన మాటల్లోనే!

భవిష్యత్ నగరం...

ఆంధ్రప్రదేశ్ ప్రజలారా... అమరావతి ఇంద్రలోకపు రాజధాని. ఇప్పుడు... అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని. ఇది యాదృచ్ఛికం కాదు. స్వర్ణాంధ్ర నిర్మాణానికి శుభ సంకేతం. అమరావతి పుణ్యభూమిపై నిలబడిన ఈ క్షణం నాకు భవిష్యత్ నగరం కనిపిస్తోంది. ఒక కల నెరవేరుతున్న క్షణాలు కనిపిస్తున్నాయి. ఒక కొత్త అమరావతి, ఒక కొత్త ఆంధ్రప్రదేశ్ కనిపిస్తున్నాయి. ఒకవైపు బౌద్ధవారసత్వ శాంతి... మరోవైపు వికసిత్ భారత్‌ను నిర్మించుకునే శక్తి అమరావతిలో ఉన్నాయి. ఇప్పుడు దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవి కేవలం కాంక్రీట్ నిర్మాణాలు కావు. ఏపీ ప్రజల ఆకాంక్షలు, వికసిత్ భారత్ ఆశలకు బలమైన పునాదులు. భగవాన్ వీర భద్రస్వామి, అమర లింగేశ్వరుడు, తిరుపతి బాలాజీ పాదాలకు ప్రణమిల్లుతూ... ఏపీ ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నా.

మనమే చేయాలి...

2015లో ప్రజా రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం అమరావతికి మద్దతు ఇచ్చింది. నాడు ఎన్టీఆర్ వికసిత ఆంధ్రప్రదేశ్ గురించి కలగన్నారు. ఇప్పుడు దానిని సాకారం చేయాలి. ఆంధ్రప్రదేశ్‌ను, అమరావతిని వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌లా మార్చాలి. చంద్రబాబు గారు, బ్రదర్ పవన్ కల్యాణ్ ఇది మనం చేయాలి. ఇది మనమే చేయాలి!

మౌలికంతో వికాసం..

గత పదేళ్లలో భారత దేశంలో భౌతిక, సాంకేతిక, సామాజిక మౌలిక సదుపాయాలు ఎంతగానో పెరిగాయి. దాని ఫలాలు ఆంధ్రప్రదేశ్‌కూ లభిస్తున్నాయి. నేడు రాష్ట్రానికి వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి ప్రాజెక్టులు లభించాయి. జిల్లాల మధ్య, పొరుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. రైతులు తమ ఉత్పత్తులను పెద్ద మార్కెట్లకు తరలించవచ్చు. ఉద్యోగులకు, కార్మికులకు రవాణా మెరుగుపడుతుంది. పర్యాటకం మెరుగవుతుంది. ఉదాహరణకు... రేణిగుంట - నాయుడుపేట హైవే పూర్తి కావడం వల్ల తిరుపతికి ప్రయాణం సులువు అవుతుంది. బాలాజీ దర్శనం వేగంగా జరుగుతుంది. మౌలిక సదుపాయాల కల్పన పనులతో సిమెంటు, స్టీల్, రవాణా వంటి ఇతర రంగాలూ ఊపందుకుంటాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇప్పుడు చేపట్టిన ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో వేలాదిమంది యువతకు ఉపాధి లభిస్తుంది.

పది రెట్లు పెరిగిన 'రైల్వే నిధులు'

ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం రికార్డుస్థాయిలో నిధులు కేటాయించాం. 2009-14లో తెలంగాణతో కలిసి ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు కేవలం రూ.900 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు... నవ్యాంధ్రకు మాత్రమే రైల్వే బడ్జెట్ 9వేల కోట్లు దాటింది. అంటే... పది రెట్లు ఎక్కువ. కేంద్రం ఇచ్చిన నిధులతో ఏపీలో రైల్వే వంద శాతం విద్యుదీకరణ జరిగిపోయింది. రాష్ట్రానికి 8 వందేభారత్ రైళ్లు వచ్చాయి. 'అమృత్ భారత్' రైలు కూడా వస్తుంది. రాష్ట్రంలో 750కి పైగా ఆర్వోబీలు, అండర్ పాస్‌లు నిర్మించాం. 70కిపైగా రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నాం.

రైతులకు అండగా ఎన్డీయే

'వికసిత్ భారత్'కు పేదలు, రైతులు, యువకులు, మహిళలు... నాలుగు స్తంభాలని ఎర్రకోటపై నుంచి ఉద్ఘాటించాను. రైతులకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. పదేళ్లలో ఎరువుల కోసం రూ.12 లక్షల కోట్ల భారం భరించాం. పంటల బీమా కింద ఏపీ రైతులకే రూ.5500 కోట్లు పరిహారం చెల్లించాం. పీఎం కిసాన్ నిధి సమ్మాన్ ద్వారా రాష్ట్ర రైతుల ఖాతాల్లో 17,500 కోట్లు జమ చేశాం. ప్రతి ఎకరాకూ నీరు అందాలన్నదే మా లక్ష్యం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తయ్యేలా మద్దతిస్తాం.

అంతరిక్షం నుంచి రక్షణ దాకా ఏపీ

దేశాన్ని అంతరిక్ష శక్తిగా మార్చడంలో దశాబ్దాలుగా ఏపీ కీలక పాత్ర పోషిస్తోంది. శ్రీహరికోట నుంచి నింగికెగిసే ప్రతి రాకెట్ కోట్లాది మంది భారతీయులను గర్వపడేలా చేస్తుంది. ఇప్పుడు... దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే కొత్త సంస్థ ఏపీలో ఏర్పాటవుతోంది. అదే... నాగాయలంక మిసైల్ టెస్టింగ్ రేంజ్! 'నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్'... దుర్గామాతలాగా దేశ రక్షణకు కొత్త శక్తినిస్తుంది.

విశాఖలో ఏకతా మాల్

ఇప్పుడు భారతదేశ శక్తి... ఆయుధాల్లో మాత్రమే లేదు. మన ఐక్యతలో కూడా ఉంది. ఇదే భావనతోనే... దేశవ్యాప్తంగా 'ఏకతా మాల్స్' ఏర్పాటు చేస్తున్నాం. అందులో... విశాఖలో ఒకటి నిర్మిస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. భారత దేశంలోని వైవిధ్యత ఒకేచోట కనిపిస్తుంది. స్థానిక కళాకారులకూ మేలు జరుగుతుంది. 'ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్' భావన బలపడుతుంది.

ప్రపంచం ఏపీ వైపు చూసేలా 'యోగా డే'

'జూన్ 21'ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించి ఈ ఏడాదికి పదేళ్లు అవుతోంది. ఈ అంశాన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఈ ఏడాది ప్రధాన కార్యక్రమాన్ని ఏపీలో నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆ రోజు నేను విశాఖపట్నం వస్తాను. మీ అందరితో కలిసి యోగా చేస్తాను. దీనికి ఇంకా 50 రోజుల సమయం ఉంది. ప్రతి గ్రామానికీ, ఇంటికీ 'యోగా'ను తీసుకెళ్లండి. ప్రాచుర్యం కల్పించండి. ఈసారి జూన్ 21వ తేదీన ప్రపంచమంతా ఏపీవైపు చూస్తుంది. మొత్తం ప్రపంచం ఆశ్చర్యపోయేలా రికార్డు సృష్టిద్దాం. చంద్రబాబు ఆ పని చేస్తారని నాకు నమ్మకముంది.



మనం చేయాలి... మనమే చేయాలి!

అచ్చ తెలుగులో ప్రధాని 'అండ'

పలుమార్లు తెలుగులో మాట్లాడిన ప్రధాని

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'అందరికీ నమస్కారాలు' అని తెలుగులో మొదలుపెట్టి... ఆ తర్వాత ప్రసంగాన్ని హిందీలో కొనసాగించడం షరా మామూలే! కానీ... శుక్రవారం ప్రధాని మోదీ ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. తెలుగులో మొదలుపెట్టి... మధ్యలోనూ పలుమార్లు తెలుగులో మాట్లాడారు. తెలుగు మాటలతోనే తన ప్రసంగాన్ని ముగించారు. రాష్ట్రాభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలుగువారందరికీ అర్థమయ్యేలా... అచ్చ తెలుగులో చెప్పారు. ఇవీ ఆ వివరాలు... "తల్లి దుర్గా భవానీ కొలువైన ఈ పుణ్యభూమిపై మీ అందరినీ కలవడం నాకు ఆనందంగా ఉంది" అంటూ మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "అమరావతి కేవలం ఒక నగరం కాదు... అమరావతి ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక ప్రదేశ్‌గా మార్చే శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను అధునాత ప్రదేశ్‌గా మార్చే శక్తి"... అని తెలుగులో మరోమారు ఉద్ఘాటించారు. ఆ తర్వాత... నాడు ఎన్టీఆర్ అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ కోసం కలలుకన్నారని తెలిపారు. నేడు ఆంధ్రప్రదేశ్‌ను, అమరావతిని 'వికసిత్ భారత్'కు గ్రోత్ ఇంజిన్‌లా మార్చాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. "చంద్రబాబు గారు, బ్రదర్ పవన్ కల్యాణ్ ఇది మనము చేయాలి. ఇది మనమే చేయాలి"... అని తెలుగులో. నొక్కి వక్కాణించారు. చివర్లో... ధన్యవాదాలు, భారత్ మాతాకీ జై, వందే మాతరం... నినాదాలతో ప్రసంగాన్ని ముగించారు.



పవన్.. గొంతు జాగ్రత్త! విక్స్ ఇచ్చిన మోదీ...

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. అమరావతి సభలో పవన్ ప్రసంగిస్తున్న సమయంలో కొంత ఇబ్బంది పడ్డారు. 11 నిమిషాల తన ప్రసంగంలో మధ్యలో రెండుసార్లు దగ్గుతూ ఇబ్బంది పడ్డారు. పవన్ గొంతు సవరించుకుని ప్రసంగం కొనసాగించడాన్ని ప్రధాని మోదీ గమనించారు. ప్రసంగం అనంతరం పవన్ తన సీట్లో కూర్చోబోతుండగా.. మోదీ పిలిచారు. ప్రసంగం బాగుందని అభినందనలు తెలుపుతూనే.. తన జేబులో ఉన్న విక్స్ తీసి పవన్ చేతుల్లో పెట్టారు. అలానే గొంతు జాగ్రత్త అని సూచించారు. ఆ సమయంలో పక్కనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు. ప్రధాని మోదీ తన పర్యటనల్లో సుదీర్ఘ ప్రసంగాలు చేస్తుంటారు. ఆ సమయంలో ఇబ్బంది రాకుండా విక్స్‌ను వెంట పెట్టుకుంటున్నారని తెలుస్తోంది.



టాప్-5 రాజధానుల్లో ఒకటిగా అమరావతి



పదేళ్ల క్రితం అమరావతి రాజధాని ప్రధాని మోదీ చేతుల మీదుగానే పురుడు పోసుకుంది. మళ్లీ తిరిగి పదేళ్ల తర్వాత రాజధాని పనులు పునఃప్రారంభం కూడా మోదీ చేతుల మీదుగానే జరుగుతుండటం మన అదృష్టం. రాష్ట్ర విభజన తర్వాత సీఎం చంద్రబాబు ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో కేవలం 58 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూమిని అమరావతి కోసం రైతులు త్యాగం చేశారు. వారు చేసిన త్యాగం వెలకట్టలేనిది. ప్రపంచంలోనే టాప్-5 రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ప్రభుత్వం నిర్వాకంతో రాజధాని పనులు ఐదేళ్ల పాటు నిలిచిపోయాయి. ప్రధాని మోదీ ఆశీస్సులతో చంద్రబాబు సారథ్యంలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తాం. తరతరాలు గర్వపడేలా ప్రజా రాజధాని నిర్మిస్తాం.

- పురపాలక శాఖ మంత్రి నారాయణ

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది



రాజధాని అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు, ప్రాజెక్టులను కేటాయిస్తూ అండగా నిలుస్తోంది. రాష్ట్రంలో రైల్వే రంగంలో రూ.74వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. అమరావతిని దేశంలోని ప్రధాన నగరాలకు అనుసంధానం చేసేందుకు దాదాపు రూ.2,245 కోట్లతో నూతన రైల్వే లైను నిర్మాణంతో పాటు విశాఖ రైల్వే జోన్ కేంద్ర సహకారంతోనే సాధ్యమైంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు రూ.11,500 కోట్ల మేర ఆర్థిక సాయాన్ని కేంద్రం అందించింది. పూడిమడకలో రూ.1,85,000 కోట్లతో గ్రీన్‌హైడ్రోజన్ కేంద్రం, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ కేంద్రం పనులు సాకారం అయ్యాయి.

- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

అమరావతి అన్‌స్టాపబుల్

ఏపీ అంటేనే మోదీకి ఎంతో ప్రేమ

రాజధాని పనులు పునఃప్రారంభించారు

వంద పాకిస్థాన్లు వచ్చినా గడ్డి కూడా పీకలేరు:లోకేశ్



అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ పైనా.. అమరావతి పైనా.. ఎంతో ప్రేమ. ఇప్పుడు ఆయన ఢిల్లీలో ఎంత బిజీగా ఉన్నారో మనందరికీ తెలుసు. అయినా ఈ కార్యక్రమానికి వచ్చారు. మోదీ చేతుల మీదుగా అమరావతి పనులు పునఃప్రారంభమవుతున్నాయి. ఇక అమరావతికి తిరుగులేదు. అమరావతి అన్‌స్టాపబుల్' అని మంత్రి లోకేశ్ అన్నారు. వెలగపూడిలో శుక్రవారం జరిగిన అమరావతి పనుల పునఃప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2019-24 మధ్యకాలంలో విధ్వంస పాలన నడిచింది. చంద్రబాబుపై వ్యక్తిగత కక్షతో అమరావతిని చంపాలని చూశారు. ఒక్క ఇటుక పెట్టకుండా మూడు రాజధానులంటూ ఐదేళ్ల కాలం గడిపేశారు. 1,631 రోజుల పాటు అమరావతి ఉద్యమం కొనసాగింది. 'జై అమరావతి' అన్నందుకు రైతులకు సంకెళ్లు వేశారు. మహిళా రైతుల్ని పోలీసుల బూటుకాళ్లతో తన్నించారు. 270 మంది రైతులు మృతి చెందారు. 3వేల మందిపై అక్రమ కేసులు పెట్టారు. ఎన్ని కుట్రలు చేసినా అమరావతిని మాత్రం ఆపలేకపోయారు. ఆపడానికి.. పీకడానికి అమరావతి ఎవరి ఇంట్లోనో పెంచుకున్న పెరటి మొక్క కాదు. జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని. ప్రధాని నమో శంకుస్థాపన చేసిన అమరావతిని ఆపే దమ్ము ఎవరికీ లేదని లోకేశ్ స్పష్టం చేశారు.. ఆయన ఇంకా ఏమన్నారంటే...

ఏపీలో డబుల్ ఇంజన్ సర్కారు

రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జెట్‌స్పీడ్‌తో జరగబోతోంది. ఏపీ కోరిన ప్రతి కోరికను ప్రధాని మోదీ తీరుస్తున్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, నక్కలపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. విశాఖ ఉక్కును కాపాడారు. ఇప్పుడు అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు తిరిగి ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నారు. ఏపీలో ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది. ఒకపక్క నమో.. మరోపక్క మన చంద్రబాబు. రెండూ పవర్ ఫుల్ ఇంజన్లు ఉన్నాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం అనే జోడెద్దుల బండిని పరుగులు పెట్టిస్తున్నారు. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ అజెండాతో పని చేశాం. ఇప్పటికీ మాది అదే అజెండా.

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, వాటిద్వారా 5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఒప్పందాలు కుదుర్చుకున్నాం. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. రూ.1,85,000 కోట్ల పెట్టుబడి, 57వేల మందికి ఉద్యోగాలు కల్పించే ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ విశాఖపట్నం రాబోతోంది. రూ.1,36,000 కోట్ల పెట్టుబడి, 55వేల ఉద్యోగాలు కల్పించే ఆర్సెలార్ మిట్టల్ అనకాపల్లికి వస్తోంది. రూ.97,000 కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాలు కల్పించే బీపీసీఎల్ రామాయపట్నం రాబోతోంది. తిరుపతి జిల్లాకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్, కర్నూలు, కడప, అనంతపురానికి రెన్యువబుల్ ఎనర్జీ, ప్రకాశానికి రిలయన్స్ సీబీజీ, ఉత్తరాంధ్రకు ఫార్మా, ఐటీ ఇలా అన్ని జిల్లాలను అభివృద్ధి చేయబోతున్నాం, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం.

నమో దెబ్బలకు మ్యాప్‌లో పాక్ మిస్

పాకిస్థాన్ గీత దాటింది. అమాయకుల్ని చంపి చాలా పెద్ద తప్పు చేసింది. ఒక్కటి కాదు వంద పాక్‌లు వచ్చినా భారతదేశం నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేరు. వంద పాకిస్థాన్లకు సమాధానం చెప్పే నరేంద్ర మోదీ మిస్సైల్ మనదగ్గర ఉంది. మన సింహం నమో కొట్టే దెబ్బలకు ప్రపంచ పటంలో పాకిస్థాన్ మిస్సింగ్ అని రావడం ఖాయం. పాక్‌కు దీటుగా బదులివ్వడానికి దేశం మొత్తం ప్రధానికి అండగా నిలుస్తుంది. పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులర్పిస్తున్నాం. వారి కుటుంబాలకు దేశం అండగా ఉంటుంది. కులగణన చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒక సంచలనం. ఇతరులు దశాబ్దాలుగా సంకోచిస్తూ వచ్చిన కీలక అంశంపై మోదీ ధైర్యంగా నిర్ణయం తీసుకుని చరిత్రను తిరగరాశారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించాలనే నిబద్ధతకు లోబడి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలకు ఈ నిర్ణయం పరిష్కారం చూపుతుంది' అని లోకేశ్ పేర్కొన్నారు.




ధర్మవరం శాలువా... బందరు కళారూపం

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి సభా వేదికపై ప్రధాని మోదీని ధర్మవరం శాలువాతో సీఎం చంద్రబాబు సన్మానించారు. అలాగే సిల్క్ ఫ్యాబ్రిక్‌పై సహజ రంగులను వినియోగించి ఫ్రీ హ్యాండ్-బ్లాక్ ప్రింటింగ్‌తో ఐకానిక్ అమరావతి టవర్, ప్రధాని మోదీ చిత్రంతో రూపొందించిన కళారూపాన్ని కూడా బహూకరించారు. తన చిత్రంతో ఉన్న బహుమతిని చూసి మోదీ అచ్చెరువొందారు. మచిలీపట్నానికి చెందిన కళాకారులు ఈ కళాకృతిని రూపొందించారు. అంతకుముందు తిరుమల నుంచి వచ్చిన అర్చకులు మోదీకి ఆశీర్వచనం అందించారు.

సైకిల్‌పై వచ్చిన కలిశెట్టి

ఇంద్రకీలాద్రి, మే 2: అమరావతి సభకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పసుపు రంగు సైకిల్‌పై వచ్చారు. విజయవాడలో సైకిల్‌పై బయల్దేరి ముందుగా కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం వెలగపూడి సభకు బయల్దేరారు. అమరావతికి పునర్వైభవం వచ్చిందంటూ సంతోషం వ్యక్తం చేశారు.



తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయం

కేదార్‌నాథ్, మే 2: ఛార్‌ధామ్ యాత్రలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు శుక్రవారం ఉదయం 7గంటలకు తెరుచుకున్నాయి. వివిధ దేశాల నుంచి తెప్పించిన 108 క్వింటాళ్ల వివిధ రకాల పూలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. శుక్రవారం ఉత్తరాఖండ్ సీఎం ధామీతో పాటు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఛార్‌ధామ్ యాత్రలో భాగమైన గంగోత్రి, యమునోత్రి ఆలయాలు గత నెల 30న తెరుచుకోగా.. బద్రినాథ్ ఆలయ ద్వారాలు ఈ నెల 4 నుంచి తెరుచుకోనున్నాయి.

పొలంలో 453కిలోల బాంబు..నిర్వీర్యం చేసిన ఆర్మీ

అహల్యానగర్, మే 2: మహారాష్ట్రలోని ఓ పొలంలో 453 కిలోల భారీ బాంబు బయటపడింది. పేలే అవకాశం చాలా ఎక్కువగా ఉన్న ఆ బాంబును ఆర్మీ సిబ్బంది నిర్వీర్యం చెయ్యడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ బాంబు పేలి ఉంటే.. కిలోమీటరు పరిధిలోని ఇళ్లు, భవనాలన్నీ ధ్వంసమయ్యేవి. నాలుగు కిలోమీటర్ల మేర భూమి అదిరిపోయేది. అహల్యానగర్ జిల్లా వర్వాండి గ్రామంలోని తన పొలంలో పైపులు పగిలిపోగా రాజేందర్ అనే రైతు మార్చి 28న మరమ్మతులు చేపట్టాడు. ఇందులో భాగంగా భూమిని తవ్వగా బాంబు కనిపించింది. అయితే, బాంబును నిర్వీర్యం చేయడానికి అధికారిక అనుమతులు రావడానికి నెలరోజుల సమయం పట్టింది. ఈ నెలరోజులు బాంబు ఉన్న ప్రాంతంలోని ప్రజలను వేరే చోటికి తరలించారు.

ఎమ్మెల్యే పదవికి కర్ణాటక మంత్రి రాజీనామా

▸▸ యత్నాళ్‌పై పోటీకి సిద్ధమని శివానంద పాటిల్ ప్రకటన

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ విసిరిన సవాల్‌ను కర్ణాటక మంత్రి శివానంద పాటిల్ స్వీకరించారు. ఎమ్మెల్యే పదవికి శుక్రవారం రాజీనామా చేసి, యత్నాళ్‌పై పోటీకి సిద్ధమని ప్రకటించారు. మహ్మద్ ప్రవక్త పైగంబర్ గురించి బసనగౌడ పాటిల్ యత్నాళ్ చేసిన వ్యాఖ్యలను ఇటీవల శివానంద పాటిల్ తప్పుబట్టారు. దీనిపై రెండు రోజుల క్రితం యత్నాళ్ స్పందించారు. శివానంద పాటిల్..'పాటిల్' సామాజికవర్గానికి చెందిన వారు కాదని, రాజకీయ లబ్ధికోసమే పెట్టుకున్నారని ఆరోపించారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి శుక్రవారంలోగా రాజీనామా చేసి, తనపై పోటీకి రావాలని సవాల్ విసిరారు.

ఉక్రెయిన్‌తో అమెరికా ఖనిజాల ఒప్పందం

వాషింగ్టన్, మే 2: ఉక్రెయిన్‌తో అమెరికా ఖనిజాల ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజ సంపదను అమెరికా దక్కించుకోనుంది. ఒప్పందంలో ఇంధనం, సహజవాయువులు, హైడ్రోకార్బన్లు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌లోని టైటానియం, యురేనియం, లిథియం, గ్రాఫైట్, మాంగనీస్ ద్వారా అమెరికాకు భారీగా ఆదాయం దక్కనుంది. అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఈ ఒప్పందంపై గట్టిగా పట్టుబట్టిన ట్రంప్ ఇక ఉక్రెయిన్-రష్యా శాంతి చర్చల విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తాజా ఒప్పందం నేపథ్యంలో ఉక్రెయిన్‌కు అమెరికా నిరంతరం సైనిక సాయాన్ని కొనసాగించే అవకాశం ఏర్పడింది.

రిజర్వేషన్లపై 50% పరిమితిని తొలగించండి

సామాజిక, ఆర్థిక, విద్యారంగాల్లో వెనుకబాటుతనం గుర్తింపునకు కులగణన జరపండి: సీడబ్ల్యూసీ

న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జరిగినట్లుగా దేశమంతటా సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని నిర్ధారిస్తూ కులగణన జరిపించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. కులగణన విషయంలో తెలంగాణ నమూనానే దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేసింది. తెలంగాణలో అత్యంత శాస్త్రీయంగా, వివిధ రంగాల్లో వెనుకబాటు తనాన్ని నిర్ధారిస్తూ కులగణన జరిగిందని, మోదీ ప్రభుత్వం ఏ ప్రాతిపదికన కులగణన జరపాలని నిర్ణయిస్తుందో తెలియజేయాలని కోరింది. 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ప్రైవేట్ సంస్థల్లోనూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటు తనాన్ని నిర్ధారించి రిజర్వేషన్లు ప్రకటించేందుకు వీలుగా రాజ్యాంగంలోని 15(5) అధికరణను సవరిస్తారో లేదో చెప్పాలని కోరింది. ఆర్థికంగా వెనుకబాటు తనాన్ని కూడా నిర్ణయించి పదిశాతం రిజర్వేషన్ కల్పించేందుకు 103వ రాజ్యాంగ సవరణను ఏ విధంగా అమలు చేస్తారో తెలియజేయాలని డిమాండ్ చేసింది. బిహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు మాత్రమే కులగణన జరిపిస్తామని ప్రకటించారని, నిజానికి ఆ విషయంలో మోదీ సర్కారుకు చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.




శుక్రవారం సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్, ఖర్గే, సోనియా

గతంలో మా డిమాండ్‌ను వ్యతిరేకించారు

కులగణనను డిమాండ్ చేసిన వారిని మోదీ గతంలో అర్బన్ నక్సల్స్‌గా అభివర్ణించారని, ఆర్ఎస్ఎస్ కూడా కులగణనను వ్యతిరేకించిందని సీడబ్ల్యూసీ గుర్తు చేసింది. కుల గణన ఎప్పుడు జరిపిస్తారో, ఎలా జరిపిస్తారో చెప్పకుండా రాజకీయ ప్రయోజనం పొందేందుకు ఉట్టి ప్రకటనలు చేయడంతో సరిపోదని పేర్కొంది. కులగణనను శాస్త్రీయంగా జరిపించాలని రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా డిమాండ్ చేశారని, తెలంగాణలో అన్నమాట ప్రకారం శాస్త్రీయంగా కులగణన జరిపించారని, ఈ విషయంపై వివిధ సామాజిక వర్గాల్లో చైతన్యం ఏర్పడుతుందని తెలిసినందువల్లే మోదీ సర్కారు దిగి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఒక రకంగా రాహుల్‌గాంధీ వల్లే మోదీ ప్రభుత్వం ఒత్తిడికి గురై కులగణనను జరిపించేందుకు దిగి వచ్చిందని వర్కింగ్ కమిటీలో నేతలు పేర్కొన్నారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లి తెలియజేయాలని సీడబ్ల్యూసీ పిలుపునిచ్చింది.

పహల్గాం దాడిపై చర్యలకు నిర్దిష్ట వ్యూహమేదీ?

పహల్గాం సంఘటనపై కూడా సుదీర్ఘంగా చర్చించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ.. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోకుండా ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించింది. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ప్రభుత్వానికి పూర్తిగా మద్దతు ప్రకటించిందని, కానీ, ఇంతవరకు తమ రణనీతి ఏమిటో ప్రభుత్వం వెల్లడించలేదని పేర్కొంది. దేశ ఐక్యత, సమగ్రతకు ఏ సవాళ్లు ఎదురైనా వాటిపై పోరాడేందుకు తాము కలిసికట్టుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ మరోసారి స్పష్టం చేసింది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. భారత్‌పైకి ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ దేశ సమగ్రతను, ఐక్యతను దెబ్బతీసేందుకు యత్నిస్తున్న పాక్ పట్ల కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వ్యూహంతో ధృడమైన చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను ఒంటరిని చేసేలా సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించింది. భారత్ మొత్తం ఒక్కటిగా ఉందని, ఎవరూ విడదీయలేరనే సందేశాన్ని పాక్‌కు ఇవ్వాలని పేర్కొంది.



21 ఏళ్లు.. 12 పెళ్లిళ్లు

వివాహమైన వెంటనే నగలు, నగదుతో పరార్

యూపీలో 'దొంగ పెళ్లి కూతురు' అరెస్టు

లఖ్‌నవూ, మే 2: గుజరాత్‌కు వెళ్తే ఆమె పేరు కాజల్, హరియాణాలో ఉంటే సీమా, బిహార్‌లో నేహా, ఉత్తరప్రదేశ్‌లో అయితే ఆమె పేరు స్వీటీ. అసలు పేరు మాత్రం గుల్నానా రియాజ్ ఖాన్. వయసు 21 ఏళ్లు. ఇప్పటికే 12 సార్లు పెళ్లిళ్లు చేసుకుంది. అందర్నీ మోసగించి ఉడాయించింది. అసలు భర్త రియాజ్ ఖాన్ ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఈ దొంగ పెళ్లిళ్ల వ్యవహారం అతడికి పూర్తిగా తెలుసు. ప్రతి పెళ్లికి 5% సొమ్మును కమీషన్‌గా కూడా తీసుకుంటున్నాడు. హడావిడిగా పెళ్లి సంబంధం కుదుర్చుకోవడం, ఘనంగా వివాహం చేసుకోవడం, పెళ్లి తంతు ముగిసిన కొద్ది గంటల్లోనే కిడ్నాప్ నాటకమాడి నగలు, నగదుతో పరారు కావడం ఆమెకు నిత్యకృత్యం. ఆ 'దొంగ పెళ్లి కూతురు' (డాకూ దుల్హన్) ఎట్టకేలకు గురువారం అంబేడ్కర్ జిల్లాలోని కనదాహా గ్రామంలో పోలీసులకు చిక్కింది. ఆమెతో పాటు ముఠాలోని మరో 8మందిని అరెస్టు చేశారు. ఈ ముఠాలో గుల్నానాతోపాటు అయిదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. పలు రాష్ట్రాల్లో దొంగ పెళ్లిళ్ల రాకెట్‌ను ఆ ముఠా చాలా వ్యూహాత్మకంగా నిర్వహించింది. వివాహ వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతగా ప్రయత్నించినా కుమారులకు పెళ్లి చేయలేకపోతున్న కుటుంబాలను మొదట గుర్తించేది. మహిళలు పెళ్లి మాటలు కలిపి ఆ కుటుంబాల నమ్మకం పొందేవారు. గుల్నానాను సంబంధించిన నకిలీ పత్రాలు చూపించి సంబంధాన్ని ఒకే చేసుకునేవారు. సంబంధం కుదిర్చినందుకు 'సెటిల్‌మెంట్ అమౌంట్' కూడా మాట్లాడుకునేవారు. హడావిడిగా పెళ్లి ఏర్పాట్లు చేయించే వారు. పెళ్లి తంతు ముగియగానే మగవారు బైకులపై వచ్చి ఆమెను 'కిడ్నాప్' చేసే వారు. నగదు, నగలు దక్కించుకునేవారు.

వేదికపై మోదీతో థరూర్

ఇక చాలామందికి నిద్ర లేని రాత్రులేనని 'ఇండీ' కూటమిని ఉద్దేశించి ప్రధాని విసుర్లు



తిరువనంతపురం, మే 2: తిరువనంతపురంలో విజింజమ్ పోర్టును ప్రధాని మోదీ శుక్రవారం లాంఛనంగా జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధాని మోదీతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ వేదికను పంచుకొన్నారు. కేరళ సీఎం విజయన్ కూడా వేదికపై ఉన్నారు. ఈ నేపథ్యంలో.. సభలో మోదీ ప్రసంగిస్తూ.. థరూర్ తనతో వేదికపై ఉండడం చూసి చాలా మంది ఇండియా కూటమి నాయకులకు నిద్ర లేని రాత్రిళ్లు తప్పవని ఎద్దేవా చేశారు. హిందీలో ఆయన మాట్లాడిన మాటలను కచ్చితంగా అనువదించలేక అనువాదకుడు ఇబ్బందిపడ్డారు. ప్రధాని వెంటనే స్పందిస్తూ.. సందేశం చేరాల్సిన వారికి చేరిపోయిందని చమత్కరించారు. థరూర్ అప్పుడప్పుడూ కాంగ్రెస్ వైఖరికి విరుద్ధంగా విజయన్ ప్రభుత్వ కార్యక్రమాలను, మోదీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించడం.. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, అధిష్ఠానం ఆయనపై అసంతృప్తిగా ఉండడం తెలిసిందే.

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ, మే 2: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు శుక్రవారం ఇక్కడి ప్రత్యేక కోర్టు నోటీసులు పంపించింది. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన స్థిరాస్తుల బదలాయింపులో మనీలాండరింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వారిపై కేసు నమోదు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే..నిందితులకు వాదన వినిపించే హక్కు ఉందని పేర్కొంటూ నోటీసులు జారీ చేశారు. ఏ దశలోనయినా వినిపించే హక్కు కలిగించడం న్యాయమైన విచారణకు ఊపిరిపోస్తుందని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను ఈ నెల ఎనిమిదో తేదీకి వాయిదా వేశారు. మూతపడిన నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తుల బదలాయింపులో కాంగ్రెస్ నాయకులు క్రిమినల్ కుట్రకు, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి 2014లో ప్రయివేటు క్రిమినల్ కంప్లయింట్ దాఖలు చేశారు. 2021 నుంచి ఈడీ దీనిపై దర్యాప్తు చేస్తోంది.



రోడ్డుపై ఫైటర్ జెట్ల ల్యాండింగ్, టేకాఫ్

▸▸ గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన విన్యాసాలు

న్యూఢిల్లీ, మే 2: భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధ విమానాల టేకాఫ్, ల్యాండింగ్ సామర్థ్యాన్ని భారత వాయుసేన పరిశీలించింది. యుద్ధం లేదా, జాతీయ అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు, ఫైటర్ జెట్లు రహదారిపై టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేందుకు వీలుగా యూపీలోని షాజహాన్‌పూర్ జిల్లాలో గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై 3.5 కిలోమీటర్ల పొడవైన ఎయిర్‌స్ట్రిప్‌ను నిర్మించారు. అత్యాధునిక లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలు ఉన్న దీనిపై పగలు, రాత్రి ఎప్పుడైనా యుద్ధ విమానాలను ల్యాండింగ్, టేకాఫ్ చేయవచ్చు. ఇలా ఉదయం-రాత్రి ల్యాండింగ్, టేకాఫ్ చేసే వీలున్న హైవే ఎయిర్‌స్ట్రిప్ భారత్‌లో ఇదే మొదటిది. అలాగే.. ఉత్తరప్రదేశ్‌లోని హైవేలపై నిర్మించిన ఎయిర్‌స్ట్రిప్‌ల్లో ఇది నాలుగోది. గతంలో ఆగ్రా-లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వే, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వేలపై కూడా రన్‌వేలు నిర్మించారు. తాజాగా గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై జలాలాబాద్ వద్ద నిర్మించిన రన్‌వేను శుక్రవారం ప్రారంభించిన వాయుసేన ఉదయం, రాత్రి వేళ రెండు దశల్లో దీన్ని పరిశీలించింది. ఈ క్రమంలో చేపట్టిన విన్యాసాల్లో రాఫెల్, సుఖోయ్-30 ఎంకేఐ, మిరాజ్-2000, మిగ్-29, జాగ్వార్, సీ-130జే సూపర్ హెర్క్యులస్, ఏఎన్-32 యుద్ధ విమానం, ఎంఐ-17 వీ5 హెలికాప్టర్లు పాల్గొన్నాయి.

ఆయుధ కర్మాగారాల సిబ్బంది సెలవులు రద్దు

న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా ఉన్న 41 ఆయుధ కర్మాగారాలు, 7 ఆయుధ డిపోల్లో సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. దేశ భద్రతా చర్యల్లో భాగంగా ఈ అత్యవసర ఆదేశాలు తక్షణమే అమలు చేయాలని సూచించింది. ఉద్యోగులంతా తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. మరోవైపు అన్ని కర్మాగారాలు, డిపోల్లో రానున్న నెలలకు సరిపడా ఆయుధ నిల్వలున్నాయని, అవసరమైతే ఉత్పత్తి పెంచడానికి సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. సరిహద్దులకు సరిపడా ఆయుధాలను తరలించినట్లు తెలిపాయి.

ఢిల్లీలో ఏపీ భవన్‌కు బాంబు బెదిరింపు

▸▸ ఆడిటోరియంలో బాంబు పెట్టినట్టు దుండగుడు మెయిల్

న్యూఢిల్లీ, మే 2(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఏపీ భవన్‌లో బాంబు పెట్టినట్లు శుక్రవారం రాత్రి బెదిరింపు మెయిల్ వచ్చింది. భవనంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో బాంబు పెట్టినట్లు ఆ మెయిల్‌లో దుండగుడు పేర్కొన్నాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ వెంటనే భవన్ భద్రత నిర్వర్తిస్తున్న తెలుగు రాష్ట్రాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఢిల్లీ పోలీసులు, తెలుగు పోలీసులు ఆడిటోరియంలో జాగిలాలతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కాగా, ఈ ఆడిటోరియాన్ని ఇటీవలే ఆధునీకరించారు. సాంఘిక వివక్ష ఇతివృత్తంతో నిర్మించిన ఫూలే సినిమా ఈ ఆడిటోరియంలో ప్రదర్శించడానికి అధికారులు రెండు రోజుల ముందే నిర్ణయించారు. శుక్రవారం రాత్రి 8.30కు సినిమా ప్రదర్శించడానికి సాంకేతిక సిబ్బంది సిద్ధమయ్యారు. ఈ సమయంలో దుండగుడు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌కు మెయిల్ చేసి బాంబు పెట్టినట్లు బెదిరించాడు. ఆ సమయంలో ముంబైలో ఉన్న లవ్ అగర్వాల్ తక్షణం స్పందించి ఇక్కడి అధికారులను అప్రమత్తం చేశారు. వారు భద్రత విధులు నిర్వహించే తెలుగు రాష్ట్రాల పోలీసులకు, ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వెంటనే తనిఖీలు చేపట్టారు. బాంబు లేకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఫూలే సినిమా నిలిపివేలాలనే ఉద్దేశంతోనే దుండగుడు బాంబు బెదిరింపులకు పాల్పడ్డాడని పోలీసులు అంచానాకు వచ్చారు.

10రోజులు..10 లక్షల సైబర్ దాడులు

పహల్గాం ఘటన తర్వాత రెచ్చిపోయిన పాక్ హ్యాకర్లు

ముంబై, మే 2: పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్ హ్యాకర్లు భారత్‌పై సైబర్ దాడులు ముమ్మరం చేశారు. గత పది రోజుల్లోనే ఏకంగా పది లక్షల సైబర్ దాడులకు పాల్పడ్డారు. మహారాష్ట్ర సైబర్ విభాగం తమ నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. భారత్‌లోని వెబ్ సర్వర్లపై.. ముఖ్యంగా రక్షణ, టెలికం, రవాణా, విద్య వంటి కీలక రంగాలకు చెందిన పోర్టళ్లపై పాక్ హ్యాకర్లు దాడులకు దిగినట్టు తెలిపింది. సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడం, నిఘా పెట్టడంతోపాటు జాతీయ భద్రతను దెబ్బతీసేందుకు పాక్ హ్యాకర్లు ప్రయత్నిస్తున్నట్టు వెల్లడించింది. కేంద్ర నిఘా సంస్థలు ఈ వ్యవహారంపై దృష్టిపెట్టాయని, సైబర్ భద్రతను కట్టుదిట్టం చేసే చర్యలు చేపట్టాయని తెలిపింది. జమ్మూ మున్సిపల్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌ను కూడా హ్యాక్ చేసి కీలకమైన సమాచారాన్ని తస్కరించినట్టు సమాచారం. కాగా, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు చెందిన యూట్యూబ్ చానల్‌ను భారత్‌లో నిషేధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

పాక్ ఉగ్రవాద చరిత్రలో రహస్యమేమీ లేదు: బిలావల్

న్యూఢిల్లీ, మే 2: పాకిస్థాన్ ఉగ్రవాద చరిత్ర అంత రహస్యమేమీ కాదని.. ఏనాటి నుంచో దశలు, దశలుగా కొనసాగుతూ వస్తోందని ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో అంగీకరించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "మొదటి అఫ్ఘన్ యుద్ధం సమయంలో ముజాహిదీన్‌లకు ఆర్థికంగా, నైతికంగా తోడ్పాటు ఇచ్చాం. పశ్చిమ దేశాలతో కలసి ఆ పనిచేశాం. తర్వాత దశలు దశలుగా అది కొనసాగింది. దానితో ఇబ్బందిపడ్డాం. ఇటీవలి కాలంలో పరిస్థితిలో మార్పు వచ్చింది. అది మా దేశ చరిత్రలో దురదృష్టకర భాగం. కానీ మేం దాని నుంచి పాఠాలు నేర్చుకున్నాం." అని పేర్కొన్నారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భుట్టో వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

మూడు సంస్థల.. ముష్కర దాడే!



▸▸ పహల్గాం ఘటన వెనుక లష్కరే తాయిబా, పాక్ ఆర్మీ, ఐఎస్ఐ హస్తం

▸▸ ప్రాథమిక దర్యాప్తులో తేల్చిన ఎన్ఐఏ!

న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేపట్టిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ).. లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థతోపాటు పాక్ ఆర్మీ, ఆ దేశ నిఘా సంస్థ ఐఎస్ఐల హస్తం ఉన్నట్లుగా తేల్చింది. పాక్ ఆర్మీ, ఐఎస్ఐల ఆదేశాల మేరకే.. లష్కరే తాయిబా సంస్థ ప్రధాన కార్యాలయంలోనే ఈ దాడికి ప్రణాళిక రచించినట్టు అంచనా వేసింది. ఎన్ఐఏ ప్రాథమిక దర్యాప్తు నివేదికలో ఈ వివరాలను పొందుపర్చినట్టు తెలిసింది. రక్షణ శాఖ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ ఆంగ్ల మీడియా సంస్థలు ఈ వివరాలను వెల్లడించాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా.. ఉగ్రవాదులకు స్థానికంగా సహకారం అందించిన పలువురిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుని ప్రశ్నించింది. ఈ క్రమంలోనే పహల్గాం ఉగ్రదాడిలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు పాకిస్థాన్ ఉగ్రవాదులు హష్మి మూసా (అలియాస్ సులేమాన్), అలీభాయ్ (అలియాస్ తల్హా భాయ్).. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నేతలతో సంప్రదింపులు జరిపినట్టుగా గుర్తించింది.

ఘటనా స్థలం త్రీడీ మ్యాపింగ్..

ఉగ్రదాడి జరిగిన బైసరన్ ప్రాంతంలో అత్యాధునిక సాంకేతికత ఆధారంగా ఎన్ఐఏ పరిశీలన జరిపింది. మొత్తంగా 40 తూటా కాట్రిడ్జ్‌లను గుర్తించి, ఫోరెన్సిక్ రసాయన విశ్లేషణకు పంపింది. లైడార్ పరిజ్ఞానం, డ్రోన్ల వీడియోలు, శాటిలైట్ చిత్రాల సాయంతో ఘటనా స్థలం మొత్తాన్ని త్రీడీ మ్యాపింగ్ చేసి.. ఉగ్రవాదులు రాక, దాడి, తిరిగి పారిపోయిన అంశాలపై ఆధారాలను సిద్ధం చేసింది. అదే సమయంలో ఘటనకు ముందు, తర్వాత బైసరన్, పరిసర ప్రాంతాల్లో శాటిలైట్ ఫోన్ల వినియోగం వివరాలను సేకరించింది. మొత్తం మూడు శాటిలైట్ ఫోన్లు వినియోగించినట్టు గుర్తించగా, ఇప్పటివరకు అందులో రెండింటి సిగ్నళ్లను గుర్తించి, విశ్లేషించింది. పహల్గాం ఘటనకు సంబంధించి ఎన్ఐఏ, ఇతర భద్రతా సంస్థలు కలిసి కుప్వారా, పుల్వామా, సపోర్, అనంత్‌నాగ్, బారాముల్లా తదితర జిలాల్లో విస్తృతంగా తనిఖీలు చేసి, 2,800 మందికిపైగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇందులో 150 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నట్టు సమాచారం. మరోవైపు దాడి చేసి పారిపోయిన ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోంది. వారు దట్టమైన అడవుల్లో దాక్కున్నారని భద్రతా బలగాలు తెలిపాయి.

రెండు నెలలకు సరిపడా.. ఆహారం నిల్వ చేసుకోండి

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ప్రజలు రెండు నెలలకు సరిపడా ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవాలని అక్కడి ప్రభుత్వం సూచించింది. 'పహల్గాం' నేపథ్యంలో భారత్ ఏ క్షణమైనా దాడికి దిగవచ్చనే ఆందోళనతో ఈ పిలుపునిచ్చింది. పీఓకే ప్రధాని చౌదరి అన్వరుల్ హక్ శుక్రవారం స్థానిక అసెంబ్లీలో ఈ విషయాన్ని వెల్లడించినట్టు అరబ్ న్యూస్ వార్తాసంస్థ తెలిపింది. ముఖ్యంగా నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలకు ఇప్పటికే ఈ సూచన చేసినట్టుగా అన్వరుల్ చెప్పారని.. ఆహారం, మందులు, ఇతర అవసరాల కోసం వంద కోట్ల పాక్ రూపాయలతో అత్యవసర నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారని వెల్లడించింది.

ఆర్థిక దిగ్బంధనంలో పాక్!

▸▸ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాకిస్థాన్‌ను తిరిగి చేర్చేలా భారత్ యత్నాలు

న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ లక్ష్యంగా పలు కఠిన చర్యలు తీసుకుంటున్న కేంద్రప్రభుత్వం.. ఆర్థిక పరమైన దిగ్బంధనం దిశగానూ అడుగులు వేస్తోంది. ముఖ్యంగా, సీమాంతర ఉగ్రవాదానికి ఆ దేశం ఎంతమాత్రమూ మద్దతివ్వకుండా ఉండేలా.. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా ఆంక్షలు విధింపజేయాలని యోచిస్తోంది. దీంట్లోభాగంగా.. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)లోని ఇతర సభ్యదేశాలతో సంప్రదింపులు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. పాక్‌ను తిరిగి ఎఫ్ఏటీఎఫ్ 'గ్రే లిస్టు'లో పెట్టేలా భారత్ పావులు కదుపుతోంది. ఈ ప్రయత్నాలు ఫలిస్తే.. పాకిస్థాన్ ఆర్థిక కార్యకలాపాలపై నిఘా పెరుగుతుంది. ఫలితంగా ఆ దేశానికి విదేశీ పెట్టుబడులు తగ్గుతాయి. ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ ఏటా మూడుసార్లు (ఫిబ్రవరి, జూన్, అక్టోబరులో) సమావేశమవుతుంది. వచ్చే జూన్‌లో జరిగే ప్లీనరీలో పాక్‌ను గ్రే లిస్టులో పెట్టే ప్రతిపాదనను భారత్.. సభ్యదేశాల ముందు ఉంచనుంది. మరోవైపు, పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇవ్వనున్న రూ.59,000 కోట్ల ఆర్థిక ప్యాకేజీపైనా గట్టిగా స్పందించాలని కేంద్రం భావిస్తోంది. ఈ భారీ ప్యాకేజీ ఉగ్రసంస్థల కార్యకలాపాలకు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని, కాబట్టి, ఆ సాయాన్ని నిలిపివేయాలని ఐఎంఎఫ్‌ను కోరే అవకాశం ఉంది.

'పహల్గాం'పై అమెరికా డబుల్ గేమ్!

న్యూఢిల్లీ, మే 2: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో గత నెలలో జరిగిన ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో అమెరికా వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. ఒకవైపు భారత్‌కు అన్ని విధాలా మద్దతు ప్రకటిస్తున్నామని చెబుతూనే.. మరోవైపు అధ్యక్షుడు ట్రంప్ సహా ఇతర నేతలు చేస్తున్న వ్యాఖ్యలు డబుల్ గేమ్‌ను తలపిస్తున్నాయని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్, పాకిస్థాన్‌లు సంయమనం పాటించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్ తుల్సి గబ్బార్డ్ మాత్రం ఉగ్రవాదుల ఏరివేతలో భారత్‌కు పూర్తి మద్దతుగా నిలుస్తామని చెబుతున్నారు. వాస్తవానికి ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు ట్రంప్ 2.0 ప్రభుత్వం బలమైన సంకేతాలు పంపిస్తుందని భావించినా.. ప్రస్తుతం అనుసరిస్తున్న తటస్థ వైఖరి రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశం అయిందని నిపుణులు చెబుతున్నారు. కశ్మీర్ వివాదానికి సంబంధించి మధ్యవర్తిత్వం చేస్తానని తన తొలి పాలనలో ప్రకటించిన ట్రంప్.. "కశ్మీర్ విషయాన్ని ఆ రెండు దేశాలే ఏదో ఒక మార్గంలో పరిష్కరించుకుంటాయి. నాకు భారత్, పాకిస్థాన్‌లు రెండూ దగ్గరే" అని గత వారం వ్యాఖ్యానించారు. భద్రతా సంబంధిత మినహాయింపుల్లో భాగంగా ఇటీవల 5.3 బిలియన్ డాలర్లను మంజూరు చేశారు. అదేవిధంగా ఎఫ్-16 యుద్ధ విమానాల నిర్వహణ కోసం 400 మిలియన్ డాలర్లకు ఆమోదం తెలిపారు. చిత్రం ఏంటంటే.. తన తొలిపాలనలో పాకిస్థాన్‌పై ట్రంప్ నిప్పులు చెరిగారు.

భారత్ యుద్ధాన్ని నివారించాలి: వాన్స్

పహల్గాం దాడికి ప్రతీకారంగా యుద్ధానికి దిగాలని భావిస్తే.. భారత్ దానిని నివారించాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారు. ఫాక్స్ న్యూస్‌తో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చర్యలు తీసుకున్నప్పటికీ.. అది విస్తృత సంఘర్షణలకు దారితీయని భావిస్తున్నట్టు తెలిపారు. "పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులను గుర్తించే క్రమంలో భారత్‌కు ఆ దేశం సహకరించాలి. ఈ విషయంలో పాక్ సహకరిస్తుందనే ఆశిస్తున్నాం" అని వాన్స్ అన్నారు.

భారత్‌కు సంయమన మంత్రం

పహల్గాం ఉగ్రదాడిపై స్పందించిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్.. సంయమనం పాటించాలని సూచించారు. నిజానికి పహల్గాం ఉగ్రదాడి జరిగి, 26 మంది మృతి చెందిన సమయంలో ఆయన కుటుంబంతో సహా భారత్‌లోనే ఉన్నారు. అయినప్పటికీ ఆయన భారత్ సంయమనం పాటించాలని చెప్పడం గమనార్హం. ఇదేసమయంలో "పాక్ తన బాధ్యత మేరకు నడుచుకోవాలి." అని ఊరుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.